





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


## ఆరోగ్యశ్రీలో అదనంగా 65 కొత్త చికిత్సలు

రూ.487 కోట్లు విడుదల చేసిన మంత్రి భట్టి విక్రమార్క



03


సంపుటి 26, సంచిక: 350 | ఆదివారం | 09-06-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00




## ఈనాడు సంస్థల అధినేత
# రామోజీరావు అస్తమయం

**నేడు అధికారిక లాంఛనాలతో ఫిలింసిటీలో అంత్యక్రియలు**

**పలువురు రాజకీయ, సినీప్రముఖుల నివాళి**

ప్రజాపక్షం/హైదరాబాద్

ఈనాడు గ్రూపు సంస్థల అధినేత,పద్మవిభూషణ్ రామోజీ రావు శనివారం మృతి చెందారు.గుండె సంబంధిత సమస్యతో హైదరాబాద్‌లని నానాక్ రామ్‌గూడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో రామోజీరావు శనివారం తెల్లవారు జామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఫిలింసిటీలో రామోజీ రావు అంత్యక్రియలను ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య నిర్వహించ నున్నారు. ప్రజల సందర్శనార్థం రామోజీ రావు పార్థివదేహాన్ని రామోజీ ఫిలింసిటీలోని కార్పొరేట్ కార్యాలయంలో పెట్టారు. పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, సినీ ప్రముఖులు రామోజీరావు పార్థివదేహాన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు. కాగా రాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో రామోజీరావు అంత్యక్రియలు ఆదివారం జరగనున్నాయి.దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. అంత్యక్రియ ఏర్పాట్లను పర్యవేక్షించాలనిప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**రామోజీరావులో సృజనాత్మకత**

కృష్ణా జిల్లా పెదపారుపూడిలో చెరుకూరి వెంకట సుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు 1936 నవంబర్ 16న రామోజీరావు జన్మించారు. అక్కలు రాజ్యలక్ష్మి, రంగనాయకమ్మ తర్వాత రామోజీరావు జన్మించారు. రామోజీకి ఆయన తాతయ్య రామయ్యఅని పేరు పెట్టారు. బడిలో ఉపాధ్యాయునికి తన పేరును రామోజీ రావుగా చెప్పుకున్నారు. ప్రాథమిక విద్యపూర్తయిన తర్వాత పైచదువుల తరువాయి 8లో







# ప్రతిపక్ష నేతగా రాహుల్‌గాంధీ



**కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం ఏకగ్రీవ విజ్ఞప్తి**

**అతిత్వరలో నిర్ణయం తీసుకుంటా**

**పార్టీ అగ్రనాయకత్వానికి తెలిపిన రాహుల్**

**ఫలితాల అనంతరం తొలిసారి సిడబ్ల్యుసి సమావేశం**

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడి బాధ్యతను స్వీకరించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం ఏకగ్రీవంగా విజ్ఞప్తి చేసింది. దీనిపై అతి త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని పార్టీ అగ్రనాయకత్వానికి రాహుల్‌గాంధీ తెలియజేశారు. లోక్‌సభ ఫలితాల అనంతరం తొలిసారిగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) శనివారం ఢిల్లీలో సమావేశమైంది. ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ భేటీకి కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయాలను ప్రశంసిస్తూనే, ఆశించిన లేదా సరైన ఫలితాలు సాధించని రాష్ట్రాలలో దిద్దుబాటు చర్యలకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని సిడబ్ల్యుసి నిర్ణయించింది. సిడబ్ల్యుసి సమావేశం రెండు తీర్మానాలను ఆమోదించింది. వాటిలో ఒకటి లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడి హోదాను అంగీకరించాలని రాహుల్ గాంధీని కోరుతూ చేసిన తీర్మానం కాగా, మరొకటి లోక్‌సభ ఎన్నికల ఫలితాలలో 2014 నుండి ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్లక్ష్యం చేయడానికి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారని తీర్మానించింది. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడి బాధ్యతలు స్వీకరించేందుకు రాహుల్ గాంధీ అంగీకరించారా? అని సమావేశం అనంతరం ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్‌ను మీడియా ప్రశ్నించగా, ఆయన సిబ్ల్యుసి సభ్యుల మనోభావాలను అర్థం చేసుకున్నారని, అతి త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని వారికి చెప్పారని తెలిపారు. " ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు, గణతంత్ర రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు, సామాజిక, ఆర్థిక న్యాయాలను మెరుగుపరిచేందుకు ఓటు వేసిన దేశ ప్రజలను సిడబ్ల్యుసి సమావేశం అభినందించింది. గత పదేళ్ళ పరిపాలన విధానాన్ని, ధోరణిని ప్రజలు నిష్కర్షగా తిరస్కరించాలని ఒక తీర్మానంలో పేర్కొన్నారు. అబద్ధాలు, ద్వేషం, అపోహలు, తరువాయి 2లో



తన పేరుతో ప్రజల తీర్పున కోరిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లోక్‌సభ ఫలితాలు కేవలం రాజకీయ నష్టమే కాకుండా, ఆయనకు వ్యక్తిగతమైన, నైతికమైన ఓటమి అని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) వ్యాఖ్యానించింది. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఫలితాల పట్ల సంతృప్తి వ్యక్తం చేసింది. గడిచిన పదేళ్ళలో చూసిన ప్రభుత్వ విధానాన్ని ప్రజలు నిష్కర్షగా తిరస్కరించారని పేర్కొంది. ఢిల్లీలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన కొన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ నిరుత్సాహకరమైన ఫలితాలను సాధించడాన్ని పరగణలోకి తీసుకుంటూ, ఆయా రాష్ట్రాలలో లోపాలను తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిడబ్ల్యుసి నిర్ణయించింది.

# కొత్తమంత్రులెవరో?

**నేడు ప్రధానిగా మోదీ ప్రమాణస్వీకారం**



**ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు**

**రెండురోజులపాటు నో ఫ్లయింగ్‌జోన్‌ల ప్రకటన**

మంత్రి పదవులపై బిజెపి నాయకత్వం, మిత్రపక్షాలు తీవ్రమైన చర్యలు జరిపాయి. బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాతో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ వంటి పార్టీ సీనియర్ నేతలు ప్రభుత్వంలో ప్రాతినిధ్యానికి సంబంధించి తెలుగుదేశం పార్టీకి చెందిన ఎన్ చంద్రబాబు నాయుడు, జెడి(యు)కు చెందిన నితీశ్ కుమార్, శివసేనకు చెందిన ఏక్నాథ్ షిండేతో సహా మిత్రపక్షాలతో సంప్రదింపులు జరుపుతున్నారు. విద్య, సంస్కృతితో పాటు హోం, ఆర్థిక, రక్షణ, విదేశీ వ్యవహారాలు వంటి బలమైన శాఖలను బిజెపి తనవదే ఉంచుకోవాలని భావిస్తోంది. దాని మిత్రపక్షాలకు ఐదు నుంచి ఎనిమిది క్యాబినెట్ బెర్త్‌లను ఇవ్వవచ్చని తెలుస్తుంది. కొత్త కేబినెట్‌లో అయితే బిజెపి

**న్యూఢిల్లీ :** భారత ప్రధానిగా మూడవసారి ప్రమాణం చేసేందుకు నరేంద్రమోదీ అంతా సిద్ధం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం 7.15 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో మోదీ ప్రధానిగా ప్రమాణం చేస్తారు. మూడవసారి ప్రమాణం చేస్తూ దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఘనతను సమం చేయనున్నారు. కొత్త ప్రభుత్వంపై నేషనల్ డెమోక్రటిక్ కూటమిలోని వివిధ పార్టీలకు తరువాయి 2లో

# మూసీలో తెగ తోడేస్తున్నారు..!

**ఆగని ఇసుక అక్రమరవాణా**

**తుంగతుర్తి నియోజకవర్గంలోనే అధికం**

**పట్టించుకోని అధికారులు**

**నెలవారీ మామూళ్ళతో సరి..?**



ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి

అక్రమార్కులు మూసీలో ఇసుకను తెగ తోడేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణపై సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ చెక్ పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినా ఇసుక అక్రమ రవాణ మాత్రం ఏ మాత్రం ఆగడం లేదు. సూర్యాపేట జిల్లాలో తుంగతుర్తి నియోజకవర్గంలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో ఈ అక్రమ ఇసుక రవాణ అధికంగా జరుగుతుంది. దీనిని కట్టడి చేయాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు మాత్రం పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే రాజకీయ నేతల పేర్లు చెబుతూ దాటవేస్తున్నారు. ఇందులో అధికారులకు నెలవారి మాముళ్ళతో సరి పెట్టుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తుంగతుర్తి నియోజకవర్గంలోని మూసీ పరివాహక ప్రాంతాల్లోని అర్వపల్లి, నాగారం మండలాల్లో అక్రమ ఇసుక రవాణ జోరుగా సాగుతుంది. అలాగే తిరుమలగిరి మండల పరిధిలోని మూసీలో కలిసే బిక్కేరు వాగు నుండి రోజుకు వందలాది లారీలు, ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతుంది. ఇక్కడ నుండి అక్రమ రవాణ అవుతున్న ఇసుక రాష్ట్ర రాజధాని హైద్రాబాద్‌తో పాటు సూర్యాపేట జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. ఇదే నియోజకవర్గ పరిధిలోని నూతనకల్ మండలం నుండి పాలేరుకు వెళ్ళే వాగులో నూతనకల్, మిర్యాల, తాళ్ళ సింగారం, యడవెల్లి, పెదనెమిల, చిన్ననెమిల, బిక్కుమళ్ళ గ్రామాల్లో, మద్దిరాల మండలంలోని కొత్తగూడెం, జి కొత్తపల్లి, ముకుందాపురం గ్రామాల నుండి పెద్ద ఎత్తున ట్రాక్టర్‌లో ఇసుక అక్రమ రవాణ జరుగుతుంది. ప్రభుత్వ నిర్ణయంతో స్థానిక శాసన సభ్యులు మందుల సామేల్ సైతం స్పందిస్తూ మూసీ వాగు వద్దకు వెళ్లి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోని హడాహుడి చేశారు. అక్రమ ఇసుక రవాణ చేస్తే ఎంతటివారినైనా వదిలి పెట్టేది లేదంటూ హెచ్చరించారు. మూసీ వాగులోకి వచ్చిన జెసిబిలు, లారీలు, ట్రాక్టర్లను వదిలి పెట్టొద్దని అధికారులను తరువాయి 2లో

# నీట్‌–యుజి వివాదంపై సమీక్షా కమిటీ ఏర్పాటు

**వారం రోజుల్లో సిఫార్సుల నివేదిక**

**అక్రమాలు జరగలేదని ఎన్‌టిఎ బుకాయింపు**



**న్యూఢిల్లీ :** నీట్‌–యుజి పరీక్షా ఫలితాలపై పెద్ద వివాదం చెలరేగడంతో ఈ విషయంపై సమీక్ష చేయడానికి కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ నలుగురు సభ్యులతో ఒక కమిటీ నియమించినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ) ప్రకటించింది. 1,500 మంది పైగా అభ్యర్థులకు ఈ పరీక్షల్లో ఇచ్చిన గ్రేస్ మార్కులపై ఈ నలుగురు సభ్యుల కమిటీ సమీక్ష నిర్వహిస్తుందని ఎన్‌టిఎ చెప్పింది. ఈ పరీక్షల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని ఎన్‌టి బుకాయించింది. పరీక్షలు తిరిగి నిర్వహించాలా? వద్దా? అనే విషయాన్ని కమిటీ సిఫార్సుల మేరకే నిర్ణయిస్తామని ఎన్‌టిఎ స్పష్టం చేసింది. ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల్లో చేసిన మార్పులు చేర్పులు, పరీక్షా కేంద్రాలలో సమయం కోల్పోయిన విద్యార్థులకు ఇచ్చిన గ్రేసు మార్కులు వంటి కొన్ని కారణాలే కొందరు విద్యార్థులు ఎక్కువ మార్కులు సంపాదించడం వెనుక కొన్ని కారణాలై ఉంటాయని ఎన్‌టిఎ పేర్కొంది. నీట్‌–యు పరీక్షల్లో జరిగిన అక్రమాలు, అవినీతిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) డిమాండ్ చేయడంతో ఈ వివాదం రాజకీయ మలుపు తరువాయి 2లో



## మూడు రోజుల్లో రాష్ట్రమంతటా
# నైరుతి విస్తరణ


ప్రజాపక్షం/హైదరాబాద్

ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి నిజామాబాద్ వరకు నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. మరో రెండు, మూడు రోజుల్లో రాష్ట్రమంతా రుతుపవనాలు విస్తరించనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఉపరితల ఆవర్తనం బలహీనపడిందన్నారు. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో తెలిక పాటి నుంచి మోస్తరు తరువాయి 8లో

# నేడు 'గ్రూప్ 1 ప్రిలిమ్స్' పరీక్ష

**ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఛాన్స్**

**ప్రతి 20 సెంటర్లకు రీజనల్ కోఆర్డినేటర్లు**



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిఎస్‌పిఎస్‌సి) గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం జరగనుంది. అభ్యర్థులు ఉదయం పది గంటలలోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అధికారులు అనుమతించబోరు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష జరగనుండగా, పరీక్షా కేంద్రాలకు ఉదయం 10 గంటలలోపే చేరుకోవాలని ఇది వరకే టిఎస్‌పిఎస్‌సి వెల్లడించింది. పరీక్షకు సంబంధించి టిఎస్‌పిఎస్‌సి పకడ్బందిగా ఏర్పాట్లు చేయడంతో పాటు బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 4.03 లక్షల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానుండగా, 897 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి 20 పరీక్ష కేంద్రాలకు రీజనల్ కో ఆర్డినేటర్లను నియమించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్స్ మూడు నుంచి ఐదు పరీక్ష కేంద్రాలను పరిశీలించనున్నారు. హాల్‌టికెట్లను గుర్తింపు కార్డులను గుర్తించేందుకు వంద మంది అభ్యర్థులకు ఒక్కరి చొప్పున అధికారిని నియమించారు. పరీక్ష కాంపౌండ్ వాల్ వద్ద తరువాయి 8లో

# త్వరలో విద్యుత్, ఇరిగేషన్ శాఖలో బదిలీలు

**కోడ్ ముగియడంతో బదిలీలపై సర్కారు ఫోకస్**

**అధికార స్థానాల్లో మార్పులు చేర్పులు అనేది సర్వసాధారణం అంటున్న సిఎంఓ వర్గాలు**


ప్రజాపక్షం / హైదరాబాద్






ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో అధికారుల బదిలీలు, ప్రమోషన్లు ఉంటాయని గత రెండు మూడు నెలల నుండి ప్రచారం జరుగుతూ వస్తోంది. దీనికి అనుగుణంగానే అటు ప్రభుత్వం కూడా ఉద్యోగుల బదిలీలపై దృష్టి సారిస్తోంది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపైనే ఇన్నాళ్లు దృష్టి సారించామని సాధారణంగా మార్చ్‌లోనే ఉండాల్సిన బదిలీలు ఎన్నికల కారణంగా ఇప్పటికే ఆలస్యం అయిందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. విద్యుత్, ఇరిగేషన్ శాఖలో సబ్ ఇంజనీర్ స్థాయి అధికారుల నుండి ఎఈ, తరువాయి 2లో

## చంద్రుణ్ణి చుట్టిన తొలి వ్యోమగామి విలియమ్స్: విమాన ప్రమాదంలో మృతి



**సీటెల్ :** చంద్రుణ్ణి చుట్టి వచ్చిన తొలి ముగ్గురు వ్యోమగాములలో ఒకరైన విలియమ్స్ ఆండర్స్ విమాన ప్రమాదంలో మరణించారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. ఆయనకు ఒక సొంత చిన్న విమానం ఉంది. ఆ విమానంలో ప్రయాణిస్తుండగా శుక్రవారంనాడు ఉత్తర సీటెల్ జలాలలో కూలిపోయింది. ఎఎ45 బీచ్ క్రాఫ్ట్ విమానం వాషింగ్టన్ రాష్ట్రంలోని తీరంలో 80.25 అడుగుల ఎత్తులో ఎగురుతుండగా ఈ ఘటన జరిగింది. చంద్రుడుపై నుండి భూమి ఉదయిస్తున్న మొట్టమొదటి అద్భుత చిత్రాన్ని ఫొటో తీసి భూగోళంపై మానవాళికి అందించిన వ్యోమగామిగా విలియమ్స్ ఆండర్స్ చరిత్రలో రికార్డులకెక్కారు. వాయువ్య పసిఫిక్ మహాసముద్రలో ఆర్కాస్– ద్వీపాలమధ్య సముద్రజలాల్లో విలియమ్స్ విమానం కూలిపోయింది. ఉత్తర సీటెల్‌కు 80 మైళ్ళ దూరంలో ఈ ఘటన జరిగిందని నాసా వర్గాలు ఒక ప్రకటనలో తెలియజేశాయి. ఈ విమానంలో ఆయనతోపాటు పైలట్ తప్ప ఇంకెవరూ లేరని భావిస్తున్నారు. విలియమ్స్ మృతదేహాన్ని వెలికి తీశారు. పైలట్ మృతదేహాన్ని ఇంకా గుర్తించవలసి ఉంది. అపోలో 8 లో ఆయనతోపాటు ముగ్గురు వ్యోమగాములు చంద్రుణ్ణి చుట్టి వచ్చారు. చంద్రుడిపై భూమి ఉదయిస్తున్న అద్భుతమైన చిత్రాలను ఆయన తన కెమెరాలో బంధించి మావవాళికి అందించారు. 55 ఏళ్ళ క్రితం 1968 డిసెంబరు 21న అపోలో 8 ప్రయోగం జరిగింది. చంద్రుడి నుండి ఆయన తీసిన చిత్రాలు చిత్ర రాజాలుగా చిరస్థాయిగా మిగిలిపోయాయి.

## చైనా–పాకిస్థాన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం



**బీజింగ్ :** చైనా–పాకిస్థాన్ దేశాలమధ్య వ్యూహాత్మకమైన భాగస్వామ్య సహకారం ఉందని, ఆ దేశానికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అన్నారు. చైనాలో ఐదురోజుల పర్యటనలో ఉన్న పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ జీ జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడుతూ, సర్వకాల సర్వావస్థలలోనూ రెండు దేశాలమధ్య కొనసాగుతున్న లోతైన వ్యూహాత్మక భాగస్వామ్యం పోను పోను మరింత బలపడుతున్నదని అన్నారు. రెండు దేశాల ప్రజలమధ్య కూడా లోతైన అనుబంధం ఉందని, భవిష్యత్‌లో అభివృద్ధికి ఇంకా ఎన్నో అవకాశాలు ఉన్నాయని జిన్‌పింగ్ అన్నారు. పాకిస్థాన్ అభివృద్ధికి అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన బెల్ట్ అండ్ రోడ్ ప్రణాళిక అమలుకు చైనా సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయం, గనులు, సామాజిక జీవన రంగాలలో రెండు దేశాలమధ్య సహకారానికి, అభివృద్ధికి తమదేశం బాటలు వేస్తుందన్నారు. పాకిస్థాన్‌లో చైనా వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు నిరంతరం సురక్షితమైన వాతావరణాన్ని ప్రభుత్వం సమకూర్చగలదన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇటీవల పాకిస్థాన్‌లో చైనా ఇంజనీర్లు, ఇతర ఉద్యోగులపై ఉగ్రవాద దాడులు జరుగుతున్నాయి. చైనా రాజధాని బీజింగ్‌లోని గ్రేట్ హాల్‌లో షెహబాజ్ షరీఫ్‌తో జీ జిన్‌పింగ్ శుక్రవారంనాడు ఈ సమావేశం జరిపారు.

# ఐక్యరాజ్యసమితి బ్లాక్‌లిస్ట్‌లోకి ఇజ్రాయిల్

**జెనీవా :** గాజాలో గడచిన ఎనిమిది నెలలుగా ఇజ్రాయిల్ మారణహోమం సృష్టిస్తూ సుమారు 15,500 మంది బాలలను హతమార్చడంపై ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐక్య రాజ్యసమితి స్కూలుపై ఇజ్రాయిల్ గడచిన బుధవారంననాడు గగనతల దాడులు చేయడంతో ఏకంగా 40 మంది మరణించరు. అంతకుముందు ఒక శరణార్థ శిబిరంపై డ్రోన్ దాడులు చేయడంతో 38 మంది సజీవదహనమయ్యారు. తాజాగా ఐక్యరాజ్యసమితి స్కూలుపై జరగిన దాడిని సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ తీవ్రంగా ఖండించారు. దీనికిశిక్షగా ఇజ్రాయిల్‌ను బ్లాక్‌లిస్ట్‌లో చేరుస్తూ ఐక్యరాజ్యసమితి శనివారంనాడు నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా ఈ యుద్ధంలో వేలాదిమంది పిల్లల మరణాలకు హమాస్ కూడా ప్రధాన కారణమని విమర్శించింది. హమాస్ – ఇజ్రాయిల్ రెండూ అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని తప్పుపట్టింది. దీంతో జెనీవాలోని ఐక్యరాజ్యసమితిలో ఉన్న ఇజ్రాయిల్ ప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఐక్యరాజ్యసమితిలో ఇజ్రాయిల్ దౌత్యవేత్త ఇలాడ్ గిర్డన్ ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ సంతకంతో తమకు ఈ మేరకు ఉత్తర్వులు అందాయని పేర్కొన్నారు. ఇజ్రాయిల్‌ను నిషేధిత జాబితాలో చేర్చడంపై పలు దేశాలు హర్షం ప్రకటించగా ఇజ్రాయిల్ ప్రతినిధులు మాత్రం ఐక్యరాజ్యసమితి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పోడియం వద్దకు రావడంతో వారి చర్యపట్ల పలు దేశాల దౌత్యవేత్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ సభ నుండి వాకౌట్ చేశారు. 2023 అక్టోబరు 31న గాజాలో ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించినప్పటినుండీ గడచిన ఎనిమిది నెలలుగా 36,731 మంది పాలస్తినా ప్రజలు మరణించారు. మరో 83,530 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వారిలో 15,500 మందిపైగా బాలలు ఉన్నారు. ఈ యుద్ధంలో 147 మందది జర్నలిస్టులు, 194 మంది ఐక్యరాజ్యసమితి సహాయ సిబ్బంది, వందలాదిమంది ఆరోగ్య కార్యకర్తలు మరణించారు.గాజా దాడుల్లో 77 మంది మృతి ఇజ్రాయిల్‌పై అన్నివైపుల నుండీ ఎడతెగని ఒత్తిడి వస్తున్నప్పటికీ ఆ దేశ ప్రధానమంత్రి నేతన్యాహూ తన పట్టు వదలకుండా గాజాలో విధ్వంసం కొనసాగిస్తున్నారు. శుక్రవారం నుండి గడచిన 24 గంటల్లో సెంట్రల్‌గాజాలో జరిపిన దాడుల్లో 77మంది పాలస్తినాప్రజలు మరణించారు.సెం ట్రల్ గాజాలోకి ఇజ్రాయిల్ సైన్యాలు మరింత ముందుకు దూసుకువెళుతున్నాయి.అల్ అక్సాడైర్ మార్టైర్ ఆసుపత్రి సమీపంలో ఇజ్రాయిల్ సైన్యం దాడులు చేసింది. ఈ దాడుల్లో అనేకమంది మరణించగా ఎక్కువమంది గాయపడ్డారు. వీధుల్లో పెద్దసంఖ్యలో మృతదేహాలుపడి ఉన్నాయి.గాయపడిన వారు కూ డా వారి మధ్య ఉన్నారు.కానీ వారికి సకాలంలో చికిత్సలు అందించడానికి వైద్య సిబ్బంది కొరత ఏర్పడింది. కొద్దిమంది పిల్లలను ఆసుపత్రులకు తరలించారు. ఖతార్ ప్రభుత్వం ఈ దాడును తీవ్రంగా ఖండించింది. ఐక్యరాజ్యసమితి స్కూలుపై దాడి అమానుషమని విమర్శించింది. కాగా నుసైరత్‌లో జరిగిన దాడుల్లో 55మంది మరణించారనీ, దజన్ల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారని అల్ అక్సా డైర్ మార్టైర్ ఆసుపత్రి వైద్యుడు ఖలీల్ అల్ డెగ్రాన్ చెప్పారు.



ప్రపంచం

### నలుగురు ఇజ్రాయిల్ బందీలు విడుదల

గాజా : హమాస్ చెరలో ఉన్న నలుగురు బందీలను విడిపించామని ఇజ్రాయిల్ సైన్యం శనివారం ప్రకటించింది. వారిని సజీవంగా తమ దేశానికి తీసుకు వెళ్లింది. దీంతో ఇజ్రాయిల్‌లో బందీల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరిసింది. వారు సంబరాలు చేసుకున్నారు. హమాస్ తీవ్రవాదులు తిష్టవేసిన ప్రాంతాలలో జరిపిన క్లిష్టమైన ఆపరేషన్ ద్వారా వారిని విడిపించినట్లు ఐడిఎఫ్ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఉగ్రవాదుల కేంద్రాలపై దాడులు చేసి వారిని బయటకు తెచ్చామని ఐడిఎఫ్ చెప్పింది. నోవా అర్గమనీ (25), ఆల్మోగ్ మెయిర్‌జాన్ (21), ఆంద్రూ కోజ్లోవ్ (27), ష్లోమీ జివ్ (40)లను పట్టపగటు జరిపిన దాడుల్లో చెర విడిపించామని ఐడిఎఫ్ ప్రకటించింది. సెంట్రల్‌గాజా నుసెరైత్‌లోని రెండు వేరు వేరు ప్రాంతాల నుండి వారిని విడిపించి తెచ్చామని తెలియజేసింది. గత ఏడాది అక్టోబరు 7వ తేదీన హమాస్ అతివాదులు ఇజ్రాయిల్ నగరంపై దాడి చేసి 1,139 మంది పౌరులను కాల్చి చంపారు. మరో 251 మంది ని కిడ్నాప్‌చేసి బందీలుగా తీసుకుపోయారు. వీరిలో పలు దేశాలకు చెందినవారు ఉన్నారు. ఈ ఘటన తర్వాత అక్టోబరు 31న పాలస్తినాపై ఇజ్రాయిల్ యుద్ధం ప్రకటించింది. బందీలకోసం అన్వే షిస్తున్నది. ఈ బందీలలో 116 మంది ఇంకా పాలస్తినాలో హమాస్ చెరలోనే ఉన్నారు.

## డి–డే వివాదంలో సునాక్ : ఎన్నికలవేళ ఎదురుగాలి



**లండన్ :** ఫ్రాన్స్ నార్మండీలో జూన్ 6వ తేదీన జరిగిన డి–డే కార్యక్రమంలో పాల్గొన్న బ్రిటన్ ప్రధానమంత్రి రుషీ సునాక్ ఆ సంస్మరణ కార్యక్రమంలో పూర్తి సమయం గడపకుండా మధ్యలోనే హడావుడిగా బయటకు వచ్చేయడంతో స్వదేశంలో ఎన్నికలవేళ తీవ్ర విమర్శలకు గురవుతున్నారు. ఐతే తాను తప్పు చేశానని సునాక్ క్షమాపణలు చెప్పారు. కానీ ఈ చిన్న విషయం ఆయన ఎన్నికల అవకాశాలను కూడా మరింతగా దెబ్బతీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధంలో నార్మండీలో జరిగిన కీలకమైన యుద్ధ ఘట్టం ఒక పెద్ద మలుపు తిప్పింది. ఈ ఘటనతో ఫ్రాన్స్‌కు విముక్తి లభించింది. ఇదే రెండో ప్రపంచ యుద్ధంలో మిత్రదేశాల విజయానికి బాటలు వేసింది. జూన్ 6న జరిగిన ఈ డి–డే 80వ సంస్మరణ కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ రాజు ఛార్లెస్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ తదితర అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు. ఈ స్మృతి నివాళి కార్యక్రమంలో ఎక్కువసమయం సునాక్ గడపకుండా వచ్చేయడంతో ఆయన తీవ్ర విమర్శలకు గురయ్యారు. ప్రధాన ప్రతిపక్షం లేబర్ పార్టీ సునాక్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శల చేస్తుండగా దేశంలో 68 శాతం ప్రజలు సునాక్ చేసింది చాలా పెద్ద తప్పిదమని తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కేవలం 21 శాతం మంది మాత్రమే ఆయనను సమర్థించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అసలే కష్టాల కొలిమిలో ఉన్న టోరీ పార్టీకి పులిమీద పుట్రలా ఈ ఘటన మరో పెద్ద నష్టం కలిగిస్తున్నది. ఐతే సునాక్ చెబుతున్న వివరణలకు ఎవరూ పెద్దగా విలువ ఇవ్వడంలేదు.

## ఇయు ఎన్నికలవేళ డెన్మార్క్ ప్రధానమంత్రిపై దాడి



**కొపెన్‌హాగన్ :** యూరోపియన్ యూనియన్ (ఇయు) దేశం డెన్మార్క్ ప్రధానమంత్రి మెట్టే ఫ్రెడెరిక్సెన్‌పై దాడి జరిగింది. యూరోపియన్ యూనియన్ పార్లమెంటుకు ఈనెల 6 నుండి మూడురోజులపాటు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో ఫ్రెడరిక్‌సెన్‌పై దాడితో సర్వత్రా దిగ్భ్రాంతి నెలకుంది. పోలీసులు వెంటనే దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేశారు. సిటీ ఓల్డ్‌టౌన్ స్కేర్ ప్రాం తంలో ప్రధానమంత్రిపైకి దూసుకొచ్చిన దుండగుడు దాడికి పాల్పడ్డాడు. ఐతే తక్షణం ఆమెను అక్కడి నుండి సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి డెన్మార్ ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఆ గుర్తు తెలియని వ్యక్తి ఎం దుకు ప్రధానమంత్రిపై దాడి చేశాడన్న విషయం తెలియరాలేదు. ఈదాడి అత్యంత హేయమైనదని యూరోపియన్ యూనియన్ కమిషన్ నాయకుడు ఉర్సులా వోన్‌డెన్ లేయర్ విమర్శించారు. స్లోవేకియా ప్రధానమంత్రి రోబెర్ట్ పికోపై ఈమధ్యనే ఒక వ్యక్తి అత్యంత సమీపం నుండి దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఆయన సజీవంగా ఉన్నప్పటికీ ఇంకా అనేక సర్జరీలలో ఉన్నారు. ఈ ఘటనకు ముందు డెన్మార్క్ ప్రధానమంత్రి యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో పాల్గొన్నారు. తర్వాత ఆ దాడి జరిగింది. మెట్టే ఫ్రెడెరిక్ సెన్ సోషల్ డెమోక్రటిక్‌పార్టీ నాయకురాలు. 46 ఏళ్ళు వయసుగల ఈ యువ మహిళా ప్రధానమంత్రి డెన్మార్క్ రాజకీయ చరిత్రలో అత్యంత తక్కువ వయసుగల దేశ నాయకురాలు. 2019లో ఆమె ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. డోనాల్డ్ ట్రంప్ సహా పలువురు దేశ నాయకులు ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.

## రాహుల్‌గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

విభజనవాదం, అతివాద మతతత్వంతో ప్రధాని ప్రచారం సాగిందని తెలిపింది. కాంగ్రెస్ పార్టీని దృఢంగా పునరుద్ధరణ మార్గంలో నిలిపిన దేశ ప్రజలకు సిడబ్ల్యుసి ధన్యవాదాలు తెలియజేసింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నేతలు మల్లిఖార్జున్ ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నిర్వర్తించిన పాత్రను సిడబ్ల్యుసి ప్రశంసించింది. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్రకు నేతృత్వం వహించిన రాహుల్‌గాంధీని ప్రత్యేకంగా అభినందించింది. ఈ రెండు యాత్రలు దేశ రాజకీయాలను మలుపు తిపాపయని, లక్షల మంది పార్టీ కార్యకర్తలు, కోట్లాది ఓటర్లలో ఆశ, విశ్వాసాన్ని నింపాయని సిడబ్ల్యుసి తీర్మానంలో పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణ అంశాన్ని ఇతరులందరికంటే రాహుల్ గాంధీ స్వంత ఆలోచనతో ఎన్నికల ప్రచారంలో ప్రధానాంశంగా మార్చారని తెలిపింది.

### ఫలితాలు రాని రాష్ట్రాలపై త్వరలో కమిటీలు : ఖర్గే

సిడబ్ల్యుసి సమావేశంలో మల్లిఖార్జున ఖర్గే అధ్యక్షోపన్యాసం చేస్తూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పునరుజ్జీవం పొందినప్పటికీ, కొన్ని రాష్ట్రాలలో ఆశించిన మేరకు ఫలితాలు రాలేదని, వాటిపై ప్రత్యేక కమిటీలు వేసి ఒక్కో రాష్ట్రం గురించి చర్చిస్తామని అన్నారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా పార్టీ మంచి ఫలితాలు సాధించిన కొన్ని రాష్ట్రాలలో లోక్‌సభ ఎన్నికల్లో పునరావృతం కాలేదన్నారు. దీనిపై తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని, ఈ రాష్ట్రాలు సాంప్రదాయంగా కాంగ్రెస్‌కు అనుకూలమైనవని తెలిపారు. మనకు అవకాశాలు ఉన్నచోట్ల స్వంత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల లబ్ధి కోసం వినియోగించాలని నాయకులకు సూచించారు. ఈ కసరత్తు త్వరలోనే ప్రారంభమవుతుందన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, లేనప్పటికీ, 24 గంటలు, 365 రోజులు ప్రజల మధ్యలోనే ఉంటూ సమస్యలు లేవనెత్తాలని సూచించారు.

### 'ఇండియా' పార్లమెంటు లోపల, బైట మరింత కలిసి పని చేయాలి

భారత్ జోడో యాత్ర చేపట్టిన చోట పార్టీ ఓటు శాతం పెరిగిందని, కాంగ్రెస్ సీట్ల సంఖ్య పెరిగిందని మల్లిఖార్జున ఖర్గే తెలిపారు. ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు కూడా వివిధ రాష్ట్రాలలో వాటి పాత్రను పోషించాయని, తమ వంతు సహాయం చేశాయన్నారు. విభజనవాద, ద్వేషపూరిత రాజకీయాలను నిష్కర్షగా తిరస్కరణకు గురైనట్లు లోక్‌సభ ఫలితాలు తెలుపుతున్నాయని అన్నారు. పార్లమెంటు లోపల, వెలుపల ఇండియా కూటమి తప్పనిసరిగా సన్నిహితంగా పని చేయడాన్ని కొనసాగించాలని చెప్పారు.

### రాహుల్‌గాంధీ స్వీకరించాల్సిందే : రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ :** రాహుల్‌గాంధీ లోక్‌సభలో ప్రధాన ప్రతి పక్ష నాయకుడు పదవిని స్వీకరించాలని టిపిసిసి అధ్యక్షులు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బలంగా కోరారు. ఢిల్లీలో శనివారం జరిగిన సిడబ్ల్యుసి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 140 కోట్ల మంది దేశ ప్రజలు కోరు తున్నట్లుగా రాహుల్‌గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేత కావాలనేది తమ డిమాండ్ అని అన్నారు. రైతుల సమస్యలు, మహిళలు, నిరుద్యోగం వంటి అంశాలపై గత పదేళ్ళుగా రాహుల్‌గాంధీ పోరాడే బాధ్యతలు తీసుకున్నారని గుర్తు చేశారు. 2014లో కాంగ్రెస్ అధికారం కోల్పోయిన తరువాత గత పదేళ్ళలో లోక్‌సభలో ఆ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా రావడం ఇదే ప్రథమం. దీంతో రాహుల్‌గాంధీ ఆ పదవి చేపట్టాలని కాంగ్రెస్‌లో ఒక వర్గం బలంగా వాదిస్తోంది. ఇదే అంశంపై సిడబ్ల్యుసి తీర్మానం చేసింది.

## కొత్త మంత్రులెవరో?

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిలైన షా, సింగ్ వంటి నేతలు చేరడం ఖాయమని, లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన మాజీ ముఖ్యమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, బసవరాజ్ బొమ్మై, మనోహర్ లాల్ ఖట్టర్, సర్బానంద సోనోవాల్ ప్రభుత్వంలో చేరేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. టిడిపికి చెందిన రామ్ మోహన్ నాయుడు, లాలన్ సింగ్, సంజయ్ ఝూ మరియు జెడి(యు)కి చెందిన రామ్ నాథ్ ఠాకూర్, లోక్ జనశక్తి పార్టీకి చెందిన చిరాగ్ పాశ్వాన్ (రామ్ విలాస్) కొత్త ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. జెడియు కోటా నుండి సింగ్ లేదా ఝూకు చోటు దక్కవచ్చని వర్గాలు తెలిపాయి. ఎన్నికల్లో పేలవ ప్రదర్శన చూపిన మహారాష్ట్రలోని బిజెపి–శివసేన– ఎన్‌సిపి కూటమి, బీహార్‌లో ఉనికిని చూటుకున్న ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వ ఏర్పాటు కసరత్తులో దృష్టి సారించాయి. పశ్చిమ రాష్ట్రంలో అక్టోబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, వచ్చే ఏడాది బీహార్‌లో జరగనున్నాయి. లోక్‌సభ ఎన్నికల కారణంగా బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా పదవీకాలం పొడిగించారు. కొంత మంది అనుభవజ్ఞులను పార్టీలోకి పంపించి నడ్డాకు ప్రభుత్వంలో స్థానం కల్పించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. లోక్‌సభ ఎన్నికలలో బిజెపి సీట్ల సంఖ్య 303 నుండి 240కి పడిపోయింది, మెజారిటీ మార్కు 272 కంటే చాలా తక్కువగా ఉంది.

### కట్టుదిట్టమైన భద్రత

మోదీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్న వేళ ఢిల్లీ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉన్నతాధికారులు రాష్ట్రపతి భవన్‌లో భద్రతా సమీక్ష నిర్వహించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి విదేశీ ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో వారు బస చేసేందుకు 3 ప్రత్యేక హోటళ్లు సిద్ధం చేశారు. ఆయా చోట్ల ప్రోటోకాల్‌ను అమలు చేస్తున్నారు. ప్రమాణ స్వీకారం సందర్భంగా దేశ రాజధానిని నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించారు. జూన్ 9, 10 తేదీల్లో ఈ నిషేధాజ్ఞలు కొనసాగుతాయని పేర్కొన్నారు. నేరస్థులు, సంఘవిద్రోహ శక్తులు, ఉగ్రవాదుల నుంచి సాధారణ ప్రజలు, ప్రముఖులతో పాటు, ఇతర ముఖ్యమైన స్థావరాలకు ముప్పు కలిగించే అవకాశముందని హెచ్చరికలు జారీ చేశారు. పారామోటార్లు, హ్యాంగ్ గ్లైడర్లతోపాటు పారాగ్లైడింగ్ చేయడం, డ్రోన్లు, గాలి బుడగలు, రిమోటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను ఎగురవేయడాన్ని నిషేధించినట్లు చెప్పారు. ఆంక్షలను ఉల్లంఘించిన వారిపై భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 188 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

### ముఖ్యఅతిథులుగా ట్రాన్స్‌జెండర్లు

భారత ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారానికి సామాన్యుల నుంచి అతిరథ మహారథులు హాజరుకాబోతున్నారు. ఈ క్రమంలో ఎన్‌డిఎ కూటమి నాయకులు, విదేశీ నేతలు, ప్రతిపక్ష సభ్యులు, సినీ, క్రీడారంగ ప్రముఖులు, అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలతో సహా మరికొంత మందిని ముఖ్యఅతిథులుగా ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ జాబితాలో పలువురు ట్రాన్స్‌జెండర్లు, నూతన పార్లమెంటు భవన నిర్మాణ శ్రామికులు, పారిశుద్ధ్య కార్మికులు, వందే భారత్ రైళ్ల వంటి కీలక ప్రాజెక్టుల్లో పని చేసిన వారికి అవకాశంకల్పించినట్లు తెలిపారు.దేశాభివృద్ధికి తోడ్పడుతున్న వీరందరినీ మోదీ తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు.

### వీదేశీ అగ్రనేతలు

ఇప్పటికే బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు, భూటాన్ ప్రధానమంత్రి షెరింగ్ టొబ్గే, మారిషస్ ప్రధాని ప్రవింద్ జగన్నాథ్, సీషెల్స్ అధ్యక్షుడు వావెల్ రామ్‌కలావాన్ తదితరులకు ఆహ్వానాలు పంపారు. ఈ క్రమంలోనే నేపాల్ ప్రధానమంత్రి పుష్ప కమల్ దహల్ (ప్రచండ) ఆదివారం నుంచి మూడు రోజుల భారత్ పర్యటనకు వస్తున్నారు. ఆయన 9న జరిగే మోదీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరవుతారు. మంగళవారం ఆయన తిరిగి నేపాల్‌కు బయలుదేరతారు. అయితే ఈ కార్యక్రమానికి మాల్దీవులు అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు హాజరవుతారని ఎడిషన్.ఎంవీ అనే న్యూస్ పోర్టల్ తెలిపింది. కానీ దీనిపై అధికారిక సమాచారం ఏదీ వెల్లడికాలేదు.

## తోడేస్తున్నారు..!

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. అయినా అక్రమ ఇసుక రవాణా మాత్రం ఆగకపోవడంతో ప్రతిపక్ష నేతలు ఎమ్మెల్యే మందుల సామేల్ చెప్పే తరచుగా మాట్లాడే ఊతపదం "పొట్టు.. పొట్టు పొట్టు"గా ఇసుక అక్రమ రవాణ సాగుతుందంటూ సోషల్ మీడియాలో ఇసుక అక్రమ రవాణ వీడియోలు, పోటోలు పోస్టులు పెడుతూ విమర్శలు చేస్తున్నారు.

### పట్టించుకోని అధికారులు..నెలవారీ మామూళ్ళతో సరి..?

ఇసుక అక్రమ రవాణ జోరుగా సాగుతున్నా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. నెలవారి మామూళ్లతోనే సరిపెడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల పేర్లతో సమాధానం చెప్పకుండా దాటవేస్తున్న పరిస్థితి. నాగారం, తిరుమలగిరి, నూతనకల్, మద్దిరాల మండలాల పోలీస్ స్టేషన్‌ల పరిధిలో అధికారులు ఒక్కోక్క ట్రాక్టర్‌కు నెలకు రూ. 10వేల చొప్పున మాముళ్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కోక్క స్టేషన్ పరిధిలో సుమారు 50 నుండి 100 ట్రాక్టర్లలో నిత్యం అక్రమ ఇసుక రవాణ జరుగుతుండగా లక్షల్లో వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. పోలీస్ శాఖలో దఫేదారి వ్యవస్థ ప్రభుత్వం రద్దు చేసిన అధికారులు మాత్రం తమ స్టేషన్‌ల పరిధిలో ఈ అక్రమ వసూళ్ళ కోసం ప్రత్యేకంగా దఫేదారులను ఏర్పాటు చేసి వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మైనింగ్, రెవెన్యూ అధికారులు సైతం తామే మి తక్కువ కాదన్నట్లుగా అందినకాడికి దండుకుంటున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. మీడియాల్లో వార్తలు వచ్చినప్పుడే హడావుడి చేసి రెండు మూడు వాహనాలను పట్టుకోని కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందిస్తూ అక్రమ ఇసుక రవాణాకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## సమీక్షా కమిటీ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంది.ప్రశ్నాపత్రాలు బహిర్గతం కావడం, రిగ్గింగ్, అవినీతి వంటివి దేశంలో జగుతున్న అనేక పరీక్షలలో ఒక అంతర్భాగంగా మారిపోయాయని మరోవైపు కాంగ్రెస్‌పార్టీ కూడా తీవ్ర స్థాయిలో మండిపడింది. భారతీయ జనతాపార్టీ దేశంలో యువతీ యువకుల జీవితాలతో ఆటలు ఆడుతోందనీ, వారి భవితవ్యంతో చెలగాటం ఆడుతోందని విమర్శించింది. కేవలం ఆరు పరీక్షా కేంద్రాలలో పరీక్షలు రాసిన విద్యార్థులకు సమయం కోల్పోయారనే నెపంతో గ్రేసు మార్కులు ఇవ్వడంతో వారి మార్కులు భారీగా పెరిగాయనీ, దీనివల ఇతర పరీక్షా కేంద్రాలలో ఇదే పరీక్ష రాసిన అభ్యర్థులు తమకు ఉన్న అవకాశాలు కోల్పోయే సమస్య ఎదురైనందువల్ల ఈ విషయంలో తిరిగి పరీక్షలు నిర్వహించాలని అనేకమంది దేశవ్యాప్తగా డిమాండ్ చేస్తున్నారు. మేఘాలయ, హర్యానాలోన బహదూర్‌గర్, చత్తీస్‌గడ్‌లోని దంతెవాడ, బలోథ్, గుజరాత్‌లోని సూరత్, చండీగఢ్ లలో విద్యార్థులకు పైన పేర్కొన్నవిధంగా ఈ పరీక్షల్లో అత్యధికంగా మార్కులు వచ్చాయి. జూన్ నాలుగో తేదీన దేశం యావత్తూ ఎన్నికల ఫలితాల హడావుడిలో ఉన్న తరుణంలో నీట్–యుజి పరీక్షా ఫలితాలు వెలువడ్డాయి. 67 మంది విద్యార్థులకు ఈ పరీక్షా ఫలితాల్లో మొదటి ర్యాంకులు రావడం అందరికీ దిగ్భ్రాంతి కలిగించింది. ఐతే హర్యానాలోని కేవలం ఆరు కేంద్రాలలో పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ విధంగా మొదటి ర్యాంకులు షేర్ చేసుకోవడం ఇంతకుమునుపు ఎన్నడూలేనంత అతిపెద్ద వివాదంగా మారిపోయింది. దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు ఈ ఏడాది ఈ పరీక్ష రాయడానికి పేర్లు నమోదు చేసుకున్నారు. "ఈ విషయంపై సమీక్ష చేయడానికి ఒక ఉన్నతస్థాయీ కమిటీని ఏర్పాటు చేశాం, ఈ 1,500 మంది విద్యార్థులకు వచ్చిన మార్కుల ఫలితాలపై ఈ నలుగురు సభ్యుల కమిటీ సమీక్ష చేస్తుంది, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ ఛైర్మన్ ఈ సమీక్షా కమిటీకి నాయకత్వం వహిస్తారు, ఈ కమిటీ ఒక వారం రోజుల్లో ఈ విషయంపై సమీక్ష జరిపి తన సిఫార్సులను సమర్పిస్తుంది, ఎక్కువ మార్కులు పొందిన విద్యార్థుల పరీక్షా పత్రాలను సమీక్షిస్తారు బహుశా" అని ఎన్ఇఎ డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్ సింగ్ శనివారం నాడు న్యూఢిల్లీలో మీడియా సమావేశంలో చెప్పారు. ఈ విధంగా మార్కులు సంపాదించుకున్నవారు ఇతర విద్యార్థులపై ఎంతమాత్రం ప్రభావం చూపించే అవకాశం లేదని, అర్హతలకు అది ప్రాతిపదిక కాబోదని కూడా ఆయన చెప్పారు.

## నీట్ ఎగ్జామ్‌లో అవకతవకలపై విచారణ జరిపించాలి

*** ట్విట్టర్‌లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీట్ ఎగ్జామ్ లో జరిగిన అవకతవకలపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ట్విట్టర్ ద్వారా స్పందించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన కీలకమైన ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది వైద్య విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసే నీట్ ఎగ్జామ్‌కు సంబంధించిన కొన్ని వ్యవహారాలు చూస్తుంటే కచ్చితంగా అవకతవకలు జరిగినట్లు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సంవత్సరం నీట్ ఎగ్జామ్‌లో 67 మంది విద్యార్థులు 720 కి 720 మార్కులతో ఫస్ట్ ర్యాంక్ సాధించటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనికి తోడు ఈ సారి చాలా మంది విద్యార్థులు 718, 719 మార్కులు సాధించారని తెలిపారు.

కొత్తగా ఏర్పడిన ఎన్డీయే సర్కార్ రానున్న రోజుల్లో ఇలాంటి సమస్యలకు సంబంధించి చాలా సవాళ్లను ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. ఐతే నీట్ ఎగ్జామ్ విషయంలో బిఆర్ఎస్ తరపున ఈ సందర్భంగా పలు పశ్నలతో పాటు కొన్ని డిమాండ్లను కేంద్రం ముందుంచారు.

## ఇరిగేషన్ శాఖలో బదిలీలు

(మొదటి పేజీ తరువాయి)

ఏడీఈ ఇంకా ఆ పైన ఉండే జాయింట్ సెక్రటరీ స్థాయి వరకు బదిలీలు జరుగనున్నాయి. మూడు ఏళ్లు అంతకు మించి ఒక చోట ఉన్న అధికారుల గణాంకాలను విద్యుత్, ఇరిగేషన్ శాఖ మంత్రులు ఇప్పటికే తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. సబ్ ఇంజనీర్ స్థాయి ఉద్యోగులను ఒక జిల్లా నుండి మరో జిల్లాకు మార్చనుండగా, ఏఈ, ఏడీఈ స్థాయి ఉన్నతాధికారులకు ప్రస్తుతం వారు పని చేస్తున్న జిల్లాలోనే మండలాల వారీగా బదిలీ చేయనున్నట్లు చెబుతున్నారు. వ్యవసాయ పరంగా ఇరిగేషన్, విద్యుత్ శాఖలు చాలా కీలకం కావడంతో ఆ శాఖలో పని చేస్తున్న సీనియర్లను మరి కొన్నాళ్లు అక్కడే పని చేయించుకుందామని అధికార పార్టీ నాయకులు చెబుతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఇందుకు సుముఖంగా లేరని తెలుస్తోంది. ఈ క్రమంలోనేత్వరలోనే బదిలీలు తప్పకుండా ఉంటాయని టాక్ వినిపిస్తోంది.

### ఎలక్షన్ కోడ్ కూడా ముగిసింది

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరుసగా అధికారుల బదిలీలు జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోని ఐఏఎస్‌లు, ఐపిఎస్‌లు, సెక్రటేరియట్ లోని ఉన్నతాధికారుల మార్పులు చేర్పులు జరిపారు. అయితే ఇంతలోనే ఎన్నికల కోడ్ అమలు లోకి వచ్చింది. ఈ ఎలక్షన్ కోడ్ దాదాపుగా రెండు నెలలపాటు రాష్ట్రంలో రావడంతో అధికారులు మాత్రం ప్రభుత్వ విధానపరమైన అంశాల జోలికే వెల్లలేదన్న వాదనలు వినిపించాయి. ఇలా ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకొని మరోసారి విద్యుత్, ఇరిగేషన్ శాఖల్లో అధికారుల బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోందని అంటున్నారు. కాగా , ఇందులో భాగంగా విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో పాటు ఇతర అన్ని శాఖలకు సంబంధించి నటువంటి బదిలీల రిపోర్టుల ఫైల్స్ ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరాయని ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ ఓకే అనగానే విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల వారీగానూ బదిలీలు జరిగే అవకాశం ఉందని సమాచారం . ఇప్పటికే ఎలక్షన్ కోడ్ ముగిసి సెక్రటేరియట్‌కు మళ్లీ సాధారణ ప్రజల తాకిడి మొదలైంది. ప్రజల నుండి ప్రభుత్వానికి వస్తున్న విజ్ఞప్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

ఈ క్రమంలో ముందు ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల అంశం పూర్తి చేయించి ప్రజలు వినతులను పరిశీలించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా అన్నింటికి మించి ఈ వారం పది రోజుల్లో కీలకమైనటువంటి ఇరిగేషన్, విద్యుత్ తో పాటు ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు మార్పులు చేర్పులు జరుగుతాయనే రీతిలోనే ప్రభుత్వ వర్గాలు ఆ ఇండికేషన్‌ను ముందుకు తీసుకువెళ్తున్నాయి. " అధికారుల మార్పులు చేర్పులు అనేది సర్వసాధారణం. ఏ ప్రభుత్వంలోనైనా ఎప్పటికప్పుడు ఆయా పరిస్థితులను బట్టి అధికారుల మార్పులు చేర్పులు జరుగుతాయి " అని సిఎంఓ వర్గాలు చెబుతున్నాయని విశ్వసనీయంగా తెలుస్తోంది.

## మోదీ గెలిచి ఓడాడు : నారాయణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రధాని నరేంద్రమోదీ గెలిచి ఓడాడని, ఇండియా కూటమి ఓడి గెలిచిందని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ వ్యాఖ్యానించారు. గతంలో కంటే బిజెపికి ఓట్లు, సీట్లు తగ్గాయని, స్వయంగా మోదీకి మెజారిటీ కూడా తగ్గిపోయిందని అన్నారు. టిడిపి, నితిశ్‌కుమార్ కారణంగానే ఎన్‌డిఎ ప్రభుత్వం రాగలుగుతోందని, లౌకిక శక్తులన్నీ ఎన్‌డిఎ బైటికి వస్తే ప్రభుత్వం ఉండదన్నారు. రెండు రోజుల పాటు ఢిల్లీలో జరిగిన సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశంలో పార్లమెంట్ సాధారణ ఎన్నికలపై సమీక్షించినట్లు తెలిపారు. సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి డాక్టర్ నారాయణ శనివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. గతంలో మోదీ రాజ్యాంగాన్ని మార్చాలని అనుకున్నాడని, ఇప్పుడు రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకుని దానిని కాపాడుతానని చెబుతున్నాడని, ఆయనలోని అపరాధ భావనను ఈ ఘటన బైటపెడుతుందని ఆయన పేర్కొన్నారు. దేశాన్ని వెనక్కి తీసుకెళ్ళేందుకు మోదీ ప్రయత్నిస్తే ఈ సారి ఇండియా కూటమి ఊరుకోబోదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఊహించిన పరిణామాలే జరిగాయని, కాని దేశంలో కొంత భిన్నమైన ఫలితాలు వచ్చాయన్నారు. ఆరు నెలల క్రితం తనను కలిసినప్పుడు చంద్రబాబు ఒంటరిగా పోటీ చేసినా 135 స్థానాలలో గెలుస్తారని రామోజీరావు చెప్పారని, ఇప్పుడు చంద్రబాబు సిఎంగా ప్రమాణస్వీకారాన్ని చూడకుండానే రామోజీరావు మరణించడం బాధాకరమని అన్నారు.


## త్వరలో కుప్పకూలనున్న బిజెపి




● సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి : రానున్న రోజుల్లో దేశంలో బిజెపి పార్టీ కూలిపోతుందని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా జహిరాబాద్ పట్టణంలోని భరత్ నగర్ కాలనీలో సిపిఐ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వీర్ల ప్రకాశ్‌రావుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం దేశ రాజకీయ పరిస్థితుల చూస్తే ప్రజలు కలమత బేధాలు లేకుండా పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ప్రజా స్వేచ్ఛను గెలిపించారన్నట్లుగు ఫలితాలు వెలివేయించరన్నారు. బిజేపి ప్రభుత్వం సంపూర్ణ మెజార్టీ రాకపోవడంతో రానున్న కాలంలో ప్రభుత్వం కూలిపోతుందన్నారు. తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసిన బీజేపి పార్టీకి చంద్రబాబు నాయుడు మద్దతు ఇవ్వడం సరికాదన్నారు. ఇక మీదటైనా తమ వైఖరిని మార్చుకుంటూ మత విద్వేషాలు రెచ్చగొట్టి ఓట్లు దంపకుని రాజ్యమేలుతున్న పార్టీలకే కాకుండా ప్రజాస్వామ్యం కాపాడే దిశగా ఆలోచన చేసుకుంటే బాగుండేదన్నారు. జహిరాబాద్‌లో ఎంతోకొంత పరిశ్రమలు ఉండడం వలన అనేక ప్రాంతాల నుండి వలస జీవులుగా వచ్చి ఏళ్ల తరబడి నుండి నివాసం చేసే వారు అనేక మంది ఉన్నారన్నారు. స్థానికులకు కూడా ఇండ్లు లేని నిరుపేదల కుటుంబాలను గుర్తించి వారందరికి ఇళ్లస్థలాలు, ఇచ్చే దిశగా స్థానిక నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చేయాలన్నారు. అనంతరం సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి జలాలోదీన్ మాట్లాడుతూ త్వరలో ప్రజలందరికి కూడా గట్టి పమస్యల పరిష్కారానికై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్ పార్టీ నాయకులు సర్పంలు అజారుద్దీన్ చిరంజీవి,అశోక్, దత్తు రెడ్డి, ప్రవీణ్, సిపిఐ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భరోసా సొసైటీ భవన నిర్మాణానికి వియాట్రిస్ సంస్థ రూ.కోటిన్నర విరాళం




ప్రజాపక్షం/హైదరాబాద్:భరోసా సొసైటీ మౌ లిక సదుపాయాల పరిధిని విస్తరించేందుకు డిజిపి రవి గుప్త, వియాట్రిస్ సంస్థ భారత సిఎస్ఆర్ ఇన్చార్జి మిచల్ డోమినికా, ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డిజిపి శిఖా గోయల్ ల సమక్షంలో అధికారిక ఒప్పందంపై సంతకం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డిజిపి శిఖా గోయెల్ మాట్లాడుతూ మహిళలకు సురక్షితమైన సౌక ర్యాన్ని ప్రోత్సహించాలనే మా నిబద్ధతలో ఇది ఒక ముఖ్యమైన మైలు రాయిగా అభివర్ణించారు. మహిళా భ ద్రత విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భరోసా సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ భవనానికి నిర్మాణం చేయాలని సంకల్పించామన్నారు.హైదరాబాద్లో భరోసా కేంద్రంతో ప్రారంభించి భరోసా కార్యక్ర మాలు విస్తృతంగా చేపడుతున్నామని దీనికోసం భవన నిర్మాణం చేయాల్సి ఉందని అన్నా రు. భరోసా సొసైటీ తెలంగాణలో మహిళలు, పిల్లల రక్షణ సాధికారత లక్ష్యంగా అనేక రకాల కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నా రు. ఉమెన్ సేఫ్టీ వింగ్, తెలంగాణ స్టేట్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భరోసా సొసైటీ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న 26 భరోసా కేంద్రాలు మరియు 27 సిడిఇడబ్ల్యూ (సెంటర్ ఫర్ డెవలప్మెంట్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్) ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లతో సహా అనేక కీలకమైన కార్యక్రమాలను సమన్వయం చేస్తుందన్నారు. ఈ కేంద్రాలు పోలీసు సహాయం, వైద్య సంరక్షణ, న్యాయ సహాయం, మానసిక కౌన్సెలింగ్ వంటి సమగ్ర సహాయ సేవలను అందిస్తాయన్నారు. హింస, బాధితుల రక్షణ పునరావాసానికి సమగ్ర విధానాన్ని నిర్ధారిస్తాయన్నారు. భరోసా ద్వా రా నిర్వహించబడుతున్న కార్యక్రమాలు బహుముఖమైనవని, మహిళలు, పిల్లల భద్రత వారి సంక్షేమానికి సంబంధించిన వివిధ అంశా లను ప్రస్తావిస్తూ వియాట్రిస్ భరోసా ప్రాజెక్ట్ కోసం రూ.2.5కోట్ల రూపాయల కార్పొరేట్ సామా జిక బాధ్యత క్రింద నిధులను కేటాయించిందని, మొద టి దశలో 1.5 కోట్ల చెక్కును అందచేశారని ఉమెన్స్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డిజిపి శిఖా గోయెల్, వియాట్రిస్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## నీట్ పేపర్ లీకేజ్‌పై విచారణ జరపాలి

✻ ఏఐఎస్ఎఫ్ రాష్ట్రఅధ్యక్షుడు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

ప్రజాపక్షం /హైదరాబాద్ : నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ పై విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ శనివారం ఈ మేరకు పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్నాయని, ఈ తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. మే 5న పరీక్షను నిర్వహించగా దాదాపు దేశ వ్యాప్తంగా 24 లక్షల మం ది విద్యార్థులు పరీక్షను రాశారన్నారు. కాగా ప్రకటించిన ఫలితాల్లో అనేక అవక తవకలు జరిగాయని విద్యార్థులు, వారి తల్లి దండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. వారి అనుమానాలకు సజీవ సాక్ష్యం.. ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు గాను 720 మార్కులు రావడం మరల వారి పరీక్ష కేంద్రం కూడా ఒకటే కావడం వలన వారి అనుమానాలకు మరింత బలాన్ని ఇ స్తోం దన్నారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధ ంగా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలనీ దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వానికి చెప్పిన కూడా వారి మాటని పెడచెవిన పెట్టి, నిర్లక్ష్యం చేయడం ద్వారా వేలాది మంది ప్రతిభగల విద్యార్థులు మె డికల్ విద్యకు దూరమవుతున్నారన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై, పేపర్ లీకేజీలపై సుప్రీం కోర్టు సిట్టింగ్‌జడ్జి చేత విచారణ జరిపించాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ డిమాండ్ చేశారు.

# తెలుగు మీడియా రంగానికి కొత్త పంథాను నేర్పిన ఘనుడు రామోజీరావు

ప్రజాపక్షం / హైదరాబాద్ : తెలుగు పత్రికా దిగ్గజం, ఈనాడు గ్రూప్స్ అధినేత, పద్మవిభూషణ్ గ్రహీత చెరుకూరి రామోజీరావు మరణం పట్ల ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు పత్రికా, మీడియా, వ్యాపార రంగాలకు తీరని లోటన్నారు. తెలుగు మీడియా రంగానికి కొత్త పంథాను నేర్పిన ఘనత రామో జీరావుకు దక్కుతుందని సిఎం తన సందేశంలో పేర్కొ న్నారు. రామోజీ రావు తెలుగువారి కీర్తిని దేశ స్థాయిలో చాటిన వ్యక్తిగా కొనియాడారు. సిడబ్ల్యూసి సమావే శాల నిమిత్తం ఢిల్లీ వెళ్లిన సిఎం రేవంత్ రెడ్డి, రామోజీ మరణ వార్త తెలిసిన వెంటనే ఆయన కుటుంబ సభ్యు లతో ఆయన ఫోన్‌లో మాట్లా డారు. అక్షర వీరుడు రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ఆకాంక్షించారు. రామోజీ కుటుంబ సభ్యులకు సిఎం తన ప్రగాఢ సాను భూతిని తెలియజేశారు. రామోజీ రావు అంత్యక్రి యలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ముఖ్య మంత్రి ఢిల్లీ నుంచే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలిచ్చారు. తెలుగు జర్నలిజానికి విశ్వస నీయతను, రంగం ఏదైనా విలువలకు, విశ్వసనీయ తకు పెద్దపీట వేసిన వ్యక్తి రామోజీరావు అన్నారు.



### మంత్రుల సంతాపం

**రామోజీ తెలుగు పత్రిక దిగ్గజం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

చెరుకూరి రామోజీరావు మరణం పట్ల ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లు తీవ్ర దిగ్భ్రాంతిని, వారి కుటుంబానికి సంతాపాన్ని తెలిపారు. మారుమూల ప్రాంతంలో జన్మించిన రామోజీరావు విలక్షణమైన, సృజనాత్మకత తో కూడిన వ్యక్తిత్వం ఆయన సొంతమని కొనియాడారు. అద్భు తమైన ఫిలిం సిటీని నిర్మించి సినీ రంగాల్లో చెరగని ముద్ర వేశారని, పనిలోనే తనకు విశ్రాంతి అనే ప్రాథమిక సూత్రం పైనే ఆయన చివరి శ్వాస వరకు పనిచేశారని గుర్తు చేసుకున్నారు.

**మీడియా రంగంలో ఎన్నో సంస్కరణలకు ఆద్యుడు : పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

రామోజీరావు మృతిపట్ల రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మీడియా రంగంలో విలువలతో కూడిన నూతన ఒరవడికి, ఎన్నో సంస్కరణలకు ఆద్యుడు రామోజీరావు అని కొనియాడారు.

**ప్రజా చైతన్యానికి బాటలు వేసిన అక్షర యోధుడు రామోజీ : తుమ్మల నాగేశ్వరరావు**

రామోజీ రావు మృతి పట్ల వ్యవసాయ శాఖ మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు తెలిపేలా అన్నదాత పత్రిక లక్షలాది రైతులకు ప్రగతి బాటలు వేసిందన్నారు. రామోజీ రావు పత్రిక టీవీ వ్యాపార రంగాల్లో తనదైన ముద్ర వేసి తెలుగు వారి కీర్తి పెంచిన ఘనుడని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

**రామోజీ మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు : మంత్రి పొన్నం ప్రభాకర్**

రామోజీరావు మృతిపట్ల రవాణా, బిసిసంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు అని పేర్కొన్నారు. రామోజీ రావు తన జీవితాంతం అత్యంత నిబద్ధత , క్రమశిక్షణ పట్టుదలతో బతికిన వ్యక్తి అని, ఏ పని అయినా విజయతీ రాలకు చేర్చడమే లక్ష్యం గా పని చేశారని కొని యాడారు.

**మంత్రి జూపల్లి కృష్ణారావు సంతాపం**

రామోజీరావు మరణం పట్ల ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సం తాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తూ రామోజీరావు కుటుంబ సభ్యులకు ప్ర గాఢ సానుభూతిని తెలిపారు.

ఈనాడు గ్రూప్ సంస్థ అధినేత రామోజీరావు మరణం పట్ల బిజెపి నేతలు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటు ంబ సభ్యులకు సాను భూతిని వ్యక్తం చేశారు.

రామోజీరావు తెలుగు పత్రికారంగంలో 'ఈనాడు' ద్వారా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈనాడు పత్రిక ద్వారా తెలుగు ప్రజలను మేల్కొల్పిన వ్యక్తి రామోజీరావు అని బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మ ణ్ అన్నారు. మీడియా రంగంలో తనకంటూ ప్రత్యేకతను సాధించుకున్నారన్నారు. రామోజీరావు మరణం అత్యంత బాధాకరమని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ అన్నారు. పత్రికా రంగంలో తనదైన పంథాతో చెరగని ముద్ర వేయడంతో పాటు విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. వ్యాపారవేత్తగా, ఈనాడు మీడియా సంస్థల, అధిపతిగా, రామోజీ ఫిలీం సిటీ వ్యవస్థాపకునిగా రామోజీరావు అందించిన సేవలు చిరస్మరణీమని బిజెపి శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.

**పాత్రికేయరంగంలో చెరగనిముద్ర : దత్తాత్రేయ**

రామోజీరావు మృతి పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం వ్యక్తం చేశారు. పాత్రికేయ రంగంలో రామోజీరావు చెరగని ముద్ర వేశారని కొనియాడారు. తెలుగు భాషకు ఆయన చేసిన సేవలు మరువలేనివని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. రామోజీ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డి సంతాపం**

రామోజీ రావు మృతి పట్ల త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్ర సేనా రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని, విషాదాన్ని వ్యక్తం చేశారు. రామోజీ తో తనకు ఎనలేని అనుబంధం ఉండేదన్నారు. రామోజీరావు మరణం పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం సానుభూతి తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని గవర్నర్ ఇంద్ర సేనా రెడ్డి ఆకాంక్షించారు.

**సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సంతాపం**

రామోజీరావు మృతిపట్ల సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంత రావు సంతాపం వ్యక్తం చేశారు.రామోజీ రావు మృతి మీడియా రంగానికి తీరని లోటు అని, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**మీడియా, సినిమా రంగంలో తనదైన ముద్ర : తలసాని శ్రీనివాస్ యాదవ్**

మీడియా, సినిమా రం గా లలో తనదైన చెరగని ముద్ర వేసిన గొప్ప వ్యక్తి రామో జీరావు అని మాజీ మంత్రి తల సాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం రామో జీ ఫిలీంసిటీలో రామోజీ రావు పార్థీవదేహానికి ఆయన నివాళులు అర్పించారు. ఆయన మృతి వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని విచారం వ్యక్తం చేశారు.

**రామోజీరావు తెలుగు వెలుగు..ఆయన మృతి తీరని లోటు : నారా చంద్రబాబు నాయుడు**

ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు అస్తమయం పై టిడిపి అధినేత నా రా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మరణం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని చంద్రబాబు అన్నారు. శనివారం రామోజీ ఫిలిం సిటీలో ఆయన భౌతికకాయానికి చంద్రబాబు నివాళ్లు అర్పించారు. అక్షర యోధుడుగా పేరున్న రామోజీ తెలుగు రాష్ట్రాలకు, దేశానికి అందించిన సేవలను చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన తిరిగి కోలుకుంటారని తామంతా భావించామని...కానీ ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని చంద్రబాబు అన్నారు. రామోజీ అస్తమయంతో కుటుంబ సభ్యులకు, ఈనాడు గ్రూపు సంస్థల సిబ్బందికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని చంద్రబాబు ప్రార్థించారు.

**రామోజీరావుకు జగన్ సంతాపం**

రామోజీరావు మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పత్రికారంగానికి దశాబ్దాలుగా ఆయన ఎనలేని సేవలందించారన్నారు. ఆయన ఆత్మ కు శాంతి చేకూరాలని భగవంతుడిని ఆకాంక్షించారు. రామోజీరావుకుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**మాజీ సిఎం కెసిఆర్ సంతాపం**

ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీ రావు మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి బిఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖరరావు సంతాపం తెలిపారు. పలు రంగాల్లో వ్యాపారవేత్తగా, మీడియా సంస్థల వ్యవస్థాపకుడిగా వారందించిన సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. శోక తప్తులైన వారి కుటుంబ సభ్యులకు కెసిఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**సిఆర్ ఫౌండేషన్ సంతాపం**

ఈనాడు గ్రూపు సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు మృతి పట్ల చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ (సి ఆర్ ఫౌండేషన్) తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. రామోజీరావు సామాజిక సేవ కార్యకలాపాలతో సమాజ అభ్యున్నతికి ఆయన జీవిత పర్యంతం కృషి చేశారని పేర్కొంది. ముఖ్యంగా సి ఆర్ ఫౌండేషన్ ఆవిర్భావంతో పాటు ఫౌండేషన్ కార్యకలాపాల విస్తృతికి ఆయన ఎంతో తోడ్పాటు అందించారని వెల్లడించింది. రామోజీరావు మృతి పట్ల ప్రగాఢ సంతాపం, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని సి ఆర్ ఫౌండేషన్ వ్యక్తం చేస్తున్నది.

**ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సంతాపం**

రామోజీరావు మృతి ప ట్ల అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రామోజీరావు తెలుగు భాషా సంస్కృతికి అభ్యున్నతికి ఈనాడు దినపత్రిక ద్వారా అన్యాయానికి గురవుతున్న అన్ని వర్గాల ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి పత్రిక ద్వారా అవిరాళంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు అని అన్నారు.

### అక్షర యోధుడు రామోజీకి అశ్రునివాళి : టియూడబ్ల్యూజె, ఐజెయు

ఈనాడు గ్రూప్ సంస్థల స్థాపనతో మీడియా రంగంలో విప్లవం సష్టించి, సమాజంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని కైవసం చేసుకున్న ఆ సంస్థ అధినేత రామోజీరావు మరణం మీడియా రంగంతో పాటు యావత్తు సమాజానికే తీరనిలోటు అని టియూడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు నగునూరి శేఖర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ, ఐజెయు కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి , ఐజెయు జాతీయ కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయ అన్నారు. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య విజయాలు సాధించిన ఘనత రామోజీ రావుకే దక్కుతుందని వారు కొనియాడారు. కృషీవలుడిని కోల్పోవడం బాధాకరమని, రామోజీ రావు మృతి పట్ల వారు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

### అక్షర యోధుడు రామోజీ మరణం బాధాకరం

**తెలుగు అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి**

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, తెలుగు దిన పత్రికల విస్తరణకు, నూతనత్వానికి ఆద్యులు రామోజీ రావు మరణం పట్ల తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. పత్రికా రంగంలో తెలుగు జర్నలిజానికి అఖిలభారత స్థాయిలో గుర్తింపు తెచ్చిన గొప్ప వ్యక్తి రామోజీ రావు అని శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు. తెలుగు భాష సమున్నతికి, తెలుగు జర్నలిజం ద్వారా కృషి చేసిన కృషీవలుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. రామోజీ రావు మరణం పట్ల శ్రీనివాస్ రెడ్డి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న శ్రీనివాస్ రెడ్డి రామోజీ రావు మరణం పట్ల తన సంతాపం తెలియజేశారు.

## చేనేత కార్మికులకు ఏడాదిపాటు చేతినిండాపని

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వం చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని, వారికి 365 రోజులు చేతి నిండా పని కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. శనివారం సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరారావును తెలంగాణ ప్రాంత పద్మశాలి రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి, చేనేత సహకార సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సం దర్భంగా వారు చేనేత సహకార సంఘాలులోని వస్త్ర నిలువలను కొనుగోలు చేయడంతో పాటు బకాయిలను త్వరితగతిన చెల్లించాలని మంత్రికి విన్నవించారు. అదేవిధంగా నేతన్న భీమా, పావలా వడ్డీ, జిఎస్‌టి బకాయిలు త్వరితగతిన చెల్లించాలని అంతే కాకుండా క్యాష్ క్రెడిట్, చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాఫీ చేయడంతో పాటు 65ఏళ్ల లోపు మరణించిన చేనేత కార్మికు లకు ఎక్స్ గ్రేషియా రూ. 5లక్షల బీమా చెల్లించాలని మంత్రి కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేనేత కార్మికులని ఏమాత్రం పట్టించుకోలేదని కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత చేనేత కార్మికులకు దీర్ఘకాలిక లబ్ధి చేకూర్చే పథకాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్నీ ప్రభుత్వ శాఖల వారు టెస్కో ద్వారా వస్త్రములను కొనుగోలు చేసేందుకు గత మార్చి 11న జిఓ ఎంఎస్ 1డిని విడుదల చేశా మన్నారు. తద్వారా టెస్కో అనుమతి లేకుండ ఏప్రభుత్వశాఖ కూడా ప్రైవేట్ మార్కెట్ ద్వారా వస్త్రములను కొనుగోలు చేసే అవకాశమే లేదన్నారు. ,ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా రూ. 255 కోట్ల విలువైన ఆర్డర్లు టెస్కోకు ఆర్డర్లురాగా, వీటిని వస్త్ర సరఫరాకు సంఘాలకు ఆర్డర్లు ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో చేనేత కార్మికులకు చేతినిండా పని దొరకుతుంది అని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను ము ఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభు త్వం 10 శాతం యార్న్ సబ్సిడీ పథకాన్ని కేబినెట్ ఆమోదం లేకుండా ప్రవేశ పెట్టడంతో నిధులు విడుదల కాలేదన్న విషయాన్ని గుర్తుచేశారు. అయినప్పటికీ రూ.33.23 కోట్ల రూపాయలు 10శాతం యార్న్ సబ్సిడీని టెస్కో నిధుల నుండి విడుదల చేయడం జరిగిందన్నారు. పని చేస్తున్న ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు త్వరలోనే ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## లోక్‌సభ ఎన్నికల్లో టాప్ 10 మెజారిటీలు ఇవే

| పేరు (పార్టీ) | నియోజకవర్గం (రాష్ట్రం) | మెజారిటీ |
|---|---|---|
| 1.రకీబుల్ హుస్సేన్ (కాంగ్రెస్) | ధుబ్రీ (అస్సోం) | 10,12,476 |
| 2.శంకర్ లాల్వాణి (బిజెపి) | ఇందోర్(మధ్యప్రదేశ్) | 10,08,077 |
| 3.శివరాజ్‌సింగ్ చౌహాన్(బిజెపి) | విదీషా (మధ్యప్రదేశ్) | 8,21,408 |
| 4.సి.ఆర్.పాటిల్ (బిజెపి) | నవసరి (గుజరాత్) | 7,73,551 |
| 5.అమిత్ షా (బిజెపి) | గాంధీనగర్ (గుజరాత్) | 7,44,716 |
| 6.అభిషేక్ బెనర్జీ (టిఎంసి) | డైమండ్ హార్బర్ (పశ్చిమబెంగాల్) | 7,10,930 |
| 7.బిప్లబ్ కుమార్ దేబ్ (బిజెపి) | త్రిపుర వెస్ట్ (త్రిపుర) | 6,11,578 |
| 8.హేమంగ్ జోషి (బిజెపి) | వడోదర (గుజరాత్) | 5,82,126 |
| 9.బ్రిజ్ మోహన్ అగర్వాల్(బిజెపి) | రాయ్‌పూర్(చత్తీస్‌గఢ్) | 5,75,285 |
| 10.శశికాంత్ సెంథిల్(కాంగ్రెస్) | తిరువళ్ళూరు(తమిళనాడు) | 5,72,155 |

## స్టేట్ 11వ ర్యాంకు సాధించిన ప్రణీత

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం2024–25 విద్యా సంవత్సరానికిగాను నిర్వహించిన మోడల్ స్కూల్స్ ప్రవేశం కోసం గురువారం విడుదల చేసిన పరీక్ష ఫలితాలలో హైదరాబాద్ రామంతపూర్ విద్యార్థిని భీమగౌని ప్రణీత 76 మార్కులతో స్టేట్ 11వ ర్యాంకును సాధించింది. 6వ తరగతిలో కొత్తగా ప్రవేశాలు కల్పించడంతో పాటు 7నుంచి 10వ తరగతుల్లోని ఖాళీ సీట్ల భర్తీకి ఈ ప్రవేశ పరీక్షను నిర్వహించారు. రాష్ట్ర స్థాయి 11వ ర్యాంకును సాధించిన ప్రణీత గౌడ్ స్వగ్రామం గద్వాల జిల్లా కేంద్రంలోని ఒంటెలపేట వీది. ప్రాథమిక విద్యాభ్యాసం జిల్లా కేంద్రంలో విశ్వభారతి పాఠశాలలో చదివి ప్రస్తుతం హైదరాబాద్ రామంతపూర్‌లోని సెయింట్ జెసెఫ్ పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు.

## డ్రగ్స్ పట్టివేత..వ్యక్తి అరెస్ట్

ప్రజాపక్షం/హైదరాబాద్: డ్రగ్స్ మత్తులో మునిగిపోతున్న మహా నగరాన్ని డ్రగ్స్ ఫ్రీ ప్రాంతంగా మార్చడానికి ఎక్సైజ్ ఎస్టిఎఫ్ పోలీసులు రంగంలోకి దిగారు. సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాదును డ్రగ్స్ ఫ్రీ ప్రాంతంగా చేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ రంగంలోకి దిగారు. ఇప్పటికే పలుచోట్ల ఎస్టిఎఫ్ దాడులు నిర్వహించి డ్రగ్స్ ను పట్టుకున్నారు.శనివారం నాడు లక్ష ఇరవై ఐదు వేల విలువచేసే ఎల్ ఎస్ డి డ్రగ్ ను ఎస్ టి ఎఫ్ పోలీసులు పట్టు కున్నారు. మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి అమ్మకాలు జరుపుతుండగా పోలీసులు పట్టుకున్నారు. విదేశాల్లో ఎక్కువగా వినియోగించే ఎల్ ఎస్ డి డ్రగ్ ను ఎస్ టి ఎఫ్ పోలీసులు, పోలీసులు కలిసి సంయుక్తంగా పట్టుకున్నారు. విదేశాల నుంచి బెంగళూరుకు వచ్చిన డ్రగ్స్ ను హైదరాబాదులో కొందరు వ్యక్తులు అమ్మకానికి ప్రయత్నిస్తున్నారని సమాచారం మేరకు ఎస్ టి ఎఫ్ పోలీసులు మేడ్చల్ ప్రాంతంలో ఒక పెట్రోల్ బంకు వద్ద ఎల్ ఎస్ డి డ్రగ్ nu అమ్మకాలు జరిపే ప్రయత్నాలు చేస్తుండగా ఎస్టిఎఫ్ పోలీసులు ఎండి అబ్దుల్ మొబిన్ అరెస్ట్ చేశారు. అతని వద్ద ఉన్నటువంటి ఎల్ ఎస్ టి 25 ప్యాడ్స్ ని 1.28 గ్రాముల ఎల్ ఎస్ జి డ్రగ్స్ ను పట్టుకున్నారు. 0. 0 1 పేపర్ ను నాలుక పై పెట్టుకుంటే 20 గంటలపాటు వ్యక్తి మత్తులో ఉంటాడు. అతి ప్రమాదకరమైనటువంటి ఎల్ ఎస్ టి డ్రగ్ ను ఎస్ టి ఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేశారు.

## ఆరోగ్యశ్రీలో అదనంగా 65కొత్త చికిత్సలు

● 1375 పాత చికిత్స విధానాలకు నగదు ప్యాకేజీ పెంపు


● రూ.487 కోట్లు విడుదల చేసిన డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్: రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుముక వంటి ఖరీదైన వ్యాధులకు చికిత్స, ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరోగ్యశ్రీ పథకంలోని చికిత్సల ప్యాకేజీ ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీటికి సంబంధించి రూ.497.29 కోట్లు అవసరం కాగా శనివారం ఈ నిధులను విడుదల చేస్తూ డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద కొత్త చికిత్సా విధానాల కొరకు ప్రస్తుతము ఉన్న పథకాల ఆర్థిక సవరణ కొరకు మంత్రివర్యులు శ్రీ భట్టి విక్రమార్క మల్లుతో జూన్ 7న రాష్ట్ర సచివాలయం లో సమావేశము జరిగింది.అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వము 2007 లో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద 2.84 కోట్ల లబ్ధిదారులు ఉన్నారు. వీరికి రూ.10 లక్షల వరకు ఆర్థిక సహాయం ఈ పథకం ద్వారా అందుతుంది. రాష్ట్రం లో ఈ సదుపాయము 1402 ఆసుపత్రుల ద్వారా అందించబడుతుంది. ప్రస్తుతము ఈ పథకం లో 1672 చికిత్సా విధానాలు అందుబాటులో వున్నాయి. ఇందులో 1375 విధానాలకు ప్యాకేజీ ధరలు పెంచాలని వైద్య నిపుణుల సూచనల మేరకు డిప్యూటీ సిఎం నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు ఆరోగ్యశ్రీలో అమలులో లేని యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుపూస కు సంబంధించిన 65 అధునాతన చికిత్స విధానాలను ఇకనుంచి ఆరోగ్యశ్రీలో అమలు చేయాలని నిర్ణయించారు. వీటికి తోడు ప్రస్తు తం ఆయుష్మాన్ భారత్ లో ఉన్న 98 చికిత్సా విధానాలు రాజీవ్ ఆరోగ్యశ్రీలో చేర్చడం వల్ల దాదాపు రూ.189.83 కోట్ల ఖర్చు ప్రభుత్వం పై పడనుం ది. అంతే కాక, 65 కొత్త చికిత్సా విధానాలు అంగీకరించడం వల్ల ప్రభుత్వం రూ.158.20 కోట్ల ఖర్చు చేయనుంది. పైసవరణల వల్ల, కొత్త చికిత్సా విధానాలు చేర్చడం కోసం, ప్రభుత్వం అదనంగా రూ.497.29 కోట్లు ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు మంజూరు చేశారు






## నక్షత్ర జ్వాలలు



సూర్యుడిని చాలాకాలంగా నవగ్రహాల్లో ఒకటిగా పేర్కొనడం ఆనవాయితీగా ఉన్నప్పటికీ, అది ఒక నక్షత్రమని అందరికీ తెలుసు. నిరంతరం జ్వలించే సూర్యుడి నుంచి సౌర జ్వాలలు నిత్యం వెలువడుతునే ఉంటాయి. వాటివల్ల భూగోళానికి ప్రమాదం తప్పదని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. అయితే, మనం ఆకాశంలోకి చూస్తే, మిగతా నక్షత్రాలు కాంతివంతంగా కనిపించవు. టెలిస్కోప్‌ల సాయంతో చూసినా, అవి వెదజల్లే జ్వాలలు కనిపించవు. కానీ, అత్యాధునిక అంతరిక్ష టెలిస్కోప్‌ల సా యంతో, నక్షత్రాలు వెదజల్లే మంటలను గుర్తించినట్టు యేల్ అండ్ హాంకాంగ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఇటీవల ప్రకటించారు. వాటిని అధ్యయనం చేయడం ద్వారా, అనంతమైన విశ్వంలోని కోటానుకోట్ల నక్షత్రాలకు సంబందించిన సమాచారం తెలుసుకోవచ్చని చెప్తున్నారు. బిగ్‌బ్యాంగ్ తర్వాత కొన్ని వందల మిలియన్ సంవత్సరాల అనంతరం, విశ్వానికి వెలుగునిచ్చిన మొదటి తరం నక్షత్రాలను ''పాపులేషన్ III స్టార్స్‘గా పిలుస్తారు. కేవలం సిద్ధాంతపరంగా, కాగితాల్లోనే ఉన్న వీటి ఉనికిని కనుగొనడానికి శాస్త్రవేత్తలు కొన్ని శతాబ్దాలుగా శోధిస్తునే ఉన్నారు. వీటిని కనుగొన్నామని అంటున్న యేల్ అండ్ హాంకాంగ్ శాస్త్రవేత్తలు, అవి కాస్మోస్ పరిణామాన్ని పెంచడంతోపాటు, తరువాతి తరాల నక్షత్రాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాయని అంచనా వేశారు. మొదటి నక్షత్రాలు మొదట్లో లోహ రహితంగా ఉన్నాయని, ప్రధానంగా హైడ్రోజన్, హీలియంతో అవి ఏర్పడ్డాయని ఊహిస్తున్నారు. అదంతనం కాలంలో లోహాలు కూడా ఏర్పడి ఉండవచ్చని ప్రతిపాదిస్తున్నారు. ఇలావుంటే, జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ ద్వారా ఇటీవల గుర్తించిన మొదటి కృష్ణ బిలాలు (బ్లాక్ హోల్స్) కూడా తొలి నక్షత్రాలతోపాటే ఏర్పడ్డాయని ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు. అయితే, వీరి అంచనాలు, సిద్ధాంతాలు, ప్రతిపాదనలపై మరింత లోతైన అధ్యయనం జరగాల్సి ఉంది.

## సుదూర విశ్వంలో కాస్మిక్ ఈవెంట్లు!



విశ్వం నిరంతరం విస్తరిస్తునే ఉందని, దీనికి అంతం ఎప్పుడనేది ఊహించడం కూడా కష్టమని ఇప్పటికే శాస్త్రవేత్తలు తేల్చిచెప్పారు. ఒకవైపు కొత్త తారలు, గెలక్సీలు పుట్టుకొస్తుండగా, మరోవైపు మిలియన్ల సంఖ్యలో నక్షత్రాలు అనంతమైన కృష్ణ బిలాల్లోకి జారుకొని మరణిస్తున్నాయని కూడా స్పష్టం చేస్తున్నారు. అత్యంత శక్తివంమైన టెలిస్కోప్‌లను అంతరిక్షంలోకి పంపి, వాటి ద్వారా సేకరించిన చిత్రాల ఆధారంగా, విశ్వ రహస్యాన్ని ఛేదించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ అధ్యయనం కొనసాగుతున్న క్రమంలోనే సుదూర విశ్వంలో కార్మిక్ ఈవెంట్లను పరిశోధకులు కనుగొన్నారు. ఒక నక్షత్రం వేగంగా బ్లాక్ హోల్‌ను ఢీకొనడాన్ని ‘టైడల్ డిస్ట్రప్షన్ ఈవెంట్’ (టిడిఇ)గా పేర్కొంటారు. ఈ చర్య జరిగినప్పుడు, నక్షత్రంలోని కొంత భాగాన్ని బ్లాక్ హోల్స్ విడదీస్తాయి. ఈ విధంగా విడిపోయిన నక్షత్ర భాగం విస్తారమైన జ్వాలలను విరజిమ్ముతున్నదని శాస్త్రవేత్తలు తమ పరిశోధనలో కనుగొన్నారు. అయితే, అవి భూమిని చేరడానికి కొన్ని బిలియన్ కాంతి సంవత్సరాలు పడుతుందని వివరిస్తున్నారు. అంటే, ప్రస్తుతానికి అంతరిక్షం నుంచి భూగోళానికి వచ్చిన సమస్య ఏమీ లేదు. కాకపోతే, మనిషే భూగోళాన్ని నాశనం చేస్తున్నాడు.

## డిజిటల్ వాణిజ్యం కోసం ఓపెన్ నెట్‌వర్క్

డిజిటల్ వాణిజ్యం ఇటీవల కాలంలో గణనీయంగా పెరుగుతున్నది. ఈ సేవలు అందిస్తున్న ఓపెన్ నెట్‌వర్క్ అద్భుత పనితీరును ప్రదర్శిస్తున్నది. ప్రభుత్వ రంగం సంస్థగా ఉన్న ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఒఎన్‌డిసి) గత నెల, రిటైల్, రైడ్‌హెయిలింగ్ విభాగాల్లో ఏకంగా 8.9 మిలియన్ డాలర్ల విలువైన లావాదేవీలను నిర్వహించింది. ఒక నెలలో నమోదైన అత్యధిక వాణిజ్య కార్యకలాపాల మొత్తంగా ఇది రికార్డు పుటల్లోకి ఎక్కింది. రెండవ అత్యున్నత వాణిజ్య లావాదేవీలతో పోలిస్తే ఇది 23 శాతం అధికం. డిజిటల్ కామర్స్ కోసం ప్రత్యేకంగా ఏర్పడిన ఒఎన్‌డిసికి మౌలిక సాంకేతిక సదుపాయాలు ఉన్నాయి. నెట్‌వర్క్‌కు ఇది కేంద్రకం. ఇందులో కొనుగోలుదారులు, అమ్మకందారులకు అవసరమైన అన్ని రకాల సేవలు లభిస్తాయి. వివిధ రకాలైన ప్లాట్‌ఫామ్‌లు, అప్లికేషన్లను ఈ నెట్‌వర్క్ కనెక్ట్ చేస్తుంది. దీనితో కొనుగోళ్లు, అమ్మకాలు వేగవంతమవుతాయి. ఇప్పటికే వివిధ ప్లాట్‌ఫామ్స్ వీరికి వారధులుగా పని చేస్తున్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలను ఉదాహరణగా పేర్కోవచ్చు. అయితే, అమెజాన్ నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో ఆర్డర్ చేయలేం. అంటే, ఒక ప్లాట్‌ఫామ్‌ను వినియోగించుకొని, మరో ప్లాట్‌ఫామ్‌లో లావాదేవీలు జరపడం అసాధ్యం. కానీ, ఓపెన్ నెట్‌వర్క్‌లో అలాంటి ఇబ్బందులు ఉండవు. ఒకేసారి ఎన్ని ప్లాట్‌ఫామ్స్‌లోనైనా కొనుగోలు చేయవచ్చు. అమ్మకందారులకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. తక్కువ సమయంలో, ఎక్కువ లావాదేవీలు సాధ్యమవుతున్నాయి కాబట్టి, ఓపెన్ నెట్‌వర్క్‌లో వాణిజ్య టర్నోవర్ రికార్డులు సృష్టిస్తున్నది. రాబోయే కాలమంతా డిజిటల్ వాణిజ్యానిదే కాబట్టి, ఓపెన్ నెట్‌వర్క్‌కు డిమాండ్ మరింత పెరగడం ఖాయం.

## ఆగని రూపాయి పతనం



రూపాయి మారకం విలువ క్రమంగా పతనమవుతునే ఉంది. దేశంలో సార్వత్రిక ఎన్నికలను ఈ పతనానికి ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. అయితే, అంతకు ముందు కూడా రూపాయి విలువ స్థిరంగా కొనసాగిన సందర్భాలు చాలా తక్కువ. గత ఐదేళ్లలో, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 27.6 శాతం క్షీణించింది. ఒక డాలర్ విలువ రూ. 60.34 నుండి రూ. 83.38కి చేరింది. డాలర్‌తో మన దేశం కేవలం అమెరకాతో మాత్రమే కాకుండా, ఇతర దేశాలతోనూ వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నది. దాదాపు అన్ని దేశాల్లోనూ డాలర్‌నే మారకపు ద్రవ్యంగా వినియోగిస్తారు. మారకం విలువలో తేడాలు నమోదుకావడానికి ఇది కూడా ఒక కారణం. సమీప భవిష్యత్తులో, రూపాయి మార్కంగా వాణిజ్యాన్ని కొనసాగించేందుకు భారత్ ప్రయత్నిస్తున్నది. కువైట్, ఇరాన్, ఇరాక్ తదితర దేశాలు సానుకూలంగా స్పందిస్తున్నాయి. ఆసియా దేశాల మధ్య అవగాహన కుదిరితే, డాలర్ పెత్తనానికి తెరపడుతుంది. అయితే, ప్రస్తుతానికి మాత్రం రూపాయి మారకం విలువ క్షీణతవల్ల, ద్రవ్యోల్బణ ప్రమాదం పెరుగుతుంది. ఐటి వంటి రంగాలు దెబ్బతింటాయి.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# అతిపెద్ద ‘నీట్’ స్కాం

వైద్య విద్యార్థులకు సిద్ధమైన విద్యార్థుల జీవితాలతో జూదమాడింది ‘నీట్’ జాతీయ ప్రవేశార్హత పరీక్షనిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ. ఏ ఎంట్రెన్స్ పరీక్షల్లోనైనా ఏకంగా 67 మందికి మొదటి ర్యాంక్ రావటం విన్నామా, కన్నామా? కాని ఈ సంవత్సరం జూన్ 4న ఎన్‌టిఎ ప్రకటించిన నీట్ ఫలితాల్లో ఈ అద్భుతం సాధ్యమైంది! ఫలితాలు ప్రకటించిన తేదీ ప్రత్యేకించి గమనించదగింది. అది లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజు. దేశమంతా ఓట్ల లెక్కింపు, జయాపజాల కోలాహలంలో మునిగితేలుతుండగా ఎన్‌టిఎ ఫలితాలు ప్రకటించింది. నీట్ స్కాంను ఎవరూ గ్రహించరని దాని ఉద్దేశం అయితే అయి ఉండవచ్చు. అయితే అసలు సమస్య కొద్దిమంది విద్యార్థుల మేలుకోసం లక్షలాది విద్యార్థుల జీవితాలతో, వారి తల్లిదండ్రుల ఆశలతో జూదమాడే అధికారం ఈ సంస్థకు ఎవరిచ్చారు. ఎన్ని కోట్లు లబ్ధిపొందారు. ఎవరెవరు ఎంతెంత పంచుకున్నారు. విద్యార్థులకు న్యాయం చేయటం, అవినీతి తిమింగలాలను గుర్తించి శిక్షించటం ఒక్కటే న్యాయమైన మార్గం. పరీక్ష మళ్లీ నిర్వహించాలని కోరటం ఉద్దేశం కాదు. భవిష్యత్తులో ప్రతిభావంతులైన డాక్టర్లుగా దేశానికి సేవలందించాల్సిన అసాధారణ మేథస్సుకలిగిన ఆ 67 మంది విద్యార్థులకు, గ్రేస్ మార్కులు పొందిన ఇతరులకు పరీక్ష నిర్వహించి వారి పరిజ్ఞానాన్ని పరీక్షించి ర్యాంకులు సరిదిద్దాలని కోరుతున్నాం.

**ప్రజాపక్షం**
**09-06-2024, ఆదివారం**

ఇదెలా సాధ్యం, అలా చేస్తే ఇతర విద్యార్థుల ర్యాంకులు, వాటిద్వారా అడ్మిషన్‌లు లభించే ఉత్తమ విద్యాలయాలు తారుమారుకావా అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. అడ్మిషన్‌ల సమయం దగ్గరపడుతున్నందున విద్యార్థులు విద్యాసంవత్సరం నష్టపోకుండా ఉపశమనం కలుగజేయటానికి ఇంతకన్నా ఉత్తమ మార్గం ఉంటే అన్వేషించవచ్చు. కాని విద్యా సంవత్సరం కాపాడేసాకుతో అన్యాయాన్ని అవినీతిని అనుమతించకూడదు. మొదటి ర్యాంక్ సాధించిన 67 మంది విద్యార్థుల్లో ఆర్గురు హర్యానాలోని ఒక పరీక్షకేంద్రంలో పరీక్షరాశారన్న వాదనను ఎన్‌టిఎ త్రోసిపుచ్చింది. ఆ 67 మంది అనేక ప్రాంతాలకు చెందిన వారని వివరణ ఇస్తోంది. ఎన్‌టిఎ నిజాయితీయే సందేహాస్పదంగా ఉన్నప్పుడు ఇది అనుమానాలు నివృత్తి చేయదు. 67 మంది విద్యార్థులకు ఒకే మొదటి ర్యాంక్ ఎలా వచ్చిందని విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు, వైద్యవృత్తిలోని వారు ప్రశ్నిస్తున్నారు. అందుకు ఆలస్యంగానైనా ఎన్‌టిఎ ఇచ్చిన సమాధానం నప్పేదిగలేదు. ఫిజిక్స్ పరీక్షకు ఆన్సర్ కీలో తప్పులు సరిదిద్దటంవల్ల, ఆ పని చేసేందుకు పట్టిన సమయాన్ని పరిహరించేందుకు ఇచ్చిన కాంపెన్సేటరీ మార్కులవల్ల ర్యాంకులు అలా వచ్చాయంటోంది. 67 మంది అభ్యర్థులకు 720కి 720 మార్కులు వచ్చాయి. ఫిజిక్స్ ఆన్సర్ కీ విజన్ వల్ల 44 మంది, సమయనష్ట పరిహార మార్కుల వల్ల ఆర్గురు లబ్ధిపొందారంటోంది. మిగతా 17 మంది ఎలా లబ్ధిపొందారు?

మెడికల్ /ఇంజినీరింగ్ అడ్మిషన్లకు అర్హత పరీక్ష మార్కులతో నిమిత్తంలేకుండా రాష్ట్ర ప్రభుత్వాలు చాలాకాలంగా ఎంసెట్ నిర్వహిస్తున్నాయి. ఈ సెట్‌ల నిర్వహణ క్రమంగా దాదాపు అన్ని గ్రాడ్యుయేషన్ కోర్సులకు విస్తరించింది. అయితే ఒక దేశం –ఒకే పరీక్ష పేరుతో మెడిసిన్ కోర్సులో అడ్మిషన్‌లకు నీట్ పరీక్షను తెచ్చింది కేంద్ర ప్రభుత్వం. దీంతో కాంపిటీషన్, కోచింగ్ సెంటర్లు, ఫీజులు, ఒత్తిడి తట్టుకోలేని విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయి. నీట్‌వల్ల మాతృభాషలో విద్యనార్జిస్తున్న గ్రామీణ విద్యార్థులు నష్టపోతున్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అందువల్ల నీట్ ఎత్తివేసి అడ్మిషన్ ప్రక్రియను రాష్ట్రాలకు అప్పగించాలని తమిళనాడు అనేక సంవత్సరాలుగా పెద్దపోరాటమే చేస్తోంది. కేంద్రప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేయాలి. అనేక రాష్ట్రాల్లో ఉద్యోగ పరీక్షాపత్రాలను లీక్ చేస్తూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి అవినీతి తిమింగలాలు. ఈ నేపథ్యంలో నీట్ ఆన్‌లైన్ పరీక్షకు కూడా ఈ చీడ వ్యాప్తిచెందిందా అనే అనుమానాలు బలపడకముందే కేంద్రప్రభుత్వం మేల్కొనాలి.

# భౌతికవాదాన్ని తవ్వితీసిన దేవీప్రసాద్ చట్టోపాధ్యాయ



డాక్టర్ దేవరాజు మహారాజు

చార్వాక–లోకాయత అనేది భారతీయ తాత్విక దృక్పథంలో ప్రధానమైంది. ప్రపంచానికే తొలిసారి భౌతికవాదం గురించి చెప్పిన దేశం మన భారతదేశం! ఆ విషయం భారతీయులందరూ సగర్వంగా చెప్పుకోవాల్సింది పోయి, మనువాదుల చేతుల్లో కీలుబొమ్మలై, కల్పనల్లో ఊహించుకున్న దేవీదేవతల మూర్తులకు పూజలు చేస్తూ, దిగజారిపోయ్యారు. నిజాలను వదిలి, అబద్ధాల వెంట పరుగులు పెట్టారు. అలా శతాబ్దాలు గడిచిపొయ్యాయి.

దేవీప్రసాద్ చట్టోపాధ్యాయ లాంటి వివేకవంతులు ఆధునిక కాలంలో కూడా భౌతికవాద ప్రాశస్త్యాన్ని ఎలుగెత్తి చెపుతూనే ఉన్నారు. కానీ, కళ్ళు మూసుకుని, తలవంచుకుని గొర్రెల్లా బతికే జనం వారి హెచ్చరికల్ని పట్టించుకోలేదు. శూన్యాన్ని మహాశక్తిగా విశ్వసిస్తూ వస్తున్నారు. సమకాలీనంలో పరిస్థితులు చాలా ప్రమాదకరంగా తయారయ్యాయి. అయితే, ఈ పరిస్థితి తప్పకుండా మారుతుంది. రాగల కాలాలలో యువత బుద్ధుడు చెప్పిన ‘ అత్ దీపోభవ’ (నీవే దీపానివి అయిపో) అన్న మాటని గుండెల్లో నింపుకుని వైజ్ఞానిక భౌతిక మానవవాదానికి దారులు వేస్తారు. తప్పదు!! ఇక్కడ చార్వాక–లోకాయత ఆలోచనా విధానాన్ని మనువాదులు అన్యాయంగా అణగదొక్కారు. భూస్థాపితం చేశారు. తమ కట్టుకథల్ని ప్రచారం చేసుకుని అదే మన సంస్కృతి, అదే మన సంప్రదాయం అని బుకాయించారు. అయినా భౌతికవాదం ఎక్కడికీ పోలేదు. ఈ నేలలోనే ఉంది. ఈ గాలిలోనే ఉంది. లోకాయత అంటే లోకేశు ఆయుతః– అని అర్థం! అంటే లోకంలో వ్యాప్తి చెందిన ప్రజల దృక్పథం అని అర్థం! వీరు లోకాన్నే విశ్వసిస్తారు. ఎక్కడా లేని ఇతర లోకాలను నమ్మరు. లోకంలోని లోకులను మాత్రమే విశ్వసిస్తారు. లోకాయత ప్రజల తత్త్వశాస్త్రం. ఆధునిక వైజ్ఞానిక పరిశోధనలు జరగకముందే– సాధారణ శకానికి ముందు(బిసిఈ) లోకాయతులు ‘ప్రపంచమే వాస్తవం’ అన్నారు. నాలుగైదు మూలకాల సంయోగం వల్లనే ఈ ప్రపంచం ఏర్పడిందన్నారు. నీరు, నిప్పు, గాలి, భూమి–నాలుగు మూలకాలయితే, అయిదోది ఆకాశం అన్నారు. చైతన్యం అనేది పంచభూతాల నుండి వస్తుందన్నారు. ‘ భూతే బాహ్య చైతన్యం! మనుషులందరి శరీరాలు ఒక్కటే– ముక్కు–ముఖం, చేతులు, కాళ్ళు అందరికీ ఒకేలా ఉన్నప్పుడు, జీవనక్రియలు ఒకేలా జరుగుతున్నప్పుడు ఈ వర్ణవ్యవస్థ ఎందుకూ? ఈ కులాల తారతమ్యాలు ఎందుకూ? అసలు అవి ఉండాల్సిన అవసరం ఏమిటీ? అని లోకాయతులు సాధారణ శకానికి ముందు ప్రశ్నించారు. వీరే అతి ప్రాచీన భారతీయ భౌతికవాదులు.

ఈ ప్రపంచాన్ని ఏ శక్తీ నడిపించడం లేదనీ, ఆత్మ, పునర్జన్మ, మోక్షం వంటివి ఉండవని చాటి చెప్పారు. 1918–1993 మధ్య కాలంలో దేవీప్రసాద్ చట్టోపాధ్యాయ అనే మార్క్సిస్టు మేధావి, తత్వవేత్త ముందుకొచ్చాడు. వైదికధర్మం ప్రచారకుల వేదాల అబద్ధాలని కూల్చివేస్తూ– వారు భూస్థాపితం చేసిన భారతీయ భౌతికవాదాన్ని, అదే భూమి పొరల్లోంచి తవ్వితీశాడు. ఒకప్పుడు దేశంలో విస్తృతంగా ప్రచారంలో ఉన్న లోకాయత చార్వాక తాత్త్వికతను దేశ ప్రజలకు విడమర్చి చెప్పాడు. వైదిక పురాణాలు ప్రచారం చేసిన భ్రమలు బద్దలు కొట్టాడు. అన్నింటికీ ''కారణం–హేతువు ప్రధానమనీ, అది వైజ్ఞానిక అవగాహన మీద ఆధారపడి ఉండాలనీ చెప్పిన మహనీయుడాయన! తొలిసారి తత్వశాస్త్రాన్ని, వైజ్ఞానికతనూ కట్టగట్టి కొత్త ఆలోచనలకు దారులు వేసిన పరిశోధకుడాయన! చరిత్రకూ, సామాజిక ఆర్థిక, రాజకీయ అంశాలకు సైన్సు వెన్నెముక కావడం మనం చూశాం. కానీ, దేవీప్రసాద్ చట్టోపాధ్యాయ కొత్తగా ఫిలాసఫీకి సైన్సుకూ ఉన్న సంబంధాన్ని హేతుబద్ధంగా చెప్పి నిరూపించారు.

ప్రాచీన భారతీయ భౌతికవాదాన్ని అధ్యయనం చేసి, ఆయన ప్రకటించిన ‘లోకాయత’ మాత్రమే కాదు, వైజ్ఞానిక శాస్త్రాల చరిత్రను (HISTORY OF SCIENCE), ప్రాచీన భారతదేశంలో వైజ్ఞానిక పద్ధతుల్ని(SCIENTIFIC METHODS IN ANCIENT INDIA) ఆయన గ్రంథాలుగా ప్రకటించారు. ఇవే కాకుండా ప్రాచీన భారతదేశంలో విజ్ఞానశాస్త్రం– సమాజం(SCIENCE AND SOCIETY IN ANCIENT INDIA) వంటి గ్రంథాలు బహుళ ప్రజాదరణ పొందాయి. ఆయన గ్రంథం లోకాయత(A STUDY IN ANCIENT INDIA MATERIALISM)– 1959 దేశంలోనే కాదు, విదేశాల్లోనూ సంచలనం సృష్టించింది. భారతీయ మార్క్సిస్టు తాత్వికత గూర్చి ప్రపంచానికి ఒక కొత్త అవగాహనను కలిగించింది. దేవీప్రసాద్ ఛట్టోపాధ్యాయ (19 నవంబర్ 1918–8మే1993) రచనలు ‘సైన్స్ అండ్ సొసైటీ ఇన్ ఏన్సియంట్ ఇండియా సంపుటాలు; వాట్ ఈజ్ లీవింగ్ అండ్ వాట్ ఈజ్ డెడ్ ఇన్ ఇండియన్ ఫిలాసఫీ; ట్రూ ట్రెండ్స్ ఇన్ ఇండియన్ ఫిలాసఫీ; రిలిజియన్ అండ్ సొసైటీ–వంటి గ్రంథాలు తిరగేస్తే ఒకప్పుడు ప్రపంచానికి భౌతికవాదం బోధించిన భారతదేశం ఈ రోజు ఎందుకు ఇలా కుప్పగూలిపోయిందో అర్థ



మవుతుంది. అంతేకాదు, దాన్ని పునరుద్ధరించుకోవాల్సిన బాధ్యత నేటి యువతరం మీద ఎంత ఉందో అంచనా వేసుకోవడానికి వీలవుతుంది. కార్యాచరణకు ప్రేరణ లభిస్తుంది. చార్వాకుడు ఒకనాటి రుషి. అతను ప్రపంచంలోనే మొట్టమొదటిసారి భౌతికవాదం గురించి ఆలోచించాడు. బృహస్పతి ఆ ఆలోచనకు ఒకరూపం ఇచ్చాడు. పైగా చార్వాకుడి పేరుతోనే ఆ ఆలోచనా విధానాన్ని ‘చార్వాకం’ అని అన్నాడు. మాధవాచార్య ఆ పదానికి అర్థం చెప్పాడు. చారూ– అంటే తియ్యని అనీ, వాక్ అంటే వాక్కు–మాట– అనీ చెప్పాడు. యధార్థాల్ని సున్నితంగా చెప్పడం అని కూడా మనం అనుకోవచ్చు. చార్వాక్‌కు మరొక అర్థం కూడా ఉంది. వారు ప్రతిపాదించినవి నాలుగు విషయాలు(నాలుగు వాక్కులు) గనక, వారి ఆలోచనాధోరణిని ‘చార్వాక్’ అని కూడా అన్నారు.

1. యావత్ జీవేతూ సుఖజీవేతూ(జీవితాంతం సుఖంగా జీవించు)
2.రుణమూ కృత్వాఘృతపీవేతూ(అప్పు చేసైనా నెయ్యితాగు)
3.భస్మీభూతస్యదేహస్య(కాలిపోయి బూడిద అయ్యేదే ఈ దేహం)
4. పునరాగమనకృతః(మళ్లీ తిరిగి వస్తుందని ఎలా అనుకుంటావు?)

నెయ్యితాగు– అంటే ఇక్కడ నెయ్యి, అనేకాదు శరీరానికి అవసరమైన పౌష్టికాహారం అని అర్థం. చనిపోయాక ఈ దేశం కాలిస్తే బూడిద అవుతుంది. పూడిస్తే మట్టి అవుతుంది. అంతేగాని, ఇక పునరాగమనం ఎక్కడా? శరీరం ఎలా తిరిగివస్తుందీ అని ప్రశ్నించారు. అంటే పునర్జన్మ అబద్ధమనీ, అది ఉండదనీ చెప్పారు. మోక్షానికి కూడా ఆధారం లేదన్నారు. శరీరమే ముఖ్యం–వైదిక మతస్థులు చెప్పు ఆత్మ ఉండాలన్నా కూడా శరీరం ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలి–కదా? అప్పులు చేసైనా సుఖంగా ఉండు అని అన్నది ఎందుకంటే అప్పు తీసుకున్నవాడు, అప్పు ఇచ్చినవాడూ ఇద్దరూ ఏదో ఒక నాటికి నశించాల్సిన వాళ్ళే. కానీ, జీవిని, ప్రాణాన్ని కష్టపెట్టకుండా కాపాడుకొమ్మని చార్వాకులు చెప్పారు. మిథ్యావాదాన్ని నమ్మగూడదని అన్నారు. సంశయవాదం, సందేహవాదాన్ని ప్రమాణంగా తీసుకోలేదు. కర్మఫలం ఉండదు. స్నేహితులతో, బంధువులతో బతికినంతకాలం సంతోషంగా గడపడమే జీవితం! వారినందరినీ పక్కకు నెట్టి, ఎక్కడా లేని పరలోక సుఖాల కోసం పూజలు, యజ్ఞాలు చేయడం మూర్ఖుల లక్షణం– అని అన్నారు. తర్కాన్ని అనుభవాన్ని–శరీరాన్ని మాత్రమే నమ్ముకోవాలి. అంతేగాని ఆత్మను, పునర్జన్మను, స్వర్గనరకాలను, కర్మకాండలను నమ్ముకోగూడదన్నది వారి సిద్ధాంతం! వైదిక ధర్మంలో యజ్ఞయాగాలకు, జంతు బలులకు చాలా ప్రాముఖ్యం ఉంది. ప్రకృతిని పరిరక్షించుకోవాలని భావించే చార్వాకులు–లోకాయతులు పశువుల్ని, పక్షుల్ని ఇతర జీవరాసుల్ని అమితంగా ప్రేమించేవారు అందుకే జంతుబలుల్ని తీవ్రంగా అడ్డుకున్నారు. బలి ఇచ్చిన పశువులు స్వర్గానికి వెళ్ళేదైతే– వైదిక పండితులు వృద్ధాప్యంతో సతమతమయ్యే తమ తండ్రిని బలి ఇచ్చి నేరుగా స్వర్గం పంపొచ్చు కదా? అని సవాలు విసిరారు. లోకాయతుల అర్థవంతమైన ప్రశ్నలకు జవాబు చెప్పలేక వైదిక ధర్మ ప్రబోధకులు వక్రభాష్యాలు చెప్పి, అణగదొక్కారు. భౌతికవాదులకు పూనుకుని చార్వాకుల్ని బానిసలుగా మార్చారు. ఆడవారిపై అత్యాచారాలు చేశారు. కుట్రపూరితంగా వారి గ్రంథాలన్నింటినీ నాశనం చేశారు. కాల్చేశారు. అందుకే చార్వాక–లోకాయతులపై వెలువడ్డ ప్రాచీన గ్రంథాలు మనకు దక్కలేదు. దేవీప్రసాద్ చట్టోపాధ్యాయ లాంటి పరిశోధకుడి కృషితో కొంతలో కొంత సమాచారం బయటకొచ్చింది. ఏది ఏమైనా ‘నాస్తికో వేదనిందక’(నాస్తికులు వేదాలను ఒప్పుకోరు. నిందిస్తారు) అన్న భావన లోకంలో స్థిరపడింది. చార్వాక– ‘జ్ఞాన సిద్ధాంతాన్ని’– ప్రతిపాదించింది. అంటే థియరీ ఆఫ్ నాలెడ్జ్(EPISTEMOLOGY). ప్రత్యక్ష ప్రమాణాలుంటేనే దేనినైనా స్వీకరించాలని ఈ సిద్ధాంతం చెప్పింది. ప్రత్యక్ష అనుభవం అనేది రుచి, వాసన, స్పర్శ, దృష్టి, శబ్దం వల్ల గ్రహించొచ్చు. జ్ఞానేంద్రియాలకు అందని భ్రమలు–కల్పితాలు! అ ప్రత్యక్ష విశ్వాసాల్ని భౌతికవాదం పరిగణనలోకి తీసుకోదు. చార్వాక్ ‘థియరీ ఆఫ్ రియాలిటీ’ (METAPHYSICS)ని నమ్ముతుంది. గాలి, నీరు, అగ్ని, భూమితోనే ప్రతి పదార్థం రూపొందుతుంది గనక, ''పదార్థమే''(MATTER) జీవనానికి ప్రధానం అన్నారు. మేటర్‌ని గుర్తుస్తుంది గనక, ఈ సిద్ధాంతం''మెటీరియలజం'' అయ్యింది. జీవించి ఉన్న ప్రాణిలోని స్పృహ (CONSCIOUSNESS)ను వైదికధర్మం ‘ఆత్మ’ అని భావించింది తప్పితే–ఆత్మ అనేది లేదన్నది చార్వాకులు గట్టిగా నమ్మారు–చెప్పారు కూడా! ''దేబీదా’గా ప్రేమగా పిలువబడ్డ దేవీప్రసాద్ చట్టోపాధ్యాయ చదువుకునే రోజుల్లో డిగ్రిలోను, పిజిలోను గోల్డ్‌మెడల్స్ సాధించారు. తత్వశాస్త్ర విద్యార్థిగా, అధ్యాపకుడిగా ఒక కొత్త ఒరవడిని సృష్టించినందుకు చివరిదశలో ఆయనను నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ డెవలప్‌మెంట్ స్టడీస్ సగౌరవంగా ‘ గెస్ట్ సైంటిస్ట్’గా నియమించుకుంది! ఇది చాలా అరుదైన విషయం! ఆయన కృషిని గుర్తించి 1998లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ ప్రకటించింది. సమకాలీనంలో యువత ''దేబీదా'' అడుగుజాడల్లో వైజ్ఞానిక–భౌతిక– మానవవాదాలకు దారులు వేస్తారు– తప్పదు.

**(కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త, మెల్బోర్న్ నుంచి)**

# బిఆర్‌ఎస్‌కు ఏమైంది?




తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. కాంగ్రెస్, బిజెపిలకు చెరి ఎనిమిది స్థానాలు, ఎంఐఎం యధావిధిగా ఒక స్థానంలో విజయం సాధించింది. ఆ పార్టీలకు సంతృప్తికర ఫలితాలు వచ్చినప్పటికీ, తెలంగాణ అస్థిత్వంతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి, ప్రస్తుత భారత రాష్ట్ర సమితికి సున్నా రావడంపై చర్చలు సాగుతున్నాయి. ఊహించని ఫలితం కానప్పటికీ కనీసం మెదక్ స్థానం గెలుస్తారేమోననే అంచనా ఉండేది. ఆరు నెలల క్రితం 37.3 శాతం ఓట్లు, 39 అసెంబ్లీ స్థానాలతో గట్టి ప్రతిపక్షంగానే కనిపించిన బిఆర్‌ఎస్ లోక్‌సభ ఫలితాలలో కేవలం మూడు గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాకలోనే ఆధిక్యత దక్కించుకొని, కంటోన్మెంట్ శాసనసభ స్థానాన్ని ఉప ఎన్నికలో జారవిడుచుకుంది. అధికారం కోల్పోతే ప్రాంతీయ పార్టీల ఉనికి అంతంతేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత బిజెపి ప్రభుత్వ హయాంలో ప్రాంతీయ పార్టీలను రకరకాలుగా తొక్కి, చీల్చి చెండాడి, ఏక భారత్, ఏక భాష, ఏక సంస్కృతి, ఏక ఎన్నికలు అనే నినాదాన్ని తెరపైకి తెచ్చారు. ప్రాంతీయ పార్టీలకు చరమగీతం పాడి, ఆ స్థానాన్ని కబళించేందుకు సుదీర్ఘకాలం పాటు మిత్రపక్షంగా కలిసి పయనించిన పంజాబ్‌లోని అకాలీదళ్‌ను తొలుత దూరం చేసుకున్నది. ఆ తరువాత అధికార దాహంతో మహారాష్ట్రలో మరో దీర్ఘకాలిక మిత్ర పార్టీ శివసేనను, దానితో పాటు ఎన్‌సిపిని కూడా చీల్చి, చీలిక వర్గాన్నే అసలైన వర్గంగా అన్ని కుయుక్తులకు పాల్పడి, అసలు పార్టీలను గొంతు నులిమినంత పని చేసింది. ఆ పార్టీలనే నకిలీ పార్టీలంటూ స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ మహారాష్ట్రలో ప్రచారాన్ని హోరెత్తించారు. తమిళనాడులో మరో మిత్రపక్షంగా ఎఐడిఎంకెను కూడా ముప్పుతిప్పలు పెట్టి, బెదిరించి ఒక వర్గాన్ని తమ వైపునకు తిప్పుకున్నారు. మొత్తానికి ప్రాంతీయ పార్టీలను మట్టుపెట్టి, ఆ ఖాళీలను కాషాయ పార్టీతో భర్తీ చేసేందుకు చేయని ప్రయత్నం లేదు.కానీ, ప్రధాని మోదీ, బిజెపి ఊహించింది జరగకపోగా, ప్రజలు మాత్రం తమ ప్రాంతీయ అస్థిత్వాన్ని బలంగా చాటుతూ, భిన్నత్వంలో ఏకత్వమనే భారతీయ తత్వాన్ని లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఎలుగెత్తి చాటారు.

### ప్రాంతీయ పార్టీలకు వెన్నుదన్నుగా నిలిచిన ఓటర్లు

దేశవ్యాప్తంగా రెండు, మూడు చోట్ల మినహా ప్రాంతీయ పార్టీలకు సత్ఫలితాలను కట్టబెట్టడం ద్వారా వన్ ఇండియా పేరుతో భాష, సంస్కృతి, సమాఖ్యవాదంపై దాడిని బలంగా తిప్పికొట్టారు భారతీయులు. మనదేశంలో ప్రాంతీయ అస్థిత్వాలకు దర్పణం పట్టే ఉద్యమాలు,ప్రజోద్యమాలుగా మారి, ప్రజాస్వామ్య ప్రక్రియలో రాజకీయ పార్టీలుగా రూపాంతరం చెంది జనామోదాన్ని పొందాయి. అందులో ప్రధానంగా పంజాబులో సిక్కుల కేంద్రంగా ఏర్పడిన ప్రాంతీయ పార్టీ శిరోమణి అకాలీదళ్‌కు వందేళ్లకు పైగా చరిత్ర ఉన్నది. ఆ పార్టీ 1920లో ఏర్పాటైంది. దేశ భద్రతలో కీలక పాత్ర పోషించిన సిక్కులను ఏకతాటిపై ఉంచుతూ, వారి ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, ఆ పార్టీ ఆటుపోట్లు ఎదుర్కొంటున్నప్పటికీ, ఇప్పటికీ కొనసాగుతోంది. రైతు ఉద్యమాల ఒత్తిడికి తలొగ్గి, మూడు నల్ల చట్టాలను వెనక్కి తీసుకునేందుకు బిజెపి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం సిద్ధపడకపోవడంతో ప్రభుత్వం నుండి వైదొలిగింది. ఈ సారి ఒంటరిగానే పోటీ చేసి ఒక లోక్‌సభ స్థానాన్ని గెలుచుకుంది. అయితే, ఆపార్టీ కంటే రెట్టింపు సంఖ్యలో ఇద్దరు అతివాద సిక్కు నాయకులు స్వతంత్ర ఎంపిలుగా గెలవడం కీలక పరిణామం. ప్రాంతీయ ఆకాంక్షలను బిజెపి లెక్కపెట్టకపోవడంతో ఇలాంటి ధోరణులు పునరావృతమవుతున్నాయి. ఇక తమిళనాడులో బిజెపి ఎన్ని పన్నాగాలు , ప్రచారపటాటోపాలు ప్రదర్శించినా కాషాయ పార్టీ బుట్టలో పడకుండా, ద్రవిడ ఉద్యమ కీర్తి పతాకగా కొనసాగుతున్న 74 ఏళ్ల చరిత గల డిఎంకె పార్టీ, తనతో పాటు మిత్రపక్షాలను వెంటబెట్టుకొని తమిళనాడులో క్లీన్ స్వీప్ చేసింది. మహారాష్ట్రలోనైతే మరాఠీలు తమ అస్మిత(ఆత్మగౌరవం)ను ఎలుగెత్తి చాటుతూ శివసేన, దాని మిత్రపక్షాలను గెలిపించుకున్నారు. ఉద్ధవ్ శివసేనను ఈ సారి గుజరాతీ నేతల చేతుల్లో ఉన్న బిజెపి ముప్పు తిప్పలు పెట్టిన, పార్టీని, ఎన్నికల చిహ్నాన్ని లాగేసి తన అనుంగ చీలిక పార్టీకి కట్టబెట్టిన వైనం మరాఠీల హృదయాన్ని గాయపరిచింది. ముంబై, చుట్టు పక్కల ప్రాంతాలలోనే బలంగా ఉండే శివసేనకు ఈసారి మహారాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పట్టంగట్టారు. సిక్కింలో ఎన్‌డిఎ భాగస్వామిగా ఉన్నప్పటికీ, బిజెపితో కలవకుండా ఒంటరిగా లోక్‌సభతో పాటు, ఆ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన ప్రాంతీయ పార్టీ సిక్కిం కాంత్రికారీ పార్టీని సిక్కిమీయులు గుండెల్లో పెట్టుకొని, 32 స్థానాలలో ఒకటి మినహా 31 స్థానాలను కట్టబెట్టి అపూర్వ విజయాన్ని అందించారు. ఏకైక లోక్‌సభ స్థానంలో కూడా ఆ పార్టీనే భారీ మెజారిటీతో గెలిపించారు. నాగాలాండ్‌తో పాటు పలు ఈశాన్య రాష్ట్రాలలో కూడా ప్రాంతీయ శక్తులకు ప్రజలు జై కొట్టారు లోక్‌సభ ఎన్నికలలో. ఇక ఆంధ్రప్రదేశ్‌లోనైతే తెలుగు ఆత్మగౌరవ నినాదంతో ఏర్పాటైన తెలుగుదేశం పార్టీకి సంచలన విజయాన్ని అందించడమే కాకుండా, ఆ పార్టీ జాతీయ స్థాయిలో భాగస్వామిగా ఉన్న ఎన్‌డిఏకే ఊతమిచ్చేలా ప్రజలు తీర్పునిచ్చారు. బిహార్‌లో జెడి(యు), కర్నాటకలో జెడి (ఎస్)లు పేరుకే జాతీయ పార్టీలని చెప్పుకుంటున్నా, ఆయా రాష్ట్రాలలో కొన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తూ, బిజెపి ఆ రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లు సాధించేందుకు ఉపయోగపడ్డాయి.

### తెలంగాణలో బిఆర్‌ఎస్ నిలదొక్కుకుంటుందా?

దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల్లో ప్రాంతీయ అస్థిత్వాలకు పట్టంగట్టిన ఓటర్లు తెలంగాణలో ఎందుకు భిన్నంగా వ్యవహరించారు? తెలంగాణలో శాసనసభ ఎన్నికలలో బిఆర్‌ఎస్‌కు అధికారం పోయినా మంచి స్థానాలే వచ్చినప్పటికీ, గడిచిన పదేళ్ళలో తెలంగాణ ఉద్యమకారుల పట్ల ఆ పార్టీ వ్యవహరించిన తీరును, అప్రజాస్వామిక ధోరణిని ప్రజలు మరిచిపోలేకపోయారు. లోక్‌సభ ఎన్నికలు వచ్చే సమయానికి కూడా ఆ పార్టీ తీరులో పెద్దగా మార్పు కనపడకపోవడం, కాంగ్రెస్‌ను ఓడించేందుకు ప్రత్యామ్నాయంగా బిజెపికి ఆ పార్టీ నుండే ఓట్లు బదిలీ కావడంతో దెబ్బతిన్నది. అసెంబ్లీ ఎన్నికల్లో 37 శాతం ఉన్న ఓటింగ్, లోక్‌సభ ఎన్నికలలో 16.68 శాతానికి పడిపోయింది. అయితే, గతానుభవాలను చూసినట్లయితే స్థానిక అంశాలకు వచ్చినప్పుడు ప్రజలు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. దాదాపుగా లోక్‌సభ ఎన్నికల సమయంలోనే జరిగిన మూడు ఉమ్మడి జిల్లాలతో కూడిన పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో బిఆర్‌ఎస్ అభ్యర్థి బాగానే పోటీ ఇచ్చి రెండవ స్థానంలో నిలవడం జరిగింది. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా బిఆర్‌ఎస్ నుండి బిజెపికి ఓట్లు పోయినప్పటికీ, తరువాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్‌ఎస్ తన ఓట్లను నిలబెట్టుకోగలిగింది. ఈసారి మాత్రం బిఆర్‌ఎస్ నాయకత్వం వైఖరి మారడం, అది మారినట్లుగా ప్రజలకు రూఢీ అయితే, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కొంత నిలదొక్కుకునేందుకు ఆస్కారం ఉంది. అది బిఆర్‌ఎస్ చేతిలోనే ఉంది. లేనట్లయితే, ఓటు బ్యాంకు తుడిచిపెట్టుకుపోయినా, ప్రజల్లోని ప్రాంతీయ అస్థితత్వ వాదం చెరిగిపోదు. దానిని పాలకులు గౌరవించనప్పుడు, అది ఏదో ఒక రూపంలో మొలకెత్తుతుందని చరిత్ర చెబుతోంది. తాజా ఎన్నికల్లో మరో దృష్టాంతాన్ని పరిశీలించినట్లయితే, ఒడిశాలో సుదీర్ఘకాలం 24 ఏళ్ళు నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని ప్రభుత్వం కొనసాగడం, ఆయన అనారోగ్యం వంటి అంశాలతో ప్రజలు ఆయన పార్టీని తిరస్కరించారు. అదే సమయంలో ఆ పార్టీకి శాసనసభ ఎన్నికలలో మాత్రం బిజెపితో సమానంగా 40 శాతం ఓట్లు ఇచ్చి, 147 ఎంఎల్‌ఏ స్థానాలలో 51 సీట్లు ఓటర్లు కట్టబెట్టారు. ఇది కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి ఒక అంతర్లీన హెచ్చరికగానే భావించవచ్చు. తమ గత వైఖరిని మార్చుకొని ప్రాంతీయ అస్థిత్వాలను, దేశ బహుళత్వాన్ని, బహుభాషా, సంస్కృతులను, సమాఖ్యవాదాన్ని గౌరవించాల్సిందేనని ప్రజలు స్పష్టంగానే చెప్పారు. అన్నిటికి మించి, మూడవసారి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడేందుకు ఊతంగా నిలిచిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఈ విషయాన్ని ఎన్‌డిఏ పార్లమెంటు సభ్యుల సమావేశంలో నర్మగర్భంగా ''ప్రాంతీయ ఆకాంక్షలు, జాతీయ ప్రయోజనాలను సమన్వయపరుస్తూ సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి సమాంతరంగా సాగాల''ని చెప్పకనే చెప్పారు. ఏదైనా, దేశ రాజకీయాలు ఆసక్తితో గమనించాల్సిన దశలో ప్రవేశించాయి.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య




ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య లభిస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, బకల్‌వాడి ఉన్నత పాఠశాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చాటిన మెరుగైన ఫలితాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల నిర్మాణాలను చేపట్టి పాఠశాలల పునః ప్రారంభంలోపు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్య లభిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాను ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలోని 29 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసే సిబ్బందికి నా జీతం నుంచి నగదును అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్, ప్రధానోపాధ్యాయులు విజయకుమారి, ధర్మానాయక్, కరుణాకర్‌రెడ్డి, కస్తూరి ప్రభాకర్, కౌన్సిలర్ లావూరి రవి, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, చలపతి రావు, ధీరావత్ రవితేజ, కుర్ర నాగునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గొలనుకొండకు బస్సు సౌకర్యం కల్పిస్తాం



ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు మండలం గొలనుకొండ గ్రామం నుండి ఆలేరు పట్టణానికి రావాలంటే బస్సులు లేకపోవడం బాధాకరమని గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా వారు వెంటనే స్పందించి తొందర్లోనే బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదని చెప్పడంతో వెంటనే స్పందించి దాని మరమ్మతులు గాని కొత్త ప్లాటు వేయడానికి ఆలోచన చేద్దామని తెలిపారు. కుమ్మరికుంట మూలమలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున ప్రత్యేక చర్యలు దానిపై కూడా స్పందించి సంబంధించిన ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడి ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశాలు అధికారులకు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బీర్ల ఫౌండేషన్ మండల అధ్యక్షులు లగ్గాని కుమార్, ఓబిసి మండల అధ్యక్షులు బందారపు మధు, మండల నాయకులు భీమగాని శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు తండా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# 15న మహాధర్నా



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** జూన్ 15న ఇందిరాపార్కు దగ్గర తలపెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం భువనగిరిలోని ఎస్‌వి హోటల్‌లో వివిధ బీసీ కుల, సంఘాలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలో సమగ్ర కులగణన నిర్వహించాలన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకోవాలని కాంగ్రెస్ పెద్దలు చూడటం అత్యంత దుర్మార్గం అన్నారు. అనంతరం మహాధర్నాకు సంబందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ్, సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేష్ యాదవ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు అతికం లక్ష్మి నారాయణ గౌడ్, అడ్వొకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లొడంగి గోవర్ధన్, టి.జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల క్రిష్ణ, ఎంపీటీసీ రాసాల మల్లేష్ యాదవ్, గుండెబోయిన సురేష్ యాదవ్, పల్లెగొర్ల రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ నిర్ధారణకు ఉచిత పరీక్షలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఎంజెఎఫ్ లైన్స్ క్లబ్, నల్లగొండ చేతన ఫౌండేషన్ కొంగర రామచందర్ రావు కుటుంబ సభ్యులు పెరుమాళ్ళ హాస్పిటల్ నల్లగొండ సంయుక్తముగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరము పెరుమాళ్ళ హాస్పిటల్ లో ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో క్యాన్సర్ లక్షణములు ఉన్న, పురుషులు సుమారు కోటి రూపాయలు విలువ గలిగిన మొబైల్ వాహనములో చేయు అత్యాధునిక వైద్య పరీక్షలు అవసరమైన వారికి నిపుణులైన వైద్య బృందంచే రొమ్ములకు మమోగ్రఫీ, గర్భాశయమునకు స్కానింగ్, ఊపిరితిత్తులకు ఎక్సరే, పాప్స్మియర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారుగా 160 మంది వ్యక్తులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పిడిజిలు భీమయ్య, రఘుపతి నేతి, చేతన ఫౌండేషన్ సభ్యులు కొంగర రామచంద్రరావు, రంగారావు, ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ అలీముద్దీన్, క్లబ్ అధ్యక్షులు ఎల్ వి కుమార్, కె వి ప్రసాద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మదన్మోహన్ రేపాల, రీజియన్ చైర్ పర్సన్ అశోక్ రెడ్డి గట్టుపల్లి, జోన్ చైర్ పర్సన్ శ్రీనివాస్, డాక్టర్ పుల్లారావు, డాక్టర్ అనితా రాణి, పిచ్చయ్య , శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పునరుద్ధరణలో దేశప్రజలు

- మోడీ దూకుడుకు ముకుతాడు
- మతం, దేవుడు ఓట్లు రాల్చని వైనం

**ప్రజాపక్షం / ఖమ్మం :** 18వ పార్లమెంటు ఎన్నికల ముంగిట ప్రజాస్వామిక, అభ్యుదయ వాదుల్లో ఓ భయం తొంగిచూసింది. రాను రాను మోడీ ప్రసంగాల తర్వాత ఆ భయం మరింత పెరిగింది. గతంలో ఏ దేశ ప్రధాని మాట్లాడని రీతిలో మాట్లాడి ఎప్పుడు ఎక్కడ ఎన్నికల ప్రచార అంశంగా మారని అనేక అంశాలను ప్రసార అస్త్రాలుగా మార్చుకున్న మోడీ తీరు మళ్లీ మోడీ గెలిస్తే అన్న చర్చకు దారి తీసింది. రెండవ దఫా అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక ఉన్మాదిని, అహంభావంతో కూడిన ప్రధానిని మోడీలో చూశారు. అంతే కాదు ప్రజలను వదిలి కార్పొరేట్ల కోసమే పాలన చేసిన ఒక అరుదైన ప్రధానిని కూడా మోడీలో చూశాం. తొలి నాళ్లలో అంతగా విషం చిమ్మని మోడీ ప్రసంగాలు ఉత్తర భారతంలో క్రమేపి బిజెపి బలహీనపడుతుందన్న సంకేతాలు రావడం ఇండియా కూటమి పుంజుకుంటున్న తీరు మోడీ అండ్ కో ను కలవరపెట్టింది. అందుకే ఏకంగా మతాన్ని భుజాన ఎత్తుకుని మరో మతాన్ని టార్గెట్ చేశారు. హిందువుల ఆస్తులకు రక్షణ ఉండాలంటే బిజెపి గెలవాలని సూత్రీకరించారు. కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి అధికారంలోకి వస్తే హిందువుల తాళిబొట్లకు సైతం రక్షణ ఉండదని మోడీ తన ప్రసంగాల ద్వారా ప్రజల మెదళ్లలోకి ఎక్కించే ప్రయత్నం చేశారు. ఆస్తుల రక్షణే కాదు ఇతరత్రా ముఖ్యంగా రిజర్వేషన్లు, రాజ్యాంగ సవరణ తదితర అంశాలు మోడీ ప్రసంగాలలో ప్రధాన అంశాలయ్యాయి. మోడీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లు ఉండవన్న ఒక భావన ప్రజల్లోకి వెళ్లింది. దానికి సంబంధించి ప్రత్యర్థుల ప్రచారం కంటే మోడీ ప్రసంగాలే ప్రజలను ఆలోచింపజేసేలా చేశాయి. ఇక ఈడి, సిబిఐ లాంటి సంస్థల తీరు జుగుప్సకరంగా మారడం మళ్లీ మోడీ గెలిస్తే విపక్ష నేతలు బయట తిరుగుతారా అన్న ఒక సందేహం ప్రతి ఒక్కరి మదిలో మెదిలింది. అహంభావంతో కూడిన అహంకారపు మాటలు మోడీ ఏకపక్ష గెలుపును నిలువరించాయి. 2024లో 18వ పార్లమెంటుకు జరిగిన ఎన్నికలు మోడీకి ముకుతాడు వేశాయి. ఈ దేశంలో బిజెపి ఎదుగుదలకు సోపానంగా మారిన అయోధ్య రామాలయం హిందు మత ప్రస్తావన, విశ్వ హిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ లాంటి సంస్థల తీరు బిజెపి ఏకపక్ష విజయానికి అడ్డుగా నిలిచింది. అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని విస్తృత ప్రచారం చేయించడం ద్వారా ఎన్నికల్లో లబ్ది పొందవచ్చునన్న ఆలోచన ఎదురు తన్నింది. అయోధ్య నగరం ఉన్న ఫైజాబాద్ నియోజక వర్గంలో అవదేశ్ ప్రసాద్ అనే దళిత నేత 50వేలకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఇక్కడ 80 శాతం హిందువులు నివసిస్తున్నారు. ఇక ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వాసికెక్కిన వారణాసిలోను మోడీ చరిష్మా మసకబారింది. అనేక పుణ్య క్షేత్రాలతో భాసిల్లుతున్న దైవ క్షేత్రం వారణాసి. కాశీని దర్శించాలని ప్రతి హిందువుల కల అన్నది అందరికీ తెలిసిందే. అటువంటి కాశీలో 2019లో మోడీకి 4.79 లక్షల ఓట్ల మెజార్టీ వస్తే 2024లో 1.52 లక్షల ఓట్ల మెజార్టీకి పరిమితమయ్యారు. దేశ ప్రజలను మోడీ అండ్ కో 400 సీట్లను కోరింది. అధికారాన్ని కోరుకోవడం అందుకు సరిపడ మెజార్టీని కోరుకోవడం సహజమే. కాని 400 సీట్లను కోరుకోవడం అనుమానానికి తావిచ్చింది. అందుకే అసలు పాలనకు సరిపడ మెజార్టీ ఇవ్వకుండా దేశ ప్రజలు ముకుతాడు వేశారు. ఎవరి మాట వినని మోడీ ఇప్పుడు ఇద్దరు వ్యక్తులపై ఆధారపడి పాలన చేయాల్సిన ఒక సంక్లిష్ట స్థితి ఏర్పడింది. మమ్మల్ని కాదంటే జైలులో పెడతాం. మా అనుకూలురకు ఆస్తులు అమ్మేస్తాం అనే ఆలోచన ఇక ముందుకు సాగకపోవచ్చు. స్వల్ప ఆధిక్యతతో ఎన్డీఏకు అధికారం కట్టబెట్టిన కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమిని దేశ ప్రజలు గౌరవించారు. మీరు ఈ దేశానికి అవసరం అన్న సంకేతాలు ఇచ్చారు. అధికారం రాకపోవచ్చు కాని కాంగ్రెస్ కూటమికి అధికారం ఇవ్వకపోవచ్చు కాని బిజెపిని మాత్రం దేశ ప్రజలు ఓడించారనడంలో సందేహం లేదు. మున్ముందు మరిన్ని పరిణామాలను మోడీ నేతృత్వంలోని సర్కార్ ఎదుర్కొవాల్సి ఉంటుంది. చంద్రబాబు, నితీష్‌కుమార్ ఇద్దరు నమ్మదగిన మిత్రులు కాదన్నది దేశ వ్యాప్తంగా అందరికీ తెలిసిన సత్యమే. ఇప్పటికే నితీష్‌కుమార్ అటు నుంచి ఇటు ఇటు నుంచి అటు దూకిన విషయం అందరికీ విధితమే. ఇక చంద్రబాబు సైతం 2014లో మద్దతునిచ్చి 2018లో ఉపసంహరించుకుని బిజెపికి వ్యతిరేకంగా ఢిల్లీ వీధుల్లో ప్రచారం చేసిన విషయం అందరికీ తెలిసిందే. కాంగ్రెస్‌తో చెట్టపట్టాలేసుకుని తిరిగిన నేపథ్యం దేశ ప్రజలు ఇంకా మరచిపోలేదు. వీరిద్దరి ప్రస్తావన ఎందుకంటే మోడీ నేతృత్వంలో ఎన్డిఏ ప్రభుత్వం ఏర్పడితే దాని మనుగడ చంద్రబాబు నాయుడు, నితీష్‌కుమార్ ల పైనే ఆధారపడి ఉంది. మొత్తంగా పరిశీలించినప్పుడు భారతదేశ ప్రజలు ప్రజాస్వామ్యానికి ఊపిరి పోశారు. మోడీ, అమిత్‌షా దూకుడుకు కళ్లెం వేయడమే గాక ప్రభుత్వ రంగసంస్థల దుర్వినియోగం, ప్రజల ఆస్తులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రక్రియకు బ్రేకులు వేశారు. అంతే కాదు అహంభావం, అహంకారం, అధికారంలోకి వస్తే అంతా నాదేనన్న భ్రమ నుంచి నేతలు బయటకు రావాలన్న ఒక అద్భుత సందేశాన్ని ఇచ్చారు. ఇది కొందరికి గుణపాఠమైతే మరికొందరికి హెచ్చరిక లాంటిది. అధికారం ఉందని ఇష్టాను సారంగా ప్రవర్తిస్తే తలవంచేలా చేస్తారని 2024 ఎన్నికలు నిరూపించాయి.



# కెమెరాముందే పరీక్షాపత్రాలు తెరవాలి

గ్రూప్1 ప్రిలిమినరీకి ఏర్పాట్లు పూర్తి
అభ్యర్థులు ఉదయం 8 : 00 గంటల వరకు కేంద్రానికి హాజరు కావాలి
అదనపు కలెక్టర్ సిహెచ్ ప్రియాంక




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** నేడు జరిగే గ్రూప్1 ప్రిలిమినరీ పరక్ష ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గౌతమి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో సిసిటీవి కెమెరా ముందు పరీక్షా పత్రాలు ఓపెన్ చేయాలన్నారు. ఉదయం 8:0 గంటల నుండి అభ్యర్థులు పరీక్ష కేంద్రలో పంపాలన్నారు. పరీక్ష కేంద్రంలో ఉదయం 9:0 గంటల నుండి బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని సూచించారు. అభ్యర్థులను 10:0 గంటల వరకే కేంద్రంలో అనుమతించాలని తరువాతా ఎవ్వరిని కూడా అనుమతించవద్దన్నారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్, తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిర్ధేశించిన సమయానికి విధులకు హాజరు కావాలన్నారు. జిల్లాలో 32 కేంద్రాల్లో 9725 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. ఉదయం హుజూర్‌నగర్, కోదాడ, తిరుమలగిరి, తుంగతుర్తి నుండి వచ్చే అభ్యర్థులకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కర్యక్రమంలో ఎస్‌వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, రిజినల్ కోఆర్డీనేటర్ డాక్టర్ వెంకటేశం, ప్రిన్సిపల్ వై లక్ష్మయ్య గౌడ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినోద్‌కుమార్‌కు వెన్నుపోటు పొడిచిన మేయర్

కార్పోరేటర్ భర్త వద్ద లంచం అడిగే స్థాయికి దిగజారిన మేయర్
పదవికి సునీల్‌రావు రాజీనామా చేయాలి
ప్రెస్‌మీట్‌లో కార్పోరేటర్ కమల్‌జిత్‌కౌర్ భర్త సోహాన్ సింగ్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** అభివృద్ధి పనులు పూర్తి చేసి ఎంబి రికార్డయిన దానికి బిల్లు ఇవ్వకుండా తనను నగర మేయర్ సునీల్ రావు లంచం అడిగారని కరీంనగర్‌లోని 49వ డివిజన్ కార్పోరేటర్ కమలజిత్ కౌర్ భర్త సోహాన్ సింగ్ ఆరోపించారు. కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పోరేటర్ భర్త వద్ద లంచం అడిగే స్థాయికి కరీంనగర్ నగర మేయర్ దిగజారారని మండిపడ్డారు. వెయ్యి కోట్ల స్మార్ట్ సిటీకి నిధులు తెచ్చిన బోయినపల్లి వినోద్ కుమార్‌కు వెన్నుపోటు పొడిచారన్నారు. ఒక మేయర్‌గా 60 డివిజన్లు ప్రచారం చేయాల్సిన మేయర్ తన డివిజన్‌కే పరిమితమై మెజార్టీ సైతం తెచ్చుకోలేకపోయాడన్నారు. 60 డివిజన్లలో కనీసం 19 వేల ఓట్లు రానందుకు మేయర్ సునీల్‌రావు చేసిన అవినీతితో డిపాజిట్ కోల్పోవడం జరిగిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ మారని కార్పోరేటర్లు ఎంపి ఎన్నికల్లో ఇతర పార్టీల్లోకి మారారని, కనీసం ఆపే ప్రయత్నం చేయలేదన్నారు. కరీంనగర్ నగరానికి మేయర్ సునీల్‌రావు హయాంలో 3 వేల కోట్ల పనులు జరిగాయని, ఆయన చేసిన అవినీతితో కరీంనగర్‌లో ఎంపి ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోవడం జరిగిందన్నారు. మేయర్ సునీల్‌రావు ఒత్తిడితో అవినీతి చేసిన మున్సిపల్ అధికారులు జైలు పాలయ్యారన్నారు. బోయినపల్లి వినోద్ కుమార్ ఓటమికి కారణమైన మేయర్ సునీల్‌రావు నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలన్నారు. గత పాలకవర్గంలో ఆమోదం పొందిన అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ వర్క్ ఆర్డర్ ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ నిధులతో వేసిన సిసి రోడ్డు వర్క్ పూర్తయి ఎంబి బుక్‌లో రికార్డయిన పనికి బిల్లు ఇవ్వకుండా లంచం అడిగారని ఆరోపించారు. ఇవ్వనందుకు ఎల్‌ఆర్‌ఎస్ నిధులను గత కౌన్సిల్ ఆమోదం పొందిన వర్క్‌ను మళ్లీ కౌన్సిల్‌లో పెట్టి రద్దు చేశారన్నారు. నెలకోసారి నిర్వహించాల్సిన నగరపాలక సంస్థ సర్వసభ్యసమావేశం అసమ్మతి భయానికి ఆరు నెలలైనా పెట్టడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎటువంటి జీవో జారీ చేయకముందే ఎలక్ట్రానిక్ మీడియాకు , ప్రింట్ మీడియాకు సమావేశం మందిరంలో రానివ్వకుండా చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

# మోసంచేస్తూ లోన్లు పొందుతూ...



ఆదార్ కార్డులు మారుస్తూ మోసం చేస్తున్న నిందితులు అరెస్ట్

**ప్రజాపక్షం/నల్లగొండ :** అమాయక ప్రజల ఆధార్ కార్డులు సేకరించి అడ్రెస్స్ లు మారుస్తూ బ్యాంక్ అధికారులను మోసం చేస్తూ లోన్లు పొందుతున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్‌పి చందనా దీప్తి తెలిపారు. అరెస్టు చేసిన నింధితుల నుండి 27 ఆధార్ కార్డులు, రూ.1,32,600 తో పాటు 44 సెల్‌ఫోన్లు, 2 కార్లు, 83 ఫాన్ కార్డులు, 18 సిమ్ కార్డులు, డెబిట్, క్రెడిట్ కార్డులు, రబ్బరు స్టాంపులు, ల్యాప్‌టాప్‌లు, కలర్ ప్రింటర్స్‌ను, బోగస్ సంస్థల పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గత కొంత కాలంగా కట్టంగూర్ మండలం కురుమర్తి గ్రామానికి చెందిన కాశమల్ల క్రాంతి కుమార్ హైద్రాబాద్ యం.బి.ఏ చదివి తను సాఫ్ట్‌వేర్ కంపనీ స్వయంగా పెట్టుకొని నష్టాలు రాగా అదే కంపనీలో ఉద్యోగిగా పని చేస్తున్న శిలువేరు సతీష్ తక్కువ సమయంలో ఎక్కువ అక్రమ సంపాదనా సంపాదించాలి అనే దురుద్దేశంతో తన బాబాయి అయిన నల్లగొండ పట్టణానికి చెందిన కాశామల్ల నాగరాజులతో పథకం వేశారు. నాగరాజు చదువు రాని అమాయకుల నుండి ఆధార్ కార్డులు తీసుకొస్తే వారు కొంత డబ్బులు ఇస్తానని చెప్పగా సరేనని ఒప్పుకుని అతనికి తెలిసిన కొంత మంది ఆధార్ కార్డులు తీసుకొచ్చి ఇచ్చేవాడు. తరువాత వారి ఆధార్ కార్డ్ ల సహాయంతో పాన్ కార్డు తీసుకొని ఫోన్ నెంబర్లతో లింక్ చేయడానికి కొత్త సిమ్ తీసుకొని ఆధార్ కార్డ్ లను ఫోటోషాప్ లో అడ్రెస్ లను మాత్రమే మార్ఫింగ్ చేసి, వివిద బ్యాంక్ లలో అకౌంట్ ఓపెన్ చేసి అట్టి బ్యాంక్ పాస్ పుస్తకాలను, చెక్ బుక్ లను, ఏటిఎం కార్డులను, వీరి వద్దనే పెట్టుకుని వాటి ద్వారా వారే నగదు బదిలీ చేసి అట్టి వ్యక్తుల బోగస్ కంపనీలను తప్పుడు పత్రాలను సృష్టించారని ఆరోపించారు. వారిని గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు.

# తల్లిదండ్రులు లేకుంటే ఉచిత విద్య





**ప్రజాపక్షం / వడ్డేపల్లి :** తల్లి దండ్రులు లేని విద్యార్థులకు ఉచితంగా విద్యను మరియు సింగిల్ పేరెంట్ వారికి ఫీజులో సగం ఫీజుకే విద్యను అందిస్తామని సరస్వతి విద్యానికేతన్ హై స్కూల్ కరస్పాండెట్ ఎన్. మమతరవి తెలిపారు. తల్లిదండ్రులు లేని విద్యార్థుల కోసం తమ వంతు సాయంగా సరస్వతి విద్యానికేతన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ముఖ్యంగా ఈ అకాడమిక్ సంవత్సరంలో మాత్రమే తల్లి దండ్రులు లేని విద్యార్థులకు ఎంత మందికైన ఉచిత విద్యను 1 నుండి 10వ తరగతి వరకు అందిస్తామని అన్నారు.

# లోయర్ మానేరులో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** 2024 ప్రపంచ మహాసముద్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 'అవర్ ఓపన్ అండ్ క్లైమేట్ కోసం ఉత్ప్రేరక చర్య ' అనే థీమ్‌తో 'భారత సుస్థిర పత్తి యాజమాన్యం పథకం' సహజ వనరుల నిర్వహణ సూత్రం కింద కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్ క్లీన్ అప్ డ్రైవ్‌ను శనివారం చేపట్టారు. రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అర్ధమ్ సురేష్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రయత్నాలలో స్థానిక సమాజాన్ని నిమగ్నం చేశారు. ఈ సంధర్భంగా డ్యామ్ పరిసరాల నుంచి ప్లాస్టిక్, పేపర్లు, డిస్పోజల్ మెటీరియల్స్, ఇతర చెత్తను తొలగించారు. అదనంగా ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కలిగే దుష్పరిణామాలు, నీటి వనరులలో వ్యర్థాలను వేయడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన ప్రచారాన్ని నిర్వహించారు. ఈ పద్దతులు జంతువులు, మొక్కల ఆరోగ్యాన్ని ఎలా దెబ్బతీస్తాయో పర్యావరణాన్ని క్షీణింపజేస్తాయో మానవులలో బయో అక్యుమ్యులేషన్‌కు ఎలా దోహదపడతాయో అందరికీ వివరించారు. స్థిరమైన భవిష్యత్తును పెంపొందించడానికి మా నిబద్ధతను బలోపేతం చేసిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ యూనిట్ మేనేజర్ నిఖిత, ఫీల్డ్ ఫెసిలిటాయర్ వనిత మాధవి, చంద్రలీల, రమేష్ కుమార్, రాజశేఖర్, ఇతర స్పోర్ట్స్ బాయ్స్ పాల్గొన్నారు.

# రామోజీరావు మృతికి సిపిఐ జిల్లాసమితి సంతాపం

**ప్రజాపక్షం/యాదాద్రి :** ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత రామోజీరావు అనారోగ్యంతో శనివారం తుది శ్వాస విడిచారు. ఆయన అకాల మరణానికి చింతిస్తూ సంతాపాన్ని ప్రకటిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా గోదా శ్రీరాములు మాట్లాడుతూ రామోజీరావు తెలుగు భాష సంస్కృతికి అభ్యున్నతికి ఈనాడు దినపత్రిక ద్వారా పెద్దపీట వేశారని గుర్తు చేశారు. సహజ పదకోశాలతో అన్యాయానికి గురవుతున్న అనేకమంది ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి పత్రిక ద్వారా అవిరాల కృషి చేశారని అన్నారు. అభ్యుదయ వాదిగా కృషి చేశారని, ఈనాడు గ్రూపు సంస్థలలో అనేక మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి కుటుంబాలను ఆదుకున్నారని, వారి మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు అని అభిప్రాయపడ్డారు.

# ఎమ్మెల్యే బాలునాయక్ పరామర్శ



**ప్రజాపక్షం/చందంపేట :** మండల పరిధిలోని పోలేపల్లి గ్రామానికి చెందిన పగిళ్ళ నర్సింహా తండ్రి పగిళ్ళ బక్కయ్య దశదిన కర్మ కార్యక్రమానికి శనివారం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ హాజరై బక్కయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట పిసిసి సభ్యులు, పిఏసిఎస్ చైర్మన్ జాల నరసింహారెడ్డి, మండల అధ్యక్షులు బద్యనాయక్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు రాజేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయిరాథోడ్, ఎంపిటిసి మంజుల మోతిలాల్, మాజీ సర్పంచ్ లోకేష్ నాయక్, మాజీ ఎంపిటిసి కుమార్‌నాయక్, సినియర్ నాయకులు సూర్య, ధర్మ, రవిందర్‌రెడ్డి, శ్రీకాంత్, రమేష్, శుభాష్ తదితరులు పాల్గొన్నారు

# రైతులకు అందుబాటులో సోనా, ఆర్‌ఎన్‌ఆర్ వరి విత్తనాలు

**ప్రజాపక్షం/ అయిజ :** తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ వారు సరఫరా చేస్తున్న సోనా మరియు ఆర్.ఎన్.ఆర్.వరి స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని సి.ఏ.సి.ఎస్ అధ్యక్షులు పోతుల మధుసూధన్ రెడ్డి తెలిపారు.25 కేజీ ఆర్‌ఎన్‌ఆర్ వడ్ల పాకెట్ రూ,1049 మరియు 25 కెజీ సోనా మసూరి వరి ప్యాకెట్ రూ,1083 ధరతో విక్రయిస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు పొలం పాస్ పుస్తకం జిరాక్స్ కాపీతో సంప్రదించాలని అన్నారు.వరి ప్యాకెట్ కొన్న రైతులు మా కార్యలయం ఇచ్చే వరిజినల్ రసీదు మరియు ప్యాకెట్లలో ఉండే కార్డును భద్ర పరచుకోవాలని వరి విత్తనాలు మొలకెత్తడంలో తేడాలు వస్తే రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థను సంప్రదించే అవకాశం ఉంటుందని రైతులు నష్టపోకుండా ఉంటారని ఆయన అన్నారు.

# టోల్ ప్లాజా ఉద్యోగులకు వేతనాలు పెంచాలి



మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న టోల్ ప్లాజా ఎంప్లాయిస్ యూనియన్

**ప్రజాపక్షం / అలంపూర్ :** అలంపూర్ తాలూకాలోని ఉండవెల్లి మండలం పరిధిలోని పుల్లూరు గ్రామ శివారులో ఉన్న 44వ జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజాలో విధులు నిర్వహిస్తున్న ఎంప్లాయిస్‌కి మరియు సిబ్బందికి వేతనాలు పెంచాలని టోల్ ప్లాజా ప్రాజెక్ట్ మేనేజర్ బాల గణేష్‌ని కలసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము గత 12 సంవత్సరాలుగా సుమారు 77 మంది వివిద స్థాయిలలో పనిచేయుచున్నాము కనుక మాకు జీతాలు పెంచాలని కోరినట్లు తెలిపారు. ఈ నెల 15 లోపు వేతనాలు పెంచాలని లేని పక్షంలో 16 తేది నుండి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పీటర్, మద్దయ్య,వెంకట్.రాముడు, లాజర్, వెంకటేష్,శేషన్న , రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు రైతు మృతి



ప్రజాపక్షం/ఆత్మకూరు : వ్యవసాయ పనుల నిమిత్తం బావి వద్దకు వెళ్లిన రైతు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన విషాద సంఘటన ఆత్మకూరు మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో చోటు చేసుకున్నది.ఎస్సై రాజేష్ రెడ్డి కథనం ప్రకారం మండలంలోని నీరుకుళ్ల గ్రామానికి చెందిన బిట్ల ప్రేమ్ చంద్(45) తన వ్యవసాయ చేనులో పత్తి గింజలు వేయడానికి వెళ్లారు. బావి చుట్టూ ఉన్న గడ్డిపై మందు పిచికారి చేయడానికి వ్యవసాయ బావి నుండి నీరు తోడే క్రమంలో కాలు జారి ప్రమాదవశాత్తు బావిలో పడి ప్రేమ్ చంద్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య బిట్ల అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు.

## మెడల్స్ సాధించిన సంగీత



ప్రజాపక్షం/కమలాపూర్: కమలాపూర్ జడ్‌పిహెచ్‌ఎస్ బాలికల పాఠశాల విద్యార్థిని 2023, 2024 సంవత్సరంలో 10 వ తరగతి పూర్తి చేసుకున్న మోటం సంగీత జిల్లాస్థాయిలో సిల్వర్, కాంస్య పతకాలను కైవసం చేసుకుంది. కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన మోటం శ్రీనివాస్ రమ దంపతుల కుమార్తె సంగీత ఈనెల 6,7 తేదీలలో హన్మకొండ జిల్లా కేంద్రంలోని జెఎన్‌ఎస్ స్టేడియంలో జరిగిన టిన్ తెలంగాణ స్టేట్ యూత్ అండ్ సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ లో కుమారి సంగీత జావలెన్ త్రో విభాగంలో సిల్వర్, డిస్కస్ త్రో విభాగంలో కాంస్య మెడల్ గెలుచుకోవడం జరిగిందని కమలాపూర్ జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి రామ్ కిషన్ రాజు, పాఠశాల బృందం ఎస్‌పి రంగనాథ్, ఆర్‌యుపిపి రాష్ట్ర అధ్యక్షులు అబ్బుల సంజీవ రెడ్డి, అన్నపూర్ణ, రమేష్, చంద్రమోహన్ రెడ్డి, నీలాదేవి, అలీ, వాసు, సారయ్య, రజిత, కుమారి, సంగీత, పిఈటి కృష్ణమూర్తిని అభినందించారు. ఎంఈవో రామ్ కిషన్ రాజు మాట్లాడుతూ.... మన పాఠశాల, మన కమలాపూర్ విద్యార్థిని స్టేట్ లెవెల్ లో సెకండ్ ప్లేస్ సాధించి పతకాలు గెలుచుకోవడం అభినందనీయమని అన్నారు. సంగీత సాధించిన పతకాల పట్ల పాఠశాలకు, మండలానికి గర్వకారణం అన్నారు. పాఠశాలలో చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు అన్నింటిలో రాణించినప్పుడే భవిష్యత్తులో ఉన్నతమైన స్థానాన్ని పొందుతారని ఆయన సూచించారు.

## పాఠశాలలకు ఏకరూప దుస్తులు



ప్రజాపక్షం/జఫర్‌గఢ్: ఈ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించి విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు మండల కేంద్రమైన జఫర్‌గఢ్ ప్రాథమిక పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు సురేష్‌కు ఎంఈవో సురేందర్ శనివారం ఏకరూప దస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్సీ సిబ్బంది మామిడాల శివ, సీఆర్‌పీ పుట్టస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత సమయానికే చేరుకోవాలి




ప్రజాపక్షం/గణపురం: గణపురం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నేడు జరుగనున్న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష కి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ నలబాల సుమన్, డిపార్ట్మెంట్ ఆఫీసర్ వాసుదేవ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పరీక్షా కేంద్రంలో 360 అభ్యర్థులు పరీక్షకి హాజరు కానున్నారు. పరీక్ష ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఉదయం తొమ్మిది గంటల నుండి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. ఉదయం 10 గంటలకే గేట్ మూసివేసి ఎవరిని కూడా అనుమతించరు. కావున అభ్యర్థులు అందరూ నిర్ణీత సమయం లో పరీక్షా కేంద్రం కి చేరుకోవాలని తెలియజేశారు.

## కావ్యను కలిసిన వికలాంగుల ఫోరం



ప్రజాపక్షం/వరంగల్‌టౌన్ : వరంగల్ పార్లమెంటు ఎన్నికల్లో ఘన విజయం సాధించిన డాక్టర్ కడియం కావ్యను నవ తెలంగాణ వికలాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి అజీమ్ ఆధ్వర్యంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కడియం కావ్య గెలుపు కోసం తమ సంఘం ఎంతో కృషి చేసిందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పదవులు పొందాలన్నారు. తమ సమస్యలపై ఎంపీ కడియం కావ్య పార్లమెంటులో పరిష్కారమయ్యేలా మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మూతబడిన పాఠశాలలను ప్రారంభిస్తాం

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: మండలంలో విద్యార్థులు లేక మూతబడిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి ప్రారంభిస్తామని జగదేవ్‌పూర్ మండల విద్యాధికారి ఉదయభాస్కర్ రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని అలిరాజిపేట, నిర్మల్‌నగర్‌లో పాఠశాల భవనాలను పరిశీలించారు. ఆసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా విద్యార్థుల సంఖ్య తగ్గడంతో కొన్ని గ్రామాలలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు మూతబడిన పాఠశాలలను పునః ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాలలో తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన సౌకర్యం,ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తున్నందున తల్లి దండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపాలని కోరారు. గ్రామాలలోబడుల బలోపేతం కోసం మహిళ సంఘాలతో పాటు, యువజన సంఘాలు తల్లిదండ్రులను చైతన్యం చేయాలని అన్నారు.

# సరిపడా విత్తనాలున్నాయ్

### కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



ప్రజాపక్షం/మహబూబాబాద్: రైతుల సంక్షే మా నికి నాణ్యమైన విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్ హాలులో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లా వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిబంధనల మేరకు జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయి ఏఈఓలు రైతులకు వానాకాలంపంటలపైనఅవగాహన కల్పించాలన్నారు.వ్యవసాయశాఖ అధికారులతో విత్తనాలు మరియు ఎరువులపై జిల్లా కలెక్టర్‌సమీక్ష సమావేశము నిర్వహించినారు. జిల్లాలోనిప్రతి విత్తన దుకాణాలను క్షుణంగా తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వానకాలానికి సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన పడవద్దు అని ఏదైనా సమస్య ఉన్నట్లయితే వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ అన్నారు. జిల్లా లో ఏర్పాటు చేసిన టాస్క్ పోర్స్ టీములు (వ్యవసాయాశాఖ అధికారి, పోలిసు అధికారి, రెవెన్యూ అధికారులు టీమ్ గా ఏర్పాటు చేసి విత్తనాల దుకాణాలను తరచుగా తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అన్నా రు. జిల్లాలో ఉన్న డీలర్లు వారి నియ మ నిబంధనలు పాటిస్తూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులను విక్రయించాలని, నిబంధనలు పాటించని విత్తన డీలర్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నకిలి విత్తనాలపై నిఘాపెట్టి, ఎవరైన నకి లి విత్తనాలు విక్రయించినట్లయితే వారిపై విత్తనచట్టం ప్రకారం కేసు లు నమోదు చేయాలని ఆదేశించారు. వానాకాలం సీజనకు సరిపడ విత్తనాలు మరియు ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేవిధంగా చూసుకోవాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. విత్తన సరఫరా ఎక్కడ ఇబ్బ ంది లేకుండా సక్రమముగా జరిగేటట్లు చూసుకొవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అభిమన్యుడు ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్, వివిధ మండలాల వ్యవసాయ శాఖ ఏఇఓలు పాల్గొన్నారు.

## మల్లన్న గెలుపు హర్షణీయం

### కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య

ప్రజాపక్షం/చిట్యాల: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెలంగాణ గొంతుకై కొట్లాడిన మల్లన్న తెలంగాణ వచ్చిన తరువాత బిఆర్‌ఎస్ ప్రభుత్వ నిరంకుశ పాలనను ఎండగట్టి రాష్ట్ర ప్రజల గొంతుకై కొట్లాడిన మల్లన్న ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిపై విజయం సాధించడం హర్షనియమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య అన్నారు. చిట్యాల మండల కేంద్రంలో శనివారం విలేకరులతో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పట్టభద్రులు వారి ఓటు వేసి మల్లన్న కు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు క్షేత్ర స్థాయి ప్రచారం చేసి, మిత్రపక్ష పార్టీల నాయకులు కార్యకర్తలు సైతం మల్లన్న గెలుపు కోసం శ్రమించారని కొనియాడారు. పట్టబద్రుల ఆశయ సాధన కోసం మల్లన్న పనిచేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రవాణా అధికారులతో పొన్నం కుమ్మక్కు

### హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



ప్రజాపక్షం/కమలాపూర్: రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణా సంస్థ అధికారులతో కుమ్మక్కై రోజుకు రూ.50 లక్షలు సంపాదిస్తున్నారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. శనివారం వే బిల్లు లేకుండా అధిక లోడ్ రూరల్ ప్రకారం 32 టన్నులతో పోవాల్సిన లారీలు 80 టన్నుల లోడ్ తో వెళ్తున్న ఫ్లైయాష్ లారీలను అడ్డుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోజుకి రెండు, మూడు వందల పై ఫ్లై యాష్ లారీలు రామగుండం ఎన్‌టిపిసి నుంచి ఖమ్మం వైపు వే బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారని అన్నారు. మంత్రి కనుసనల్లోనే ఈ అక్రమ ఫ్లై యాష్ రవాణా జరుగుతుందన్నారు. ఒక్కో లారీలో సుమారు 70 నుంచి 100 టన్నులు కూడా ఉంటుందని అన్నారు. ఈ రవాణా ద్వారా వందల కోట్ల స్కాం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఇంత పెద్ద స్కామ్ జరుగుతున్నప్పటికి ప్రభుత్వం నిమ్మకునేరెత్తినట్లు ఉందన్నారు. ఇంత పెద్ద స్కాంను లైవ్ లో పట్టుకున్నామని అన్నారు. ఒక లారీ వెళ్ళడానికి సుమారు 25 వేల ఖర్చు అవుతుందని, అందులో కేవలం 32 టన్నులు వెళ్ళడానికి మాత్రమే అనుమతులు ఉంటాయన్నారు. 32 టన్నులు మాత్రమే పొవాలి అలాంటిది 70 నుంచి 100 టన్నులతో వరకు తీసుకువెళ్తున్నారని అన్నారు. అక్రమంగా తరలిస్తున్న దాని పై వచ్చే ఆదాయం ఒక్కో లారీకి రూ. 40వేల వరకు ఉంటుందని రోజుకు రెండు వందల నుంచి 300 వరకు లారీలు వెళ్తే సుమారు రూ. 50 లక్షల వరకు అవుతుందని అన్నారు. మంత్రి అధికారాన్ని అడ్డుపెట్టుకోని రోజుకు రూ. 50 లక్షలు సంపాదిస్తున్నారని, ఇప్పటి వరకు 100 కోట్ల స్కామ్ చేశారని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంత్రి పొన్నం ప్రభాకర్ ను పదవి నుంచి బర్తరఫ్ చేయాలనిడిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# జయశంకర్'లో 17 పరీక్షాకేంద్రాలు

### జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: ఆదివారం నిర్వహించనున్న గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రంలో బయోమెట్రిక్ హాజరు ఇవ్వాలని ఆయన సూచించారు. పరీక్ష నిర్వహణకు జిల్లాలో 17 కేంద్రాలు ఏర్పాటు చేశామని 4394 మంది అభ్యర్థులు పరీక్ష వ్రాయనున్నారని తెలిపారు. ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని, 9 గంటల నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. 10 గంటలకు ప్రధాన గేట్లు మూసివేస్తారని తెలిపారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా భద్రతాపరంగా అన్ని ఇతర శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులోఉంటుందన్నారు. అభ్యర్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన సూచించారు. బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్ను మాత్రమే అనుమతిస్తారని పేర్కొన్నారు. పటిష్ఠ భద్రత పోలీస్ ఎస్కార్ట్ మధ్య ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాలు తరలించాలని అయన పేర్కొన్నారు. నిషిత తనిఖీ తదుపరి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అందరూ సహకరించాలన్నారు.

# లోక్అదాలత్‌లో 815 కేసులు పరిష్కారం

### రాజీ మార్గమే రాజమార్గం
### జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణబాబు



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: కేసుల్లో ఇరుక్కొని పోలీసు స్టేషన్, కోర్టుల చుట్టూ తిరిగితే జీవితంలో విలువైన సమయం, డబ్బు కోల్పోయి మానసికంగా ఇబ్బంది పడవలసి వస్తుందని, ఒకరితో ఒకరు రాజి కుదుర్చుకుంటే స్నేహ పూర్వకంగా ఉంటే ప్రశాంతంగా జీవించ వచ్చు అని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగింది. జిల్లా కోర్టు, సీనియర్, జూనియర్ సివిల్ కోర్టుల్లో లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిధిగా హాజరయిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, ఒకరితో ఒకరు స్నేహపూర్వకంగా మసలుకుంటే, రాజీ పడితే ఎటువంటి వివాదాలు ఉండవని అందరూ సుఖ శాంతులతో జీవించవచ్చు అని జడ్జి అన్నారు. అందరు రాజీ మార్గంలో ప్రయాణించినప్పుడు వూరు వాడ అంత ప్రశాంతంగా ఉంటుందని జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కే.జయరాం రెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.రామచంద్ర రావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూనూరి సురేష్, ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫన్స్ కౌన్సెల్ శ్రీ మెరుగు రవీందర్, అడిషనల్ పి.పి. రఫీక్, బెంచ్ మెంబర్లు కాళిదాసు విష్ణుచందర్, వేషాల రవీందర్, పారనంది సురేందర్, మచ్చ వసంత, న్యాయవాదులు, పొలిసు సిబ్బంది, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న విజయం అపూర్వం

### బిసిహక్కుల సాధనసమితి రాష్ట్రఅధ్యక్షులు టి. వెంకట్రాములు



ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : ఉమ్మడి వరంగల్, ఖమ్మం నల్గొండ ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న విజయం ప్రజాస్వామ్య శక్తుల విజయం అని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు పేర్కొన్నారు.ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న ఎన్నిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఇది లౌకిక ప్రజాస్వామ్య శక్తుల విజయానికి నిదర్శనమని, కాంగ్రెస్, వామపక్ష పార్టీలతో పాటు బీసీ,ఇతర ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు మల్లన్న విజయానికికృషి చేయడం జరిగిందని తెలిపారు. చైతన్యంతో ఓటు వేసిన పట్టబద్రులకుఅభినందనలు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు, బీసీలకు రిజర్వేషన్లు, సామాజిక న్యాయం, విద్య, వైద్యం తదితర సమస్యలపై శషనమండలిలో ప్రశ్నించే గొంతుకగా ఉండి హామీలను సాధించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు.ఓటు వేసిన వారి ప్రయోజనాలను వమ్ము చేయకుండా పని చేయాలని వెంకట్రాములు కోరారు.

# బాకీసొమ్ము కోసమే ఉద్యోగిహత్య

### 24గంటల్లో అరెస్టులు
### భూపాలపల్లి డి.ఎస్.పి సంపత్‌రావు



ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి ప్రతినిధి : అప్పు డబ్బు ఇవ్వలేదని మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమేష్‌ను తన దగ్గర బంధువైన దొంత మల్లేష్ హత్య చేసినట్లు పోలీస్ ఇన్వెస్టిగేషన్లో తేలిందని భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు తెలిపారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రామ్‌నగర్‌లో జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. డిఎస్పీ మాట్లాడుతూ పంగ రమేష్ అనే వ్యక్తి భూపాలపల్లి మున్సిపల్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో రామ్ నగర్ లో నివాసం ఉంటున్నాడు. గతంలో అనారోగ్యంగా వున్నప్పుడు తన దగ్గర బంధువైన దొంత మల్లేష్ (షడ్డకుడు) దగ్గర రెండు లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు.అందుకు కొంత తిరిగి ఇవ్వగా మిగతా డబ్బుల గురించి మల్లేష్, అతని కొడుకు పదేపదే రమేష్‌ని ఇబ్బంది పెట్టగా తన వద్ద లేవని జాప్యం చేసేవాడన్నారు. శుక్రవారంనాడు మృతుడు రమేష్ తన అత్తగారి ఊరైన సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి గ్రామానికి వెళ్లగా అక్కడ తన కోబ్రదర్ మల్లేష్, అతని కొడుకు నాగరాజు డబ్బుల విషయంలో రమేష్‌తో గొడవ పడినట్లు పేర్కొన్నారు. తర్వాత రమేష్ అక్కడి నుండి బయలుదేరి భూపాలపల్లికి చేరుకున్నాడని, డబ్బులు ఇవ్వడం లేదని దొంత మల్లేష్, అతని కొడుకు నాగరాజు కోపం పెంచుకొని ఒక పథకం ప్రకారం చంపాలని వ్యూహం రచించారు. రాత్రి బయలుదేరి భూపాలపల్లికి వచ్చి మరొక బంధువు దండు జితేందర్ అనే వ్యక్తిని కలుపుకొని ముగ్గురు కలిసి అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో రమేష్ ఇంటికి చేరుకున్నారు. తలుపులు బలవంతంగా తీసి పడుకొని ఉన్న రమేష్‌పై పిడి గుద్దులు గుద్దారు. ఒకరు నోరు మూసి వేయగా మిగతా ఇద్దరు కింద పడేసి చాతి మీద, కడుపులో తొక్కుతూ ప్రాణం ప్రాణాలు పోయేటట్లు చేశారని తెలిపారు. చనిపోయాడని నిర్ధారించుకొని ఆధారాలు ఉండకూడదనే ఉద్దేశంతో రక్తాన్ని తుడిచివేశారు. గదులన్నిటిని శుభ్రపరిచి అక్కడి నుండి నిందితులు పారిపోయారన్నారు. తెల్లవారి చుట్టుపక్కల వారు ఇచ్చిన సమాచారం మేరకు రమేష్ కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకున్నారు.రమేష్ శవాన్ని చూసి భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు చుట్టుపక్కల ఉన్న సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. సాంకేతికతను ఉపయోగించుకొని కేసును ఛేదించారు. ముగ్గురు వ్యక్తుల్ని శనివారం అదుపులో తీసుకొని తమదైన శైలిలో విచారించగా ముగ్గురు జరిగిన విషయం చెప్పారని భూపాలపల్లి డిఎస్‌పి సంపత్‌రావు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ కేసుని త్వరిత గతిన ఛేదించిన చిట్యాల సీఐ మల్లేశ్, ఎస్సై ప్రసాద్, సిబ్బంది వెంకటరెడ్డి, సతీష్, సురేష్, విజేందర్, అశోక్, చంద్రశేఖర్‌లను అభినందించారు.

## 'జనగామ'లో 14 పరీక్షాకేంద్రాలు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: గ్రూప్1 పరీక్షకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల, క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటుచేసిన గ్రూప్1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 563 గ్రూప్1 పోస్టులకు గాను ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ప్రిలిమ్స్ పరీక్ష జరుగనుండని జిల్లాలో మొత్తం 3,697 మంది అభ్యర్థులు 14 పరీక్ష కేంద్రాలలో ఈ గ్రూప్1 పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని, పరీక్షార్థులు హాల్‌టికెట్‌ను ఏ4 సైజ్ పేపర్‌లో కలర్ ప్రింట్‌ను తీసుకోవాలని సూచించారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌పై తమ తాజా పాస్‌పోర్ట్ ఫోటోను అతికించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే (10గంటలకు) గేట్లు మూసి వేస్తామని తెలిపారు. ఆభరణాలు ధరించరాదని, మెహందీ, టాటూలను వేసుకోరాదని సూచించారు. బ్లాక్, బ్లూ బాల్ పాయింట్ పెన్‌ను తీసుకురావాలని, ఏదైనా గుర్తింపు పొందిన ప్రభుత్వ ఒరిజినల్ ఐడెంటీ కార్డ్‌ను తప్పనిసరిగా తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు. అభ్యర్థులకు ఆర్టీసి బస్సులు సరిపడా అందుబాటులో ఉన్నాయని, విద్యుత్ నిరంతర సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవడం జరిగిందని, అభ్యర్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. పరీక్ష సమయానికి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ పర్యవేక్షణలో ఆయన వెంట సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఐవిఎఫ్ సేవలు మరింత విస్తరిస్తాం


### ఐవిఎఫ్ జాతీయ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్‌గుప్త



ప్రజాపక్షం/గజ్వేల్: ఇంటర్నేషనల్ వైశ్య ఫడరేషన్ ఆధ్వర్యంలో సేవలను మరింత విస్తృతం చేస్తూ దేశ విదేశాల్లో తమ శాఖల ద్వారా ఆర్థికంగా ఆదుకుంటున్నట్లు ఐవిఎఫ్ జాతీయ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో రాష్ట్ర ఉపాధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త అధ్యక్షతన జరిగిన జిల్లా వివిధ విభాగాల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డిలతో కలిసి ఆయన ప్రసంగించారు. పేద ఆర్యవైశ్యుల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రంలోని పేద ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ప్రభుత్వ పథకాలను వర్తింపజేసే విధంగా కృషి చేస్తూనే నిరంతరం ఐవిఎఫ్ తోడ్పాటు నందిస్తుందని తెలిపారు. 26 రాష్ట్రాలలో 500 మందికి పైగా ఉన్నత విద్య కోసం రూ లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందజేయగా, రాష్ట్రంలో సైతం ఇప్పటి వరకు 40కి పైగా మంది ఆర్యవైశ్య విద్యార్థులను ఆదుకున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ఐవిఎఫ్ ఆధ్వర్యంలో 12 వేల మందికి పైగా తాళిబొట్లు, పెళ్లి దుస్తులు అందజేసినట్లు తెలిపారు. అమెరికా వెళ్లే ఆర్యవైశ్య విద్యార్థులకు అక్కడి ఐవీఎఫ్ ఎన్ఆర్ఐ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని, ప్రపంచ దేశాలలోని ఉన్నతంగా జీవిస్తున్న ఆర్య వైశ్యులు గ్రామీణ ప్రాంతాలలోని పేద ఆర్యవైశ్యులకు సహకారం అందించాలని కోరారు. గత కెసిఆర్ ప్రభుత్వం సైతం పేద ఆర్యవైశ్యుల అభివృద్ధికి సహకరిస్తూ కళ్యాణ మండపాలకు స్థలాలు, నిర్మాణం కోసం నిధులు కేటాయించినట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా ఆర్య వైశ్య వ్యాపారులు చెల్లించే రూ. లక్షల కోట్ల టాక్స్‌తో ప్రభుత్వ పథకాలు కొనసాగుతుండగా, దాతృత్వం, సేవా భావం, త్యాగం ఒక వైశ్యులకే ఉంటుందని స్పష్టం చేశారు. వైశ్యులు ఐక్యంగా ఉంటూ రాజకీయంగా ఎదిగి హక్కులు సాధించుకోవాల్సి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు నేతి శ్రీనివాస్ గుప్త, జిల్లా యువజన ఎస్సీ సంతోష్ గుప్త, జిల్లా మహిళా అధ్యక్షురాలు కాసనగొట్టు స్వప్న గుప్త, గజ్వేల్ శాఖ అధ్యక్షులు కైలాస ప్రభాకర్ గుప్త, యువజన విభాగం అధ్యక్షులు కొమురవెల్లి శ్రవణ్‌గుప్త, మున్సిపల్ కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య గుప్త, అత్తెల్లి శ్రీనివాస్ గుప్త, ధార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి అంజయ్య స్వామి, కిరాణ వర్తక సంఘం అధ్యక్షులు సిద్ధి బిక్షపతి గుప్త, కాటన్ అండ్ గ్రేన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్త, వాసవి క్లబ్ అధ్యక్షులు జగ్గయ్య గారి శేఖర్ గుప్త, ఐఎంఏ గజ్వేల్ శాఖ అధ్యక్షులు డాక్టర్ లింగం గుప్త, రాష్ట్ర నేతలు కొడిప్యాక నారాయణ గుప్త, నంగునూరి సత్యనారాయణ గుప్త, తోట బిక్షపతి గుప్త, గోలి సంతోష్ గుప్త, శివకుమార్ గుప్త, సంజయ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## 10గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేత

### గ్రూప్. 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
### జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్త



ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : నేడు నిర్వహించనున్న గ్రూపు. 1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్త తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రంలో బయోమెట్రిక్ హాజరు ఇవ్వాలన్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని, 9 గంటల నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రాలోకి అనుమతిస్తారన్నారు. 10 గంటలకు ప్రధాన గేట్లు మూసివేస్తారని తెలిపారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాలోలకి అనుమతించేది లేదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రతాపరంగా అన్ని ఇతర శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్ను మాత్రమే అనుమతిస్తారని పేర్కొన్నారు. పటిష్ట భద్రత పోలీసు ఎస్కార్ట్ మధ్య ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాలు తరలించాలని తెలిపారు. నిశితంగా తనిఖీ అనంతరం అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# ఎంఎల్‌సిగా తీన్మార్ మల్లన్న



**✻ నిరంతరాయంగా కొనసాగిన ఓట్ల లెక్కింపు**

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సిగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. గత మూడు రోజులుగా రాత్రింబవళ్లు నిరంతరాయంగా ఉత్కంఠభరిత ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కోటా ఓట్లలో ఎవరికి దక్కించుకోకపోవడంతో సాంకేతికంగా అంశాల ఆధారంగా తీన్మార్ మల్లన్నను విజేతగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన ప్రకటించారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో సిట్టింగ్ స్థానం కోల్పోయిన బిఆర్‌ఎస్ ఫలితాల్లో భంగపాటుకు గురైంది. గత రెండు సార్లు జరిగిన పట్టభద్రుల ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించి ఎంఎల్‌సి పదవిలో ఉన్నప్పుడే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగాం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. దీంతో శాసన మండలి నియోజకవర్గానికి ఉప ఎన్నిక రావడం జరిగింది. ఈ ఎన్నికలో కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బిఆర్‌ఎస్ నుంచి ఏనుగు రాకేష్ రెడ్డి, బిజెపి నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితో పాటు మరో 49 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేశారు. ఈ ఎన్నికల ఫలితాలు నల్లగొండ పట్టణ సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లిలో గల రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాంలో లెక్కించారు. మూడు రోజుల పాటు లెక్కించిన ఓట్లలో మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఎవరికి కోటా రాకపోవడంతో రెండవ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియను కొనసాగించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో 3,36,013 పోలవ్వగా 25,824 ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యేటప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు దక్కగా బిఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డికి 1,04,248, బిజెపి అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,318తో పాటు స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్ 29,697 ఓట్లు లభించాయి. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎవరికి కోటా ఓట్లు 1,55,095 రాకపోవడంతో ఎలిమినేషన్ ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. ఈ ఓట్ల లెక్కింపులో ఒక్కొక్క అభ్యర్థి ఎలిమినేషన్ అవుతున్నప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకే మెజార్టీ పెరుగుతూ వచ్చింది. చివరికి రెండవ ప్రాధాన్యత ఓట్లలో బిజెపి అభ్యర్థి ఎలిమినేషన్ కాగా రాకేష్ రెడ్డికి వచ్చిన ఓట్లలో రెండవ ప్రాధాన్యత ఓట్లు లెక్కించగా మల్లన్నకు 1,50,524 ఓట్లు రాగా రాకేష్ రెడ్డికి 1,35,802 రాగా రాకేష్ రెడ్డిపై మల్లన్నకు 14,722 ఓట్ల మెజార్టీ వచ్చినట్లు సమాచారం. కాగా ఎన్నికల కౌంటింగ్ అనంతరం మల్లన్న కోటా ప్రకారం గెలిచినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన ప్రకటించి రాత్రి ఒంటి గంటకు గెలుపు నియామక పత్రాన్ని అందజేశారు.

**✻ నా గెలుపు అమరవీరులకు అంకితం : తీన్మార్ మల్లన్న**

విద్యావంతులంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని, అందుకు నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎన్నికల్లో తన విజయమే నిదర్శనమని పట్టభద్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో పాటు సిపిఐ ,సిపిఎం, ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రజా సంఘాలు సమిష్టిగా కష్టపడి తనను గెలిపించారని, తన గెలుపు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు అంకితమని పట్టభద్రుల ఎంఎల్‌సిగా గెలుపొందిన తీన్మార్ మల్లన్న ప్రకటించారు. శుక్రవారం అర్ధరాత్రి తరువాత ఓట్ల లెక్కింపులో గెలుపొందిన మల్లన్న ఎన్నికల అధికారి హరిచందన చేతుల మీదుగా నకిరేకల్ ఎంఎల్‌ఏ వేముల వీరేశం, మిర్యాలగూడ ఎంఎల్‌ఏ బిఎల్ ఆర్, భువనగిరి ఎంఎల్‌ఏ అనిల్ కుమార్‌రెడ్డి, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య, బిసిసి అధ్యక్షుడు శంకర్ నాయక్‌లతో కలిసి గెలుపొందిన సర్టిఫికెట్ అందుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తనను ఓడించేందుకు బిజెపి, బిఆర్‌ఎస్ ఎన్ని కుట్రల పన్నినా సోషల్ మీడియాలో ఎంత పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేసినా విజయాన్ని ఆపలేకపోయారని, పట్టభద్రులంతా న్యాయం వైపే ఉన్నారన్నారు. ఎన్నికల ముందు తాను ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ అండతో ప్రజల కోసం పనిచేస్తానన్నారు. తనకి టికెట్ ఇచ్చి గెలిపించిన సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులకి, ఎంఎల్‌ఎలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

ఎంఎల్‌ఎ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



**ప్రజాపక్షం/మంచిర్యాల :** పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలను మరింత మెరుగుపర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంచిర్యాల ఎంఎల్‌ఎ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని ఆయన పర్యవేక్షించి నిర్దేశిత సమయంలో ఆసుపత్రి నిర్మాణం పనులు పూర్తి చేయాలని, నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం హాజీపూర్ మండలంలోని గుడిపేటలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి పనులను పర్యవేక్షించారు. నిర్దేశిత సమయంలో భవన నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

## గ్రూప్ 1 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు

పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్



**ప్రజాపక్షం/మంచిర్యాల/పెద్దపల్లి ప్రతినిధి :** గ్రూప్ 1 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, బయోమెట్రిక్ సిస్టంతో పూర్తి పారదర్శకంగా పరీక్షలు నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. పరీక్షలకు సంబంధించి పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా 14 సెంటర్ల లో 6098 మంది అభ్యర్థులు, మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 27 సెంటర్ల లలో 9384 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 10 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోనికి అనుమతి లేదని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు పోలీసు శాఖ తరపున అన్ని రకాల భద్రత పరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు. రామగుండము పోలీస్ కమీషనరేట్ వ్యాప్తంగా 41 సెంటర్లలో మొత్తం 15,482 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్షకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పట్టణ ప్రధాన రోడ్డులు, చౌరాస్తాలలో సూచిన బోర్డులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుదని, పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాలలో సభలు, ఊరేగింపులు, ర్యాలీలు లాంటివి నిర్వహించ కూడదని, అనవసరంగా గుంపులు గుంపులుగా ఎవ్వరూ కూడా పరీక్ష కేంద్రం పరిసరాలలో తిరగటానికి అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి జిరాక్స్ షాపులు తెరిచి ఉంచరాదని షాపు యజమానులకు సూచించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్ నందున్న నియమనిబంధనలు తప్పకుండా పాటించాలని, అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఒక కలర్ ఫోటో, ఒరిజినల్ ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఉద్యోగి గుర్తింపు కార్డ్, ఓటర్ గుర్తింపు కార్డ్ ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకొని రావాల్సి ఉంటుందని అన్నారు. హాల్ టికెట్ నందు ఫోటో సరిగ్గా కనిపించకపోయినట్లైతే 3 కలర్ ఫోటోలు తీసుకొని, హాల్ టికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించుకొని రావలసి ఉంటుందని, అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ముందస్తుగా చూసుకున్నట్లైతే పరీక్ష రోజు పరీక్ష కేంద్రానికి సులువుగా చేరుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్, మాస్ కాపింగ్ చేసినట్లు తేలితే చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

## క్రీడారంగంలో మంచిర్యాలజిల్లాను ముందంజలో ఉంచాలి

కలెక్టర్ బదావత్ సంతోష్



**ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి :** క్రీడా రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో రాణించి మంచిర్యాల జిల్లాను ముందంజలో ఉంచాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గ్రీన్ సిటీలో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్ తో కలిసి ప్రారంభించి బ్యాడ్మింటన్ ఆడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడా రంగంలో తీర్చిదిద్దడం అభినందనీయమని అన్నారు. జిల్లా క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబచిరి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న క్రీడాకారులను మెమోంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, ముఖ్య సలహాదారు గాజుల ముఖేష్ గౌడ్, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి రమేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిలో ఇసుక 'తోడే'ళ్లు





**ప్రజాపక్షం/మల్లాపూర్ :** గోదావరి తీర ప్రాంత గ్రామాలైన మొగిలిపేట, ఓబులాపూర్, పాత దామరాజుపల్లి గ్రామాలలో గోదావరి నదిలో ఇసుక తోడేళ్లు పాగా వేసి రాత్రి పగలు తేడా లేకుండా అక్రమ ఇసుక రవాణా దందాకు తెర లేపారు. ఓబులాపూర్, పాత దామరాజుపల్లి గ్రామాలలో నేరుగా దారులు ఏర్పాటు చేసుకుని యధేచ్ఛగా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నా అధికారులు మాముళ్లకు లోబడి పట్టించుకోవడమే మానేశారు. పట్టపగలే ట్రాక్టర్లలో అక్రమంగా అధికారుల కళ్లముందునుండే తరలిస్తున్నా చోద్యం చూస్తున్నారు. ఏదిఏమైనా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో నేతల ఒత్తిళ్లకు తలొగ్గే అధికారులు పని చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

## గుట్కా విక్రయాలు అరికట్టడంలో అధికారుల నిర్లక్ష్యం

**ఏమాత్రం పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ అధికారులు**



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ నగరంలో గుట్కా విక్రయాలు, నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలు యధేచ్ఛగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని , ఫుడ్ అధికారులు పూర్తిగా నిద్ర మత్తులో ఉన్నారని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు గుట్కా, అంబర్, పాన్ మసాలాల వల్ల ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారని పేర్కొన్నారు. దీనిని అడ్డుకట్ట వేసేందుకు ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు యువత పెడదారి పట్టకుండా ఉండేందుకు వీటిని బ్యాన్ చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గుట్కాలను నిషేధిస్తూ గత నెలలో సర్కులర్ జారీ చేసిన కరీంనగర్ నగరంలో మాత్రం వ్యాపారులు నిషేధిత పొగాకు ఉత్పత్తులైన గుట్కాల విక్రయాలు విచ్చలవిడిగా బహిరంగంగా ఎక్కువ ధరలకు అమ్ముతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇతర దేశాల నుంచి నౌక యానాల ద్వారా సిగరెట్లు దొంగచాటున నగరానికి వస్తున్నాయని, జీఎస్టీ, సేల్ టాక్స్ కట్టకుండా సిగరెట్లు వస్తున్నాయని కొందరు వ్యాపారులు వారికి ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముతున్నారని, వీరిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని ఎక్కువ డబ్బులకు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు స్పందించి వెంటనే అక్రమ నిషేధిత పొగాకు ఉత్పత్తుల, గుట్కా నిల్వలపై దాడులు చేయాలన్నారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో దాడులు చేసి నిషేధిత పొగాకు గుట్కా ఉత్పత్తులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించండి



**జిల్లా విద్యాధికారి మాధవి**

**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు.శనివారం సుల్తానాబాద్ మండలం ఐతురాజ్ పల్లి పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి మాధవి , ఎంఈఓ సురేందర్ , ఎం ఎన్ ఓ దివాకర్ , స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం వి, కవిత , గ్రామ కార్యదర్శి, ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు, యువకులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్,సభ్యులు,ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, అంగన్వాడి సిబ్బంది సి ఆర్ పి లు పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన సదుపాయాలు,అనుభవజ్ఞులైన, అన్ని అర్హతలు గల ఉపా ధ్యాయులచే విద్యాబోధన జరుగుచున్నదని, ప్రతినెల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతిని చర్చిస్తారని, రుచికరమైన మధ్యాహ్న భోజనం,అల్పాహారం అందించడం ఉచితంగా యూనిఫామ్స్ పుస్తకాలు వర్క్ బుక్స్ నోట్ బుక్స్ అందిస్తున్నామని వీటిని అందరువినియోగించుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల ను పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు.ప్రైవేట్ పాఠశాలలకు పంపించే తల్లిదండ్రులు వారి పిల్లలను డీఈవో సమక్షంలో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు.బడి బాట ప్రతిజ్ఞను అందరితో చేయించడం జరిగింది. పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను 100% పూర్తి చేసినందుకుగాను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ స్వప్న ని ప్రధానోపాధ్యాయులు ఏ, బుచ్చిరెడ్డి ని , ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

## చేపమందు పంపిణీకి విశేష స్పందన



**ప్రజాపక్షం/దండేపల్లి :** దండేపల్లి మండలం కేంద్రంలో రంగసాయి ప్రేంరాజ్‌భూలక్ష్మీ దంపతులచే ఉబ్బస వ్యాధిగ్రస్తులకు శనివారం నిర్వహించిన ఉచిత చేప మందు పంపిణీకి విశేష స్పందన లభించింది. చేప మందు స్వీకరించేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటుగా, కరీంనగర్, నిజామాబాద్, మహారాష్ట్ర నుండి ఉబ్బస వ్యాధిగ్రస్తులకు వచ్చి చేప మందు సేవించారు. వ్యాధిగ్రస్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. చేప మందు స్వీకరించేందుకు ఒక్క రోజు ముందు వచ్చిన వారి కోసం మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్ రావు తన తండ్రి కొక్కిరాల రఘుపతి రావు ట్రస్ట్ ద్వారా భోజనం ఏర్పాటు చేశారు. చేప మందు పంపిణీ కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దండేపల్లి ఎస్ఐ లింగంపెల్లి భూమేష్ ఆధ్వర్యంలో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చేప మందు నిర్వాహకులు, గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

## 'డబుల్' ఇళ్లను స్వాధీనం చేసుకున్న ప్రజలు..



**ప్రజాపక్షం/కడెం :** మండలంలోని పెద్దూర్ గ్రామ సమీపంలో బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను తాళాలు పగలగొట్టి ఇల్లు లేని నిరుపేదలు స్వాధీనం చేసుకున్నారు.గత ప్రభుత్వం అనేక మార్లు డబల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేలు నిర్వహించింది.ఇల్లు పంపిణీ చేయక పోవడంతో వారు అసహనం వ్యక్తం చేస్తూ డబల్ బెడ్ రూమ్ ఇళ్ల తాళాలు పగలగొట్టి స్వాధీనం చేసుకున్నారు.

## రాజీమార్గమే... రాజమార్గం...

జిల్లా ప్రధానన్యాయమూర్తి రమేష్




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** రాజీమార్గమే రాజమార్గమని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి. రమేష్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్ లో పలు కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కక్షిదారుల కేసులు ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న నేపథ్యంలో లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్ కేసుల తోపాటు క్రిమినల్, సైబర్ క్రైమ్ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. కేసులను పరిష్కరించేందుకు కోర్టు ఆవరణలో నాలుగు బెంచ్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా చాలా రోజుల నుండి విడిగా ఉంటున్న జంటను రాజీమార్గం ద్వారా ఒకటి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి యువ రాజా, జూనియర్ సివిల్ న్యాయమూర్తి అనార్థ లక్ష్మి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల పోలీస్ జాగిలానికి ఘన నివాళి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :**జిల్లా హెడ్ క్వార్టర్ లో పోలీస్ జాగిలం లాబ్రడార్ రిట్రీవర్ సంతతికి చెందిన రాజా, వయస్సు 15 సంవత్సరాలు అనారోగ్యంతో ఉదయం మరణించినది. పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో పోలీస్ అధికారులు, పోలీస్ జాగిలం హ్యాండ్లర్ మల్లేశం తో కలసి రాజా పై పుష్పగుచ్ఛాలు వేసి ఘనంగా నివాళులర్పించి రాజా సేవలు మరువలేనివని సంతాపాన్ని వ్యక్తం చేసిన జిల్లా ఎస్ పి మాట్లాడారు. రాజా గత 14 సంవత్సరాల నుండి జిల్లాలో విఐపి, వివిఐపిలు సందర్శించినప్పుడు ఆర్ఓపి స్నిపర్, బాంబులు, మందు పాత్రలు, గుర్తించడంలో చాకచక్యంగా వ్యవహరించి విధులు నిర్వహించేదని కొనియాడారు. 2010 సంవత్సరంలో రాజా తన హ్యాండ్లర్ మల్లేశం తో పాటుగా ఎనిమిది నెలల పాటు ఐఐటిపి, మొయినాబాద్ నందు బేసిక్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని జిల్లాకు కేటాయించగా జిల్లాలో గత 14 సంవత్సరాలుగా సేవలందించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లు యాదగిరి, మాధుకర్, రమేష్, రాజా హ్యాండ్లర్ మల్లేశం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేను ప్రజలతోనే ఉంటా



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రాజకీయాలలో గెలుపోటములు సహజమని,ఓటమి చెందిన నైతికంగా విజయం మనదేనా అని ప్రజల కోసం సేవ చేసేందుకు ఎప్పుడు,ప్రజల మధ్యనే ఉండి. ప్రజాసేవ చేస్తూనే ముందుకెళ్తానని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ పేర్కొన్నారు. శనివారం నిర్మల్ డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఇచ్చిన ఆదేశాల మేరకు అదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా నాకు గెలిపించేందుకు కష్టపడ్డా కాంగ్రెస్ లోని ఆయా విభాగాల పదాధికారులు, నాయకులతో పాటు అభిమానులకు ఈ సందర్భంగా కృతజ్ఞత ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో తిరుగుతూ ప్రజా సమస్యలపై నిత్య పోరాటాలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున్న ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రణాళిక బద్ధమైన రీతిలో ముందుకెళ్తానని పేర్కొన్నారు. ప్రజా సేవ చేయాలన్న సంకల్పంతోనే ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలేసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన తనకు నమ్మకంతో నాలుగున్నర లక్షలకు పైగా ఓట్లు వేసిన ఓటర్లందరికి జీవితాంతం రుణపడి ఉంటాను అని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న వినూత్నమైన సంక్షేమ పథకాల ఫలాలు జిల్లాలోని అన్ని వర్గాలకు చేరేలా క్షేత్రస్థాయి నుంచి ప్రణాళిక రూపొందించుకొని కృషి చేస్తానని భరోసా కల్పించారు. నిర్మల్ డిసిసి అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చిన ఆదేశాల మేరకు ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సుగుణ గెలుపు కోసం ప్రణాళిక బద్ధమైన రీతిలో అహర్నిశలు కృషి చేయడం జరిగిందని ఆయన ప్రజల ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ముందుకు వెళ్లామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఆత్రం సుగుణ, జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క గెలుపే లక్ష్యంగా ప్రతి ఓటరు తలుపులు కట్టడం జరిగిందని గుర్తు చేశారు. ఆత్రం సుగుణ అనుక్షణం ప్రజాసేవ చేయాలన్న సంకల్పంతోనే ముందుకు వెళుతుందని, గెలిచిన ఓడిన ప్రజల మధ్యనే ఉండి ప్రజల కోసం కష్టపడుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు, సూచనల మేరకు జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతుగా ప్రణాళిక బద్ధమైన రీతిలో కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా జడ్పిటిసిల ఫోరం అధ్యక్షులు పత్తిరెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, టిపిసిసి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎంబడి రాకేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాజిద్ అహ్మద్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీల విభాగం జిల్లా అధ్యక్షులు జునేద్ మెమన్, పట్టణ అధ్యక్షులు, తదితరులు ఉన్నారు.

## గ్రూప్1 అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలి

కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి :** గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షలకు అభ్యర్థులు ఉదయం 10గంటల లోపు పరీక్ష కేంద్రంలో ఉండాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 9 గంల నుండి 10 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని, 10 గంటల తరువాత పరీక్షా కేంద్రంలోనికి అనుమతి ఉండదని, అభ్యర్థులు హాల్ టిక్కెట్లను టిజిపిఎస్సి వెబ్ సైట్ నుండి డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులకు అందించే వ్యక్తిగత ఓఎంఆర్ షీట్లపై సంబంధిత అభ్యర్థుల వివరాలు ముద్రించి వస్తాయని, అట్టి వివరాలతో పాటు, పరీక్ష నియమ, నిబంధనలను సరి చూసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు పాటించవలసిన నియమాలను హాల్ టిక్కెట్లపై కూడా ముద్రించడం జరిగిందని, అభ్యర్థులు ఈ నియమాలను తెలుసుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలో 9.30 గంలకు బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రారంభించడం జరుగుతుందని, బయోమెట్రిక్ అటెండెన్స్ ఇవ్వకుండా ఏ అభ్యర్థి కూడా పరీక్ష కేంద్రం నుండి బయటకు వెళ్ళరాదని, ఒకవేళ వెళ్ళినట్లయితే అట్టి అభ్యర్థి ఓఎంఆర్ షీట్ పరిగణలోకి తీసుకోబడదని, బయోమెట్రిక్ తీసుకునేందుకు అభ్యర్థుల చేతివేళ్ళపై ఎలాంటి మెహందీ, తాత్కాలిక టాటూస్, ఇతరత్రా ఉండరాదని తెలిపారు. బూట్లు, మొబైల్ ఫోన్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలును పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరగదని, అభ్యర్థికి సంబంధించిన వస్తువులను భద్రపరచేందుకు ఎలాంటి సౌకర్యం కల్పించడం జరుగదని తెలిపారు. ప్రతి అరగంటకు ఒకసారి సమయాన్ని తెలియజేసేలా గంట మ్రోగించడం జరుగుతుందని, అభ్యర్థులు ఇన్విజిలేటర్ల ద్వారా సమయాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ వెంట బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్నుతో పాటు ప్రభుత్వంచే జారీ చేయబడిన ఏదైనా ఒక ఫోటో గుర్తింపు కార్డు (పాస్ పోర్ట్, పాన్ కార్డు, ఓటరు కార్డు, ఆధార్ కార్డు, ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఇతరత్రా) తీసుకురావాలని, క్రొత్తగా దిగిన పాస్ ఫోటో సైజ్ ఫొటో హాల్ టికెట్ పై అతికించాలని తెలిపారు. హాల్ టికెట్‌పై ఫోటో సరిగా లేనట్లయితే టిజిపిఎస్సి వెబ్ సైట్‌లో ఉంచిన అండర్ నమూనా తీసుకొని 3 పాస్ ఫోటో సైజ్ ఫొటోలపై గెజిటెడ్ అధికారుల సంతకం, ఆఖరుగా చదివిన విద్యా సంస్థ ప్రిన్సిపల్ సంతకం తీసుకొని రావాలని తెలిపారు. గ్రూప్1 పరీక్ష నిర్వహణ కొరకు జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 9 వేల 384 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని, జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ప్రత్యేక బస్సులు, నిరంతర విద్యుత్ సరఫరా, వేసవి ఉష్ణోగ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు, ప్రథమ చికిత్స కిట్లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీరు ఇతరత్రా అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి, సహాయం కొరకు ప్రత్యేక హెల్ప్ లైన్ నం.08736250500 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

# బిఆర్ స్ఫూర్తితో ప్రజాసమస్యలపై పోరాటాలు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

పేదల కోసం పోరాడిన యోధుడు భగవాన్‌దాస్

ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాగరాజు





**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** పేదల ప్రజల బాగు కోసం జీవితాంతం పోరాట చేసిన యోధుడు భగవాన్‌దాస్ అని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు అన్నారు. శనివారం సీనియర్ కమ్యూనిస్టు నాయకులు బీఆర్ భగవాన్‌దాస్ 94వ జయంతిని ఘనంగా నిర్వహించారు. హనుమకొండ అశోక జంక్షన్ లోని భగవాన్ దాస్ విగ్రహానికి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కెఆర్ నాగరాజు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాగరాజు మాట్లాడుతూ వరంగల్ నగరంలో కార్మికుల హక్కుల కోసం బిఆర్ భగవాన్‌దాస్ పోరాటాలు మరువలేనివన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు కోచ్ ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమల సాధనకు, నగరానికి తాగునీటి కోసం పోరాడారన్నారు. వరంగల్ నగర ప్రజలకు తాగు నీటి కోసం భగవాన్‌దాస్ ఆనాటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా అఖిల పక్షాలను కలుపుకుని వరంగల్ బంద్‌కు పిలుపునిచ్చారని, దాంతో తాగునీటి సమస్య పరిష్కారం అయిందని గుర్తు చేశారు. భగవాన్‌దాస్ తమకు గురువులంటి వారని, ఆయన సూచించిన మార్గంలోనే తాము ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు సాగుతామన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ బిఆర్ భగవాన్ దాస్ రాజకీయ వారసులుగా తాము ఆయన చూపిన బాటలోనే ముందుకు సాగుతామన్నారు. బిఆర్ స్ఫూర్తితో ప్రజాసమస్యలపై పోరాడుతామన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, డాక్టర్ అంబేద్కర్, డాక్టర్ రాజసిద్దార్థ, బిఆర్ లెనిన్, మాజీ కార్పొరేటర్‌లు టి.విద్యాసాగర్, వీరగంటి రవీందర్, జోరిక రమేష్, టియుడబ్ల్యుజె జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బి.సదయ్య, బుస్సా రవీందర్, ఎన్.రాజమౌళి, కొట్టెపాక రవి, జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణి, కండె నర్సయ్య, ఏశబోయిన శ్రీనివాస్, గోకారపు శ్యామ్, జితేందర్, సంజయ్, రవిందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

## శ్రమదోపిడీకి గురువుతున్న సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు : ఎఐటియుసి




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని, సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల రేట్లు క్వింటాకు ఎగుమతి, దిగుమతికి రూ.40 లు పెంచాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శనివారం సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కమిటీ సమావేశం ఆసిఫాబాద్ మార్కెట్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికుల రేట్లు రెండు సంవత్సరాలకు ఒకసారి పెంచేందుకు గత ప్రభుత్వాలు జీవో విడుదల చేశాయని, దాని ప్రకారం జనవరి 2024 సంవత్సరం నుండి హమాలీ కార్మికుల రేట్లు పెంచాలని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలలు గడిచిన పట్టించుకోవడంలేదన్నారు. హమాలీ కార్మికులు చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ప్రభుత్వం కార్పొరేషన్ ద్వారా పేద బడుగు బలహీన వర్గాలకు త్యవసర వస్తువులను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి అనేక సార్లు తీసుకెళ్లిన రేపు మాపు అంటూ కాలయాపన చేస్తుంది తప్ప సమస్యలను పరిష్కరించడం లేదని ఆరోపించారు. హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రతి కార్మికునికి ఇఎస్ఐ, పిఎఫ్ బోనస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు బెనిఫిట్స్ పెన్షన్ సౌకర్యం 50 సంవత్సరాలు నిండిన హమాలీ కార్మికులకు నెలకు పదివేల రూపాయల పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. మహిళా స్వీపర్లకు నెలకు రూ.10వేలు వేతనాలు ఇవ్వాలని, హమాలీ కార్మికులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, దత్తు, దింకర్, శంకర్, సుధాకర్, రాజన్న, సందీప్ పాల్గొన్నారు.

## ఇక్కత్ పరిశ్రమ సమస్యలు పరిష్కారిస్తా

జిఐ పేటెంట్ రైట్స్ అధికారి సుభజిత్ షా



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలకు ప్రపంచ ప్రఖ్యాతి పేరుగాంచిందని సిఐఐ ప్రతినిధి జియో ట్యాగ్ ఐడెంటిటీ పేటెంట్ రైట్స్ అధికారి సుభజిత్ షా అన్నారు. ఎన్ఫోర్స్మెంటు సంబంధించిన కేసులను విచారిస్తున్న అడ్వకేట్ జానకితో ఆయన కలిసి శనివారం భూదాన్ పోచంపల్లిని సందర్శించి చేనేత వస్త్ర పరిశ్రమనూ మగ్గాల పనితీరును క్షేత్రపరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచంపల్లి చేనేత పరిశ్రమ ఇక్కత్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవడం కొరకు అధికారులను సంప్రదించి మార్గాలు వెతుకుదామని తెలియజేశారు. గుజరాత్, రాజస్థాన్, తమిళనాడు లాంటి రాష్ట్రాలలో సరఫరా అవుతున్న పోచంపల్లి డూప్లికేట్ ప్రింటింగ్ వస్త్రాలను అరికట్టుటకు ఎన్ఫోర్స్మెంట్ అధికారులని సంప్రదించి. ఏ విధమైన చర్య తీసుకోవాలో చర్చించారు. చేనేత సహకార టైఅండ్‌డై సంఘం అధ్యక్షులు భారత లవకుమార్, సెక్రెటరీ ముస్కూరి నరసింహ ఉపాధ్యక్షులు కుడికాల రామ నర్సు, ఈపూరి ముత్యాలు సహాయ కార్యదర్శులు సీత సుధాకర్ గంజి బాలరాజు, వనం నరసింహ ఆయన వెంట ఉన్నారు.

## త్వరలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్

ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి




**ప్రజాపక్షం /జగిత్యాల జిల్లా ప్రతినిధి :** రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా త్వరలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్‌కు మోక్షం లభిస్తుందని దాని ద్వారా మండల విద్యాధికారి పోస్టులు భర్తీ అవుతాయని శాసన మండలి సభ్యులు కూర రఘోత్తంరెడ్డి అన్నారు. పిఆర్‌టియూ టిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాల్ల అమర్‌నాథ్ రెడ్డి, బోయినిపల్లి ఆనంద్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభ అవార్డుల కార్యక్రమానికి రఘోత్తంరెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలోనే అన్ని పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమిస్తుందన్నారు. పిఆర్‌టియూ టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగళి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలకు ఉచిత కరెంట్ అందజేస్తూ ప్రభుత్వం త్వరలోనే ఉత్తర్వులు జారీ చేస్తుందని, పెండింగ్ బిల్లులు జూలై చివరి వారం వరకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, జాలి మహేందర్‌రెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ముస్కు తిరుపతిరెడ్డి, సురేష్, కృష్ణమూర్తి, మండల విద్యాధికారులు గాయత్రి, జమున, గంగాధర్, భీమయ్య, నరేశం, ఆనందరావు, మురళీ మనోహర్‌చారి, దుబ్బయ్య, చంద్రప్రకాష్, మల్లారెడ్డి, వాజిద్, జమున, చందన, విద్యాదేవి, పద్మ, శ్రీదేవి, వసంత, రాధాలక్ష్మి పాల్గొన్నారు.

# బుద్ధవనం అభివృద్ధికి కృషి : మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/నందికొండ :** అంతర్జాతీయ స్థాయిలో నాగార్జునసాగర్‌లో నిర్మించిన బుద్ధవనాన్ని మరిన్ని కొత్త ప్రతిపాదనలతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక , సంస్కృతి, ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి అన్నారు. బుద్ధవనం పరిశీలనలో భాగంగా శనివారం స్థానిక ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తో కలిసి బుద్ధ వనానికి చేరుకున్నారు. వారికి బుద్ధవనం ఓఎస్‌డి సూధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆ తరువాత మొదటగా బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం బుద్ధవనం బుద్ధిస్ట్ ఎక్స్పర్ట్ కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి బుద్ధవనం బౌద్ధ వారసత్వ థీమ్ పార్కులోని బుద్ధ చరిత్రవనం, జాతకవనం, స్థూప వనం, శ్రీలంక బుద్ధని శిల్పం, మహాస్తూపంలోని ఆచార్య నాగార్జున శిల్పం, బుద్ధుని ధాతుపెటికలను, మహాస్థూపం చుట్టూ అలంకరించిన బౌద్ధ శిల్పాల గురించి వారికి వివరించారు. తరువాత బుద్ధవనంలో ఇప్పటివరకు చేసిన నిర్మాణాల గురించి, కొత్తగా చేపట్టవలసిన నిర్మాణాల ప్రతిపాదనకు సంబంధించిన వివరాలను, బుద్ధ వనం సిద్ధార్థ రెస్టారెంట్ పునః ప్రారంభ ప్రక్రియ గురించి బుద్ధవనం ఓఎస్‌డి సూదన్‌రెడ్డి మంత్రికి వివరించారు. బుద్ధ వనంలో కొత్తగా నిర్మించ తలపెట్టిన వ్యూ పాయింట్‌ను, సైకిల్ ట్రాక్‌ను సందర్శించి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. మొదటిసారిగా బుద్ధవనం పరిశీలకు వచ్చానని, బుద్ధవనాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్మాణాలు చేపట్టినందుకు అభినందించారు. మరిన్ని కొత్త ప్రతిపాదనలతో బుద్ధవనాన్ని త్వరలోనే అభివృద్ధి చేస్తామన్నారు. బుద్ధ వనంలో పనిచేస్తున్న మహిళా సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ జీఎం ఉపేందర్‌రెడ్డి, హోటల్స్ జిఎం నాదన్, నల్లగొండ జిల్లా పర్యటకశాఖ అధికారి శివాజీ, విజయవిహార్ మేనేజర్ కిరణ్, లాంచి యూనిట్ మేనేజర్ హరి, మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్‌రాజు, సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్‌గౌడ్‌తో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి సిడిపిఒ అవినీతిపై విచారణ

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య డిమాండ్



**ప్రజాపక్షం/జగిత్యాల జిల్లా ప్రతినిధి :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ అవినీతి అక్రమలపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపి వెంటనే భర్తరఫ్ చేయాలని ఎఐటియూసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాలలో శనివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. గతంలో ఆరోగ్యలక్ష్మి , బాలామృతం, ట్రాన్స్‌పోర్ట్ బిల్లులలో అవినీతి జరిగిందని సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు అడిగితే సమచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అవినీతిపై విచారణ జరపాలని ప్రిన్సిపాల్ కార్యదర్శి, కలెక్టర్‌తో పాటు సంబంధితశాఖ అధికారులకు పిర్యాదు చేసిన స్పందించకపోవడం శోచనీయమన్నారు. మళ్లీ ఇదే ప్రాజెక్టులో ప్రీ స్కూల్ కిట్ల పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని మెట్‌పల్లి ప్రాజెక్టుతోపాటు జగిత్యాల, ధర్మపురి, మల్యాల ప్రాజెక్టులో కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్‌లో యథేచ్ఛగా అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందుతున్న సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి సిడిపిఒ అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సమ్మయ్య డిమాండ్ చేశారు.

## నేడు 'గ్రూప్ 1 ప్రిలిమ్స్' పరీక్ష

**(మొదటి పేజీ తరువాయి)**

కూడా బందోబస్తును ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 897పరీక్ష కేంద్రాలు ఉండగా ఇందులో అత్యల్పంగా యాదాద్రి భువనగిరి లో 9పరీక్ష కేంద్రాలు, అత్యధికంగా మేడ్చల్ మల్కాజిగిరిలో 105పరీక్ష కేంద్రాలు ఉ న్నాయి. అభ్యర్థులు తమ వెంట హాల్‌టికెట్లతో పాటు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుంది. హాల్‌టికెట్‌పైన ఫోటో సరిగ్గా లేకపోతే మరో ఫోటో తెచ్చుకోవాలని అధికారులు సూచించారు. బయోమెట్రిక్ వేలిముద్ర వివరా ల రికార్డింగ్ ఉన్న క్రమంలో అభ్యర్థులు తమ వేళ్లపై మెహందీ లేదా ఏదైనా ఇతర ప్రింటెడ్ రంగులు పెట్టుకోవద్దని, కాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లు, టాబ్లెట్‌లు,పెన్‌డ్రైవ్‌లు, బ్లూటూత్, గడియారాలు లాంటి పలు ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాలకు అనుమతించబోరు. లాగ్‌బుక్‌లు, లాగ్‌వాలెట్‌లు, హ్యాండ్‌బ్యాగ్‌లు, పౌచ్‌లు, రైటింగ్ ప్యాడ్‌లు, నోట్స్, చార్జ్‌లు, ఆభరణాలను కూడా అనుమతించబోరు. కాగా టిఎస్‌పిఎస్‌సి గ్రూప్ 1 సర్వీస్‌లో 563 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, మున్సిపల్ కమిషనర్ , అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ రాజ్ ఆఫీసర్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ తదితర పోస్టులు ఉన్నాయి.

# రామోజీ భౌతికకాయానికి సిపిఐ నేతల నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలుగు పత్రికా దిగ్గజం, ఈనాడు గ్రూప్స్ అధినేత, పద్మవిభూషణ్ చెరుకూరి రామోజీరావుకు సిపిఐ జాతీయ, రాష్ట్రనేతలు నివాళులర్పించారు. శనివారం సాయంత్రం రామోజీ ఫిలిం సిటీకి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు వెళ్ళి రామోజీరావు భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. సిపిఐ నల్లగొండ జిల్లాకార్యదర్శి నెల్లికంటి సత్యం, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ కూడా రామోజీరావుకు నివాళులర్పించారు. అనంతరం సిపిఐ నాయకులు బాధాతప్త హృదయంతో ఉన్న రామోజీరావు కుమారుడు కిరణ్‌తో కమ్యూనిస్టు పాటు ఇతర కుటుంబసభ్యులకు ఓదార్చారు. సమాజానికి మార్గదర్శిగా, ఎంతోమందికి ఆదర్శంగా రామోజీరావు నిలిచారని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కుటుం బసభ్యులు ముందుకు సాగాలని వారు అన్నారు.



1994 ఏప్రిల్ 10న చంద్ర రాజేశ్వరరావు అంతిమదర్శనానికి మఖ్దూంభవన్‌కు విచ్చేసిన రామోజీరావు, చిత్రంలో సీతారాం ఏచూరి, బండారు దత్తాత్రేయ తదితరులు

### రామోజీ రావు ప్రతి బింబం ఉట్టిపడేలా స్మారకం నిర్మించాలి : నారాయణ

తెలుగు సంస్కృతికి ప్రతిబింబం రామోజీరావు అని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ కొనియాడారు. ఆయన ప్రతిబింబం ఉట్టిపడే విధంగా నూతన ప్రభుత్వం జాతికి ఉపయోగపడే స్మారకాన్ని నిర్మించాలని కోరారు. ఈనాడు గ్రూప్ సంస్థలు అదినేత రామోజీరావు మరణపట్ల నారాయణ తీవ్రవిచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రామోజీరావు పేరు చెప్పగానే అంతర్జాతీయ స్థాయిలో ఫిలింసిటీ, గ్రామీణస్థాయిలో ఈనాడు పేపర్ గుర్తుకువస్తుందన్నారు. ఆయన ప్రగతిశీల వ్యక్తి అని, తొలిదశలో వామపక్ష ఉద్యమాలలో, ముఖ్యంగా ఎఐవైఎఫ్‌లో ఉన్నారని గుర్తు చేశారు. తరువాత కూడా సిపిఐ, వామపక్షాలతో సంబంధాలు కొనసాగించారని తెలిపారు.

### సిఆర్ ఫౌండేషన్ పట్ల మక్కువ

కమ్యూనిస్టు దిగ్గజం చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం నిర్మాణం సందర్భం గా రామోజీరావు సలహాలు ఇవ్వడ మే కాకుండా, ఆ రోజుల్లో



రూ.5లక్షలు విరాళంగా కూడా ఇచ్చారని నారాయణ తెలిపారు. ఆయనకు చంద్ర రాజేశ్వరరావు అన్నా, ఓల్డేజ్ హోమ్ అన్నా చాలా మక్కువ అని తెలిపారు.

### రామోజీరావు మృతికి సుధాకర్‌రెడ్డి సంతాపం

తెలుగు పత్రికా దిగ్గజం చెరుకూరి రామోజీరావు మృతికి సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామోజీరావు విలువలతో కూడిన స్వతంత్ర మీడియాగా తన వ్యవస్థాపక ప్రయాణాన్ని ప్రారంభించారని, ఈనాడు, ఈటీవీతో తెలుగు జర్నలిజంలో కొత్త ఒరవడిని నెలకొల్పారని సుధాకర్‌రెడ్డి ఒక సంతాప సందేశంలో కొనియాడారు. మీడియా సంస్థలు వివిధ దశలలో పలుచబడినప్పటికీ, తెలుగు సమాజానికి ఆయన అందించిన సానుకూల సహకారం అపారమైనదని, రామోజీ ఫిల్మ్ సిటీ ఆసియాలోనే అతి పెద్దదని, అనేక రంగాలలో అందించిన సహకారం విలువైనదని, ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. రాజకీయ విభేదాలున్నప్పటికీ రామోజీరావుతో తనకు ఐదు దశాబ్దాలుగా సన్నిహిత పరిచయం ఉందని, అంతకుముందు వామపక్ష శక్తులతో సన్నిహితంగా ఉండేవారని తెలిపారు.

# రామోజీరావు అస్తమయం

**(మొదటి పేజీ తరువాయి)**

కోసం రామోజీరావు గుడివాడకు వెళ్లారు. ఆయనకు చదువుల కంటే, కళలు, రాజకీయాలపై ఆసక్తి మిన్న. మాటల్లో నిశిత దృష్టి, సునిశిత పరిశీలన కనపడేది. చిన్నప్పటి నుంచే విలక్షణ, సృజనాత్మకత వ్యక్తి కలిగిన రామోజీరావు 'ఈనాడు తెలుగు దినపత్రిక'ను ప్రారంభించి తెలుగునాట సంచలనం సృష్టించారు. 1974 ఆగస్టు 10న విశాఖ సాగర తీరంలో 'ఈనాడు'ను ప్రారంభించారు. అలాగే ఈనాడుతో పాటు కీలక మైలురాయిగా 'సితార' సినీ పత్రికను కూడా ప్రారంభించారు. 1962లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థను స్థాపించా రు. 60 సంవత్సరాల్లో లక్షలాదిమంది ఖాతాదారులకు సేవలు అందించారు. రైతుబిడ్డగా మొదలై వ్యాపారవేత్తగా రామోజీరావు రాణించారు. మీడియా మహాసామ్రాజ్యాన్ని నిర్మించిన ఆయన చైతన్యదీప్తుల్లాంటి చిత్రరాజాలను సృజించారు. అద్భుత ఫిలింసిటీని నిర్మించారు. పనిలోనే విశ్రాంతి అనేది రామోజీరావు ప్రాథమిక సూత్రమని, చివరి క్షణం వరకు పనిలోనే విశ్రాంతి సిద్ధాంతాన్ని పాటించిన మహనీయుడని పలువురు పేర్కొన్నారు.

### రామోజీరావుకు రాష్ట్రపతి, ప్రధాని, ప్రముఖుల సంతాపం

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, మీడియా దిగ్గజం రామోజీరావు మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అపధర్మ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా, కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ పివి రాధాకృష్ణన్, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనార్జీ , కేరళ ముఖ్యమంత్రిపినరయి విజయన్, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి. రమణ తదితరులు రామోజీ రావు మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మీడియా రంగానికి రామోజీరావు చేసిన కృషి చిరకాలం గుర్తుండిపోతుందని తన ఎక్స్ వేదికగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ప్రధాని మోదీ రామోజీ రావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయనను భారతీయ మీడియాను విప్లవాత్మకంగా మార్చిన 'దార్శనికుడు'గా ప్రధాని అభివర్ణించారు.

### పార్థివ దేహానికి ప్రముఖుల నివాళ్లు

రామోజీరావు మృతిపట్ల పలువురు రాజకీయ, సినీ, పారిశ్రామికరంగాలకు చెందిన ప్రముఖులతో పాటు జర్నలిస్టులు కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన పార్థివదేహానికి నివాళులర్పిస్తున్నారు. ఈ సందర్భంగా వారు ఆయన తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పలువురు సినీపెద్దలు కంటతడిపెట్టారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించిన ఘనత రామోజీరావుకే సొంతమని కొనియాడారు. తెలుగుపత్రికా, మీడియా రంగానికి రామోజీరావులేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిదని, ఆయన పవిత్రఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

### నేడు సినిమా షూటింగ్‌లు బంద్

రామోజీరావు మృతి నేపథ్యంలో ఆదివారం అన్ని సినిమాల షూటింగ్‌లను బంద్ చేయాలని తెలుగు చిత్ర పరిశ్రమ కీలక నిర్ణయం తీసుకుంది. రామోజీరావుకు సంతాపసూచికంగా ఆదివారం సినిమా షూటింగ్‌లకు సెలవు ప్రకటిస్తూ ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర్‌ప్రసాద్ సెలవు ప్రకటించారు.











## నైరుతి విస్తరణ

**(మొదటి పేజీ తరువాయి)**

వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. దక్షిణ ఈశాన్య, మధ్య తెలంగాణ జిల్లాలకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. శనివారం రాష్ట్రంలో భారీ వర్షం కురుస్తుందన్నారు. ఆదివారం వికారాబాద్, మహబూబ్ నగర్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, సూర్యపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయన్నారు. సోమవారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నారాయణపేట జిల్లాలలో ఉరుములు, మెరుపులతో కూడిన 3040 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుందన్నారు.

### హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం..

హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఒక్కసారిగా వాతావరణ మారిపోయింది. మేఘాలు కమ్ముకొని, పలు చోట్ల వర్షం పడింది. సికింద్రాబాద్, ముషీరాబాద్, ఆర్‌టిసి క్రాస్ రోడ్, నారాయణగూడ, హిమాయత్ నగర్, కోఠి, సచివాలయం, ఖైరతాబాద్, పంజాగుట్ట ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com

## నీట్ పేపర్ లీకేజిపై విచారణ జరపాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా దాదాపు 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షను రాశారన్నారు. ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. వారి అనుమానాలకు సజీవ సాక్ష్యంగా ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకుగాను 720 మార్కులు రావడం, అలాగే వారి పరీక్ష కేంద్రం ఒకటే కావడం అనుమానాలకు తావిస్తుందన్నారు. కావున తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి, పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాపక్షం
# మహానగరి
హైదరాబాద్ – రంగారెడ్డి
హైదరాబాద్ | ఆదివారం | 09 జూన్, 2024 | 9

## విజయవంతంగా ముగిసిన ప్రపంచ వరి శిఖరాగ్ర సదస్సు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రపంచ వరి శిఖరాగ్ర సదస్సు విజయవంతంగా ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈసదస్సులో అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాలు వాతావరణ మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం సాగులో సవాళ్లపై సుదీర్ఘ ంగా చర్చించారు. సదస్సులో భాగంగా రెండవ రోజు శనివారం అంతర్జాతీయ బియ్యం ఎగుమతులలో తెలంగాణ నుంచి మరింత పెద్దఎత్తున బియ్యం ఎగుతులకు తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ప్రత్యేక గోష్టి నిర్వహించారు. దేశీయ మార్కెట్‌లో వాణిజ్య అవకాశాలు, ఇండియన్ రైస్ మార్కెట్‌లపై ప్రత్యేక సదస్సును నిర్వహించారు. సదస్సుల్లో పౌరసరఫరాల శాఖ ప్రధానకార్యదర్శి డిఎస్ చౌహన్, వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి.గోపి, ఉద్యానవన శాఖ సంచాలకులు అశోక్‌రెడ్డి, వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి సత్యశారద, ఐసిఐ ప్రెసిడెంట్ జెరెమీ జ్వింగర్, రైస్ మిల్లుల సంఘాల ప్రతినిధులు, దేశ విదేశీ శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజలపై చెరగని ముద్ర రామోజీరావు

### మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: మీడియా, సినిమా, వ్యాపార, విద్య రంగాలలో తనదైన చెరగని ముద్ర వేసిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం రామోజీ ఫిల్మ్ సిటీలో ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీ రావు పార్థివదేహం వద్ద బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌తో కలిసి మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామోజీరావు మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు అన్నారు. తాను ఏర్పాటు చేసిన వివిధ సంస్థల ద్వారా లక్షలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని చెప్పారు. పాత్రికేయ సమాజానికి ఒక దిక్సూచిగా ఈనాడు పత్రిక ద్వారా ఉన్నత ప్రమాణాలు పాటించారన్నారు. ప్రపంచంలోని తెలుగు ప్రజలంతా గర్వపడే విధంగా ఎంతో అద్భుతమైన ఫిల్మ్ సిటీని నిర్మించిన ఘనత కూడా రామోజీరావుకే దక్కుతుందన్నారు. ప్రజాహితం, సమాజహితం కోసం కృషి చేసిన రామోజీరావు మృతి ఒక్క తెలుగు ప్రజలకు తీరని లోటన్నారు. రామోజీరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణరెడ్డి తదితరులు ఉన్నారు.

## ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనుడు

### జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి



ప్రజాపక్షం/హయత్ నగర్ : తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు 25 కిలోమీటర్ల దూరంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఫిల్మ్ స్టూడియో కాంప్లెక్స్ రామోజీ ఫిల్మ్ సిటీని నిర్మించి ఒక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది అనేక మందికి ఉపాధి కలిపించిన మహోన్నత వ్యక్తి రామోజీరావు అని జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి అన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించి అనేక కుంటుంబాలలో వెలుగులు నింపిన చెరుకూరి రామోజీరావు మృతికి సంతాపం వ్యక్తం చేస్తు వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి ప్రార్థన దేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## సిఆర్ ఫౌండేషన్ ప్రగాఢ సంతాపం

ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : ఈనాడు గ్రూపు సంస్థల వ్యవస్థాపకులు సి. రామోజీరావు మృతి పట్ల చంద్ర రాజేశ్వర్‌రావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్(సిఆర్ ఫౌండేషన్) తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. రామోజీ రావు సిఆర్ ఫౌండేషన్ ఆవిర్భావంలో, ఫౌండేషన్ కార్యకలాపాలకు, అభివృద్ధికి విస్తృత తోడ్పాటును అందించారని గుర్తు చేసుకున్నారు. రామోజీ రావు కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

## అభివృద్ధిపనులు త్వరగా పూర్తి

### హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాత నాయక్



ప్రజాపక్షం/వనస్థలిపురం : అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై. కాంట్రాక్టర్‌లపై ఉందని హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ తెలిపారు. శనివారం డివిజన్‌లోని అగ్రికల్చర్ కాలనీ నుంచి జయకృష్ణ ఎంక్లేవ్ వరకు నిర్మిస్తున్న వర్షపు నీరు పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుజాతనాయక్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీ వాసులకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తిచేయాలని కోరారు. వర్షా కాలం సమీపిస్తుడంతో పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు చంద్రమోహన్ రెడ్డి, జిలేందర్‌రెడ్డి, సుబ్బరావు, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బడిబాట విజయవంతం చేయాలి



ప్రజాపక్షం/యాచారం : బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బడి బాటను విజయవంతం చేయాలని నందివనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏవిఆర్ శాస్త్రి అన్నారు. శనివారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట నిర్వహించారు. నందివనపర్తి, సింగారం, బొల్లి గుట్టతండా, ఏనె కింది తండాల్లో పర్యటించారు. ఈసంధర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అన్నిఏర్పాట్లు ఉన్నాయని, అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యనందిస్తామని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన ఉంటుందన్నారు. విద్యార్థులకు రెండు జతల బట్టలు, నోటుబుక్స్, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో అమ్మ అదర్శ కమిటీ అధ్యక్షురాలు స్వప్న, ఉపాధ్యాయులు, పద్మశ్రీ, పద్మలత, వెంకట్‌రెడ్డి, కిషన్, మురళీధర్, పరమేశ, బోజయ్య, అజయ్ రాథోడ్, అరుణ, విజయరాణి, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వాసంతో చేపమందు స్వీకరణ

### 150 ఏళ్లుగా స్వచ్ఛందంగా అందిస్తున్న బత్తిని కుటుంబం
### దేశ, విదేశాలలో ప్రాచుర్యం
### ఇలాంటి మంచి కార్యక్రమానికి ప్రభుత్వ సహకారం
### రాష్ట్రం తరపున అన్ని ఏర్పాట్లు చేశాం
### చేపమందు ప్రారంభ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : అస్తమా, శ్వాస సంబంధిత వ్యాధిగ్రస్తులకు చేప మందు 150 ఏళ్లుగా బత్తిని కుటుంబ సభ్యులు అందిస్తున్నారని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మృగశిర కార్తె సందర్భంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం చేప మందు పంపిణీ జరుగుతుందన్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శనివారం బత్తిని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టిన చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ ఎంఎల్ఎ దానం నాగేందర్, మత్స్యకారుల కాంగ్రెస్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ చాలాకాలంగా చేప మందు పంపిణీని విశ్వాసంతో ప్రజలు స్వీకరిస్తున్నారని తెలిపారు. ఈ చేప మందు కోసం విదేశాల నుంచి కూడా భారీ సంఖ్యలో వస్తారని తెలిపారు. దేశం నలుమూలల నుంచి చాలా మంది ఇక్కడకు వస్తున్నారన్నారు. ఆస్తమా, శ్వాస వ్యాధులకు సంబంధించి ఇబ్బందులు ఉన్నవారికి ఈ చేపమందును అందిస్తున్నారని మంత్రి చెప్పారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి మంచి కార్యక్రమాలకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. ప్రభుత్వం తరపున కూడా బస్సులు ఏర్పాటు చేశామన్నారు. చేప మందు కోసం వచ్చే వారి కోసం ప్రభుత్వం తరపున సౌకర్యాలు కల్పించామన్నారు. చేప మందు కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా చేస్తున్న బత్తిని కుటుంబ సభ్యులందరికి మంత్రి ప్రభాకర్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రారంభమైన చేప మందు పంపిణీ

ప్రతి సంవత్సరం మృగశిర కార్తె సందర్భంగా నిర్వహించే చేప మందు పంపిణీ కార్యక్రమం హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో శనివారం ప్రారంభమైంది. బత్తిని సోదరులు అందించే చేప మందు తీసుకుంటే ఉబ్బసం, ఆస్తమా రోగాలతో పాటు ఇతర రోగాలు నయమవుతాయని ప్రజలు విశ్వసిస్తారు. దాదాపు 6 లక్షల మందికి చేప ప్రసాదాన్ని పంపిణి చేసేందుకు ఏర్పాట్లు చేశారు. చేప మందు కోసం ప్రజలు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ నలుమూలల నుంచి తరలి వచ్చారు. నిర్వాహకులు చేప మందు పంపిణీకి 34 స్టాళ్లను ఏర్పాటు చేశారు. బందోబస్తులో 1200 మంది పోలీసులు పాల్గొన్నారు. చేప ప్రసాదం కోసం వచ్చే వారి సౌలభ్యం కోసం ఆర్‌టిసి 130 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ప్రధాన రైల్వే స్టేషన్‌లు కాచిగూడ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లు, ప్రధాన బస్టాండ్‌లైన జెబిఎస్, ఎంజిబిఎస్ నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు ఈ బస్సులు నడుపుతున్నట్లు ఆర్‌టిసి ఎండి సజ్జనార్ తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి కూడా బస్సులు అందుబాటులో ఉంటాయని ఆర్‌టిసి ప్రకటించింది.



ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు..

మృగశిర కార్తె సందర్భంగా ప్రతి ఏటా ఉబ్బసం రోగులకు బత్తిని సోదరులు అందించే చేప మందు పంపిణికి ఇతర రాష్ట్రాల నుంచి ఆస్తమా రోగులు, వారి బంధువులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారు బస చేసేందుకు చార్‌కామన్ సంఘం భోజన ఏర్పాట్లను చేసింది. రెండు రోజుల పాటు ఎంత మంది వచ్చిన వారికి భోజనం అందిస్తామని సంఘం అధ్యక్షుడు నాగ్ నాత్ మశాట్టే తెలిపారు. చేప మందు పంపిణికి టోకెన్‌లను శనివారం నుంచే జారీ చేస్తుండటంతో ఒక రోజు ముందే చాలా మంది ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. చేపమందు పంపిణి సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన బందోబస్తుతో పాటు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని పోలీసులు చెప్పారు.



## కళలకు, కళాకారులకు సరిహద్దులు లేవు : మంత్రి జూపల్లి




ప్రజాపక్షం/హైదరాబాద్: కళాకారులకు, కళలకు సరిహద్దులు ఉండవని, భాష ఏదైనా వారి భావంతోనే అన్ని ప్రాంతాల వారిని సొంతం చేసుకుంటారని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం మాదాపూర్ లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించిన 5 జాతీయ చిత్రకళా పోటీలు, ప్రదర్శన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులను మంత్రి అభినందించారు. చిత్రకారులను ప్రోత్సహించేలా పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేయడం అభినందనీయమని స్టేట్ గ్యాలరీ అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పేరొందిన చిత్రకారులు గీసిన చిత్రాల ప్రదర్శన , వారిలో ఉన్న నైపుణ్యానాలను మెరుగుపర్చుకోవడానికి నిర్వహించే ఇలాంటి కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. లలితా కళా అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. విభిన్న కళారీతులను అనుసరిస్తూ దేశవ్యాప్తంగా పేరొందిన వందలాది మంది చిత్రకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారుపెయింటింగ్, స్కల్ప్చర్, డ్రాయింగ్, ప్రింట్‌మేకింగ్, సిరామిక్ మరియు గ్రాఫిక్స్, ఫోటోగ్రఫీ, మల్టీమీడియా, డిజిటల్ ఆర్ట్ వర్క్స్ ఇతర కళాఖండాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ కె. లక్ష్మి, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ప్రెసిడెంట్ రమణా రెడ్డి, ప్రొఫెసర్ ఆనంద్ గడప్ప, తదితరులు పాల్గొన్నారు.

## నా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వండి

ప్రజాపక్షం/హైదరాబాద్: నా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇప్పించాలని తెలంగాణ కోఆపరేటివ్ (అపెక్స్)బ్యాంక్ జనరల్ మేనేజర్ నిమ్మగడ్డ వాణిబాల నాంపల్లి కోర్టులో సదరు బ్యాంక్‌పై కేసు వేశారు. ఆమె భర్త నేతాజి,కుమారుడు శ్రీహర్షలు నిర్వహించిన శ్రీప్రియాంక ఎంటర్ ప్రైజెస్ సంస్థ రూ.200 కోట్లు డిపాజిట్లు వసూలు చేసి డిపాజిటర్లకు శఠగోపం పెట్టిన విషయం తెలిసిందే. ఈ కేసులో వారిద్దరితో పాటు వాణిబాలను అరెస్టు చేయడంతో ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నారు. గతనెల 21న సిసిఎస్ పోలీసులు శ్రీప్రియాంక ఎంటర్ ప్రైజెస్ సంస్థపై కేసు నమోదు చేయగా, అంతకుముందు నెలరోజుల నుంచే వాణిబాల విధులకు గైర్హాజరయ్యారు. భర్త, కుమారుడితో పాటు ఆమె కూడా ఇంటి నుంచి పరారయ్యారు. వెంటనే విధులకు హాజరు కావాలంటూ బ్యాంక్ అధికారులు పలుమార్లు అమెకు నోటీసులు కూడా జారీ చేశారు. సదరు నోటీసులను బ్యాంక్ అధికారులు సైదాబాద్‌లోని ఆమె ఇంటిగేట్‌కు అతికించారు. ఇలా ఐదు నోటీసులకు కూడా ఆమె నుంచి స్పందన రాలేదు. కాగా ఆమె గత నెల 31వ తేదీన పదవి విరమణ చేయాల్సి ఉండగా అంతకు రెండు రోజుల ముందే పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఆమె రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఆగిపోయాయి. వాణిబాల ప్రోద్బలంతోనే తామంతా ఆమె భర్త నిర్వహిస్తున్న శ్రీప్రియాంక సంస్థలో డిపాజిట్లు వాణిబాల బ్యాంకుకు వచ్చి కూర్చునేవాదని అక్కడే తమకు వడ్డీ డబ్బులు ఇవ్వడం, తమ డిపాజిట్లు కూడా అక్కడే తీసుకునేవాడని కూడా వాంగ్మూలంలో బాధితులు పేర్కొన్నారు. వాణిబాల ప్రమేయంతోనే శ్రీప్రియాంక ఉదంతం చోటు చేసుకుందని వారు పేర్కొన్నారు.

పథకం ప్రకారమే తనకు రావాల్సిన పిఎఫ్ డబ్బులను వాణిబాల రెండు నెలల క్రితమే తీసుకుందని, అందులో రూ.40 లక్షలు ఆమె భర్త నిర్వహిస్తున్న శ్రీప్రియాంక గ్రాఫిక్స్‌కు, కుమారుడు నిర్వహిస్తున్న శ్రీప్రియాంక ప్రింటర్స్‌కు రూ.20 లక్షలు, మిగిలిన డబ్బున్ను బంధువుల బినామి అకౌంట్‌లలోకి మళ్లించారని బాధితులు తెలిపారు. వాణిబాల పేరుపై సైదాబాద్, ఆబిడ్స్‌లోని అపెక్స్ బ్యాంక్‌లో ఉన్న రెండు లాకర్లను కూడా పోలీసులు తెరిచి చూడగా అందులో ఒక్కపైసాకూడా లభించలేదు. వారి బ్యాంక్ ఖాతాలలో కూడా జీరో బ్యాలన్స్ దర్శనమిచ్చాయి. పథకం ప్రకారం రెండు నెలల ముందుగానే ఆస్తులు, డబ్బులను దారి మళ్లించారని బాధితులు ఆరోపిస్తున్నారు. పోలీసులు మాత్రం పైసా రికవరీ చేయలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇదిలా వుండగా తన రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ వెంటనే తనకు అందించాలని, భర్త చేసిన రూ.200 మోసంలో తన పాత్ర లేదని వాణిబాల కోర్టుకు తెలిపింది.

## ఇరిగేషన్‌శాఖ సలహాదారు ఆదిత్యానాథ్‌దాస్‌ను తొలగించాలి

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ నీటిపారుదల శాఖ సలహాదారు పదవి నుండి ఆదిత్యనాథ్ దాస్‌ను తొలగించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తికి తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారు పదవి ఎందుకు కట్టబెట్టారో ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. వ్యక్తిగతంగా ఒక ప్రభుత్వ అధికారిగా ఆయన పట్ల తమకు ఎటువంటి వ్యతిరేకత లేదని , కానీ ఆంధ్రకు కృష్ణా ప్రాజెక్టుల నుండి నీటిని తరలించడంలో ఆయనది కీలక పాత్ర అని చెప్పారు.

## కెసిఆర్‌ని కలిసిన ఉప్పల వెంకటేష్



ప్రజాపక్షం/రంగారెడ్డిప్రతినిధి : మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావును ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కల్వకుర్తి నియోజక వర్గ సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నట్లు వెంకటేష్ పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉండి, బిఆర్ఎస్ పార్టీ నాయకత్వాన్ని బలపరుస్తూ కల్వకుర్తి నియోజక వర్గ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని, ప్రతిపక్షాల కుట్రలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ సామాన్య ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కెసిఆర్ సూచించినట్లుగా ఉప్పల వెంకటేష్ చెప్పారు.


# డేటింగ్ కలకలంపై పోలీసుల ఆరా

### బంజారాహిల్స్‌లో మూడు పబ్‌లు బంద్
### మోసపోయిన యువకులు, వ్యాపారులు

ప్రజాపక్షం/హైదరాబాద్: అమ్మాయిలతో డేటింగ్ వ్యాపారం నిర్వహిస్తున్న పలువురు పబ్ నిర్వాహకుల ఉదంతంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. గత నాలుగు రోజుల నుంచి బాధితుల సంఖ్య పెరుగుతుండడంతో పోలీసులు దృష్టి సారించారు. అయితే బాధితులు ఎవరు కూడా ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. అయితే వారి ఏ విధంగా నష్టపోయామనే విషయాన్ని మాత్రం బాధితులు మీడియా దృష్టికి తీసుకువస్తున్నారు. తాము ఎలాగో నష్టపోయాము ఇక నుంచి జాగ్రత్తగా ఉంటాము ఇప్పుడు ఫిర్యాదు చేస్తే తమ పరువు బజారున పడుతుందని వారు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. బాధితుల బలహీనతలను ఆసరా చేసుకునే పలువురు పబ్ నిర్వాహకులు అమ్మాయిలతో డేటింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పబ్‌లలో తరచు ఏదో ఒకటి అసాంఘిక కార్యకలాపాలు వెలుగు చూస్తుండడంతో బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ తన పరిధిలో ఉన్న నాలుగు పబ్‌లలో ముడింటిని మూసి వేయించినట్లు తెలిపారు. మూసివేసిన మూడు పబ్‌లకు పోలీసుల అనుమతికూడా లేదని స్పష్టం చేశారు. ఇక మిగిలిన ఒక పబ్‌కు మాత్రమే అనుమతి ఉందని, అందులో ఎలాంటి అసాంఘిక కార్యాకలాపాలు గాని, డిజె సౌండ్‌గాని ఎలాంటివి జరగడం లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### డేటింగ్‌తో కష్టమర్లకు గాలం..

కొంత మంది పబ్ నిర్వాహకులు తమ వ్యాపారంలో నీతి నిజాయితిగా వచ్చే లాభాలతో సరిపెట్టుకోలేదు. తొందరగా మరింత డబ్బును సంపాదించాలనే అత్యాశతో తమ పబ్‌లలో డ్రగ్స్ విక్రయాలు కొనసాగించి తమ దందాను మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగించారు. దీనికి కాస్తా పోలీసులు



బ్రేక్ వేయడంతో ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలవైపు వారు దృష్టి సారించారు. ఈ సారి 'అమ్మాయిలతో డేటింగ్' నాటకానికి తెర లేపి అందిన కాడికి దోచుకుంటున్నారు. ఈ క్రమంలో పలువురు బాధితులు మోసపోవడంతో పబ్ నిర్వాహకుల నయా దందా వెలుగు చూసింది. మోసపోయిన వారిలో బడా పారిశ్రామిక వేత్తలు, వ్యాపార వేత్తల పిల్లలు ఉన్నారు. వీరిలో కొంత మంది పబ్‌లలో జరుగుతున్న అసాంఘిక కార్యాకలాపాలపై మీడియాకు పూసగుచ్చినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల నుంచి టివిలలో పబ్ నిర్వాహకుల డేటింగ్ వ్యవహారంపై వరుస కథనాలు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఫిర్యాదు చేసేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో పోలీసులే స్వయంగా పబ్‌లపై దృష్టి సారించి విచారణ చేపట్టారు. పబ్‌లలో పనిచేస్తున్న అమ్మాయిల విషయంలో కూడా వారు ఆరా తీస్తున్నారు. అమ్మాయిలను ఇతర రాష్ట్రాల నుంచి ఉద్యోగం ముసుగులో తీసుకువస్తున్నారని, వారితోనే డేటింగ్ నాటకం ఆడిస్తూ డబ్బును దండుకుంటున్నారని పోలీసుల విచారణలో తేలినట్లు తెలిసింది. తమ పబ్‌కు వచ్చే యువకులు, వ్యాపారవేత్తలకు ఈ అమ్మాయిలతో గాలం వేయించి డేటింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని తెలిసింది. పంజగుట్ట, జూబ్లీహిల్స్, ఫిల్మినగర్, బంజారాహిల్స్, ఎస్ఆర్‌నగర్ తదితర పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న పబ్‌లపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

## నీట్ పరీక్షపై అనుమానాలెన్నో...



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : దేశ వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్‌టెస్టింగ్ ఏజేన్సీ నిర్వహించిన నీట్‌పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించినతీరుపై కేంద్రప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఎఐఎస్‌ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మే5న నిర్వహించిన నీట్‌పరీక్షకు దేశవ్యాప్తంగా 24లక్షలమంది విద్యార్థులు పరీక్షనురాశారు. ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులువారి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. వారి అనుమానాలకు సజీవసాక్ష్యం ఆరుగురు విద్యార్థులకు 720మార్కులకు 720మార్కులురావడం వారి యొక్క పరీక్షకేంద్రం ఒకటేకావడంవలన వారి అనుమానాలకు బలానిస్తుంది. కావున తక్షణమే కేంద్రప్రభుత్వం స్పందించి నీట్‌పరీక్ష రాసిన విద్యార్థులకు న్యాయంచేయాలని డిమాండ్ చేశారు.

## బడిబాటతో నూతన ఒరవడి



ప్రజాపక్షం/అడ్డాకుల: ప్రో.జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా అడ్డాకుల మండలం యంఈఓ యన్.నాగయ్య యుపిఎస్ రామచంద్రాపురం పాఠశాలను సందర్శించి, గ్రామంలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదిత్య తండ్రి రాములు అవంతిక తండ్రి కుమార్ అనే విద్యార్థులను 1 వ తరగతిలో చేర్చుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సిఆర్‌పి చెన్నయ్య, రాంచంద్రపురం మాజీ ఉపసర్పంచు శాంతయ్య, అంగన్‌వాడీ టీచర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీ మార్కెట్ డైరెక్టర్ హీర్యానాయక్ మృతి



ప్రజాపక్షం / జడ్చర్ల : రామస్వామి గుట్ట గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ డైరక్టర్ హీర్యానాయక్ శనివారం ఆనారోగ్యంతో మృతి చెందారు.మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి ముఖ్య అనుచరుడు హీర్యానాయక్. సంతాపం వ్యక్తం చేసిన వారిలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, పార్టీ అధ్యక్షుడు రఘుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ. లక్ష్మీ శంకర్ నాయక్, మాజీ ముూఢ డైరెక్టర్స్ ఇంతియాజ్ ఖాన్, శ్రీకాంత్, టైగర్ నర్సిములు, అబ్దుల్లా, విరస్వామి, తర్యా నాయక్, శంకర్ నాయక్ తదితరులున్నారు.

## కెవిపి రామచంద్రరావుతో కసిరెడ్డి



ప్రజాపక్షం/కల్వకుర్తి : మాజీ రాజ్యసభ సభ్యుడు కెవిపి రామచంద్రరావును ఎంఎల్‌ఏ కసిరెడ్డినారాయణరెడ్డి శనివారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగాకలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పలు రాజకీయ అంశాలపై మాట్లాడినట్లు తెలిపారు. ఆయనవెంట సురభివెంకటేశ్వర రావు ఉన్నారు.

## తీన్మార్‌మల్లన్న గెలుపు హర్షణీయం



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి:ఉమ్మడినల్గొండ ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో తీన్మార్‌మల్లన్న ఘనవిజయం సాధించడం అభినందనీయమని కొల్లాపూర్ మున్సిపల్‌చైర్మన్ మేకలరమ్యనాగరాజు శనివారం ఒకప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్‌ప్రచార కమిటికన్వీనర్ తీన్మార్ మల్లన్న ఎంఎల్‌సి ఉప ఎన్నికలలో గెలుపొందిన సందర్భంగా మల్లన్నకు హృదయపూర్వక హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.

## మల్లు రవిని కలిసిన ప్రముఖులు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : న్యూఢిల్లీలోని తెలంగాణభవన్‌లో నాగర్‌కర్నూల్ ఎంపిగా డాక్టర్ మల్లురవి భారీమెజార్టీతో గెలిచిన సందర్భంగా ప్రముఖులు శనివారం సిపిఐజాతీయ కార్యదర్శి డి.రాజా, సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సిపిఐ ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, ఏఐసిసి సెక్రటరీ ఇంచార్జీ తెలంగాణరోహిత్ చౌదరి, సిడబ్ల్యూసి ప్రత్యేక ఆహ్వానితులు రుద్రదరాజు అందరూకలిసి పుష్పగుచ్ఛంతో డాక్టర్ మల్లురవిని ఘనంగా సన్మానించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

ప్రజాపక్షం/వంగూర్ : వాహనదారులు రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఎస్‌ఐ మహేందర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అందుకు వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు తప్పనిసరిగా సీటుబెల్టుపెట్టుకోవాలని, అదేవిధంగా ద్విచక్రవాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించి ప్రమాదాలను నివారించాలని సూచించారు.

## పెబ్బేరులో గృహజ్యోతి బిల్ ప్రారంభం



ప్రజాపక్షం / పెబ్బేరు : వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాల్టీలో గృహ జ్యోతి పెబ్బేర్ మున్సిపాల్టీలో గృహ జ్యోతి కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. పెబ్బేరులోని 10 వార్డులో విద్యుత్ సిబ్బంది వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ , విద్యుత్ గృహ మీటర్ నంబర్ రీడింగ్ స్కాన్ చేశారు. గృహ జ్యోతి ఉచిత కరెంటు జీరో బిల్ వచ్చింది. ఎలక్షన్ కోడ్ ముగించడంతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 హమీలలో గృహ జ్యోతి పథకం పెబ్బేరు మున్సిపాల్టీలో జీరో కరెంటు బిల్ అమల్లోకి రావడంతో మున్సిపాల్టి ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే మేఘారెడ్డికి హర్షం వ్యక్తం చేశారు.

# బిసిల వాటా దక్కేవరకు పోరు

### సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు



ప్రజాపక్షం / హైదరాబాద్ : బిసిల ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయాల కోసం బిసి కవులు, రచయితలు, విద్యావంతులు ఏకమై నిలిచి సంఘటిత ఉద్యమాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. బిసి కవులు, రచయితలు, కళాకారులు, విద్యావంతులు ఏకమై నిలిచి స్థానిక సంస్థల్లో బిసిల సమవాటా సాధన కోసం ఒక్కటిగా నిలిచి సమరం చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. మహాత్మా పూలే స్ఫూర్తిగా వనపట్ల సుబ్బయ్య, సంగిశెట్టి శ్రీనివాస్‌ల సంపాదకత్వంలో వచ్చిన వివిధ కవుల బృహత్తర కవితా సంకలనం ''ధిక్కార''ను తెలంగాణ సాహిత్య అకాడెమీ మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ హైదరాబాద్ రవీంద్రభారతి మినీహాల్లో శనివారం ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వం, భాషాసాంస్కృతిక వేదిక, నెలపొడుపుల సం యుక్త ఆధ్వర్యంలో జరిగింది. జూలూరు మాట్లాడుతూ ఈ మట్టి నుంచి ఎగిసిన అన్ని రకాల ఉద్యమాలలో బిసిలదే కీలకపాత్రగా ఉందన్నారు. తెలంగాణ సాయుధ పోరు నుంచి తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమం వరకు అన్నింటిలో బిసిలు కీలకపాత్ర పోషించారని చెప్పారు. బిసి సాహితీవేత్తలను వేరు చేసి చూస్తే తెలుగు సాహిత్యమే లేదన్నారు. ఇప్పటి వరకు అందరి కోసం మాట్లాడిన బిసిలు ఇప్పుడు తమ కోసం గొంతెత్తి గర్జించి గళగర్జనలు వినిపించాలని చెప్పారు. పుట్టి పెరిగి ఎదిగి వచ్చిన బిసి కులాల, బిసి సామాజికవర్గాల రుణం తీర్చుకునే పనిని బిసి కవులు, రచయితలు చేపట్టాలన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే ఆలోచనా ధారల్లో ముందుకు సాగుతూ బిసిల కలలు నెరవేర్చేందుకు కలాలను కరవాలాలు చేసి కదలాలన్నారు. గోరేటి వెంకన్న మాట్లాడుతూ దేశంలో బహుజన చైతన్యం అవసరముందన్నారు.కులగణన చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ చదువు వల్ల జ్ఞానం వస్తుందని ఈదేశంలో చెప్పిన మొట్టమొదటివాడు మహాత్మా పూలేనేఅన్నారు. డా. పసునూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని పరీక్షాకేంద్రాలవద్ద 144వ సెక్షన్

ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ ప్రతినిధి : ఈ నెల 9న నిర్వహించనున్న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లాలో అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ రవినాయక్ అన్నారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఓఎంఆర్ విధానంలో నిర్వహించనున్న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసిందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. 15199 మంది అభ్యర్థులు గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలను రాయనున్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోనున్నారు. పరీక్షలు నిర్వహించే రోజున అన్ని పరీక్ష కేంద్రాల పరిధిలో 144న సెక్షన్ విధించనున్నారు. 36 పరీక్ష కేంద్రాలలో బందోబస్తు తో పాటు, పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులు వెళ్లే ముందు తనిఖీ చేయడం, మహిళా అభ్యర్థుల తనిఖీకి మహిళా సిబ్బందిని సైతం నియమించారన్నారు. ఆర్టీసీ ద్వారా అవసరమైనన్ని బస్సులను నడపనున్నారు. అంతేకాక అభ్యర్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఫ్రిక్వెన్సీ సైతం పెంచనున్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా పరీక్ష కేంద్రాలలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నారు. అందరూ సహకరించాలన్నారు.

# లోక్‌అదాలత్‌లో 17,387 కేసులు పరిష్కారం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : కక్షిదారులకు సత్వరన్యాయం అందించడానికి లోక్‌అదాలత్ సరైనవేదిక అని జిల్లాప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు అన్నారు. రాష్ట్రన్యాయసేవాధికారసంస్థ ఆదేశాలతో శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాకోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించిన లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని జిల్లాజడ్జి ప్రారంభించి పలు కేసులను కక్షిదారుల సమక్షంలో అప్పటికప్పుడే రాజీమార్గంద్వారా పరిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గమని లోక్‌అదాలత్‌ద్వారా కక్షిదారులు కేసులను రాజీకుదుర్చుకొని విలువైన డబ్బు, సమయం ఆదాచేసుకోవాలన్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలే వ్యక్తికి కష్టసుఖాలను నిర్ణయిస్తాయి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకోర్టుతోపాటు కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట పట్టణాల్లోని కోర్టుల్లో నిర్వహించిన లోక్‌అదాలత్‌ద్వారా 17387 కేసులు, వివిధ బ్యాంకు కేసుల్లో రాజీ కుదరగా, దాదాపు రూ.35 లక్షల 3183 రూపాయల సెటిల్‌మెంట్ అయినట్లు తెలిపారు. ఈ అదాలత్‌లో సీనియర్ సివిల్‌జడ్జి సబిత, జూనియర్ సివిల్‌జడ్జి మౌనిక, జూనియర్ సివిల్‌జడ్జి మమతరెడ్డి, బార్ ఆసోసియేషన్ కార్యదర్శి పర్వత్‌రెడ్డి, ఇతర న్యాయవాదులు, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు జర్నలిజాన్ని మలుపు తిప్పిన దార్శనికుడు



ప్రజాపక్షం/జడ్చర్ల: ఒక సామాన్య కుటుంబంలో పుట్టిన రామోజీరావు అసామాన్య విజయాలు సాధించి, తెలుగు జర్నలిజాన్ని ఓ మలుపు తిప్పిన ఘనత రామోజీరావుకు దక్కుతుందని పలువురు జర్నలిస్టులు కొనియాడారు. జడ్చర్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రామోజీరావు చిత్రపటానికి జర్నలిస్టులు నివాళులర్పించారు. ఆయన మరణం తీరని లోటని అన్నారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ ఈనాడు పత్రిక రామోజీఫిల్మ్ సిటీ ద్వారా ప్రపంచానికి తెలుగు వారి ఘనతను చాటాడని గుర్తు చేశారు. యావత్ ప్రపంచానికి తెలుగు శక్తిని చాటిచెప్పిన రామోజీరావు చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకుసానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు జడ్చర్ల ప్రెస్ క్లబ్ గౌరవఅధ్యక్షుడు బాద్మి రవిశంకర్, మొయిజ్, శ్రీనివాస్, కృష్ణ, శేఖర్, నరేందర్ గౌడ్, డేవిడ్ వేణు, జమీర్, నరసింహరెడ్డి, సతీష్ రెడ్డి, ముస్తఫా, అబ్దుల్లా, రాఘవేందర్ , నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రణీతకు స్టేట్ 11వ ర్యాంకు



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024/25 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన మోడల్ స్కూల్స్ ప్రవేశం కోసం గురువారం విడుదల చేసిన పరీక్ష ఫలితాలలో హైదరాబాద్ రామంతపూర్ విద్యార్థిని భీమగౌని ప్రణీత గౌడ్ 76 మార్కులతో స్టేట్ 11వ ర్యాంకును సాధించింది. 6వ తరగతిలో కొత్తగా ప్రవేశాలు కల్పించడంతో పాటు 7 నుంచి 10వ తరగతుల్లోని ఖాళీ సీట్ల భర్తీకి ఈ ప్రవేశ పరీక్షను నిర్వహించారు. రాష్ట్ర స్థాయి 11వ ర్యాంకును సాధించిన భీమగౌని ప్రణీత గౌడ్ స్వగ్రామం గద్వాల జిల్లా కేంద్రంలోని ఒంటెలపేట వీధి. ప్రాథమిక విద్యాభ్యాసం జిల్లా కేంద్రంలోని విశ్వభారతి పాఠశాలలో చదివి ప్రస్తుతం హైదరాబాద్ రామంతపూర్‌లోని సెయింట్ జెసెఫ్ పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. తను రాష్ట్ర స్థాయి 11వ ర్యాంకును సాధించడం వెనుక తన తల్లితండ్రులు భీమగౌని ప్రవీణ్ గౌడ్, సామ్రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయుల ప్రొత్సాహం ఎంతో ఉందని వారికి ధన్యవాదములు తెలియజేస్తున్నానన్నారు.

# రామోజీరావు జీవితం ఆదర్శనీయం

### టిడిపి సికింద్రాబాద్ శాఖ అధ్యక్షుడు సాయిబాబా



ప్రజాపక్షం/హైదరాబాద్: ఈనాడు సంస్థల అధినేత రామోజీ రావు జీవితం ఆదర్శనీయమని టిడిపి సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. రామోజీరావు మృతి పట్ల సాయిబాబా, ప్రధానకార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాల్‌రాజ్ గౌడ్, ఎన్. ప్రకాష్, భాను ప్రకాష్, కిరన్, జోగిందర్‌లు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలుగు భాషకు ఆయన ఈనాడు పత్రిక ద్వారా విశేషసేవలు అందించారని అన్నారు. తెలుగువారి అస్తిత్వాన్ని కాపాడడానికి ఎన్నో ప్రయోగాలు చేశారని కొనియాడారు.

## అత్యాచారాలు, హత్యలు జరిగినా ఫర్వాలేదా?

న్యూఢిల్లీ : బాలీవుడ్ నటి, బిజెపి ఎంపి కంగనా రనౌత్‌ను చండీగఢ్ విమానాశ్రయంలో ఓ సిఐఎస్‌ఎఫ్ మహిళా కానిస్టేబుల్ చెంపదెబ్బ కొట్టిన ఘటన కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. దీనిపై నెట్టింట భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమెకు మద్దతుగా నిలవగా..మరికొందరేమో కానిస్టేబుల్ చర్యను సమర్థిస్తున్నారు. ఈ క్రమంలోనే దాడి ఘటనపై మరోసారి స్పందించిన కంగనా.. ఎక్స్ వేదికగా సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'ఇక అత్యాచారాలు, హత్యలు జరిగినా మీకేం ఫర్వాలేదా?' అంటూ కానిస్టేబుల్‌కు మద్దతిచ్చిన వారిని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'అత్యాచారానికి పాల్పడిన వాడు.. హంతకుడు.. దొంగ.. ఇలా నేరం చేసినవారు ఎవరైనా భావోద్వేగ, మానసిక, ఆర్థికపరమైన కారణాలు చెబుతుంటారు. కారణం లేకుండా ఏ నేరం జరగదు. అయినా సరే చేసిన నేరానికి వారిని దోషిగా తేల్చి శిక్ష విధిస్తారు. అలా కాదని చట్టాన్ని ఉల్లంఘించి నేరాలకు పాల్పడిన క్రిమినల్స్ భావోద్వేగాలకు విలువిస్తే.. అనుమతి లేకుండా ఓ వ్యక్తి శరీరాన్ని తాకడం, వారిపై దాడి చేయడం వంటి ఘటనలను మీరు సమర్థిస్తే.. అత్యాచారాలు, హత్యల వంటివి జరిగినా మీకేం ఫర్వాలేదనే అర్థం. మీలాంటివారు మీ మానసిక పరిస్థితిపై మరింత దృష్టిపెట్టుకోవాలి. యోగా, ధ్యానం చేయండి. లేదంటే జీవితం చేదు అనుభవంగా మారుతుంది. పగ, ద్వేషం, అసూయతో ఉండకండి. వాటినుంచి ఇకనైనా విముక్తి పొందండి'' అని కంగనా రాసుకొచ్చారు.గురువారం ఢిల్లీ విమానాశ్రయంలో కంగనకు చేదు అనుభవం ఎదురైంది. భద్రతా తనిఖీ చేసుకొని ముందుకువెళుతున్న కంగనను అక్కడ విధులు నిర్వహిస్తున్న సిఐఎస్‌ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్ చెంపపై కొట్టారు. భద్రతా అధికారులు కంగన చుట్టూ వలయంగా ఏర్పడ్డారు. సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. సాగు చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో గతంలో ఆందోళన నిర్వహించిన మహిళా రైతుల విషయంలో కంగన అనుచిత వ్యాఖ్యలు చేశారని, అందుకే కొట్టానని చెప్పారు.

# రాష్ట్రానికి రెండు కేంద్రమంత్రి పదవులు?





### పరిశీలనలో కిషన్‌రెడ్డి, డి.కె.అరుణ, ఈటల పేర్లు

### బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవిలో మరో ఎంపికి ఛాన్స్

ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక మంత్రి, మరొక సహాయ మంత్రి పదవులు దక్కె అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆదివారం జరిగే కేంద్ర మంత్రివర్గ ఏర్పాటులో రాష్ట్రం నుంచి ఎవరికి అవకాశం లభిస్తుందనేది బిజెపి వర్గాల్లో ఉత్కంఠ నెలకొన్నది. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, డి.కెఅరుణ, ఈటల రాజేందర్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఒక ఒసి, మరొక బిసికి మంత్రి పదవి ఇవ్వాలనే చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఒసి కోటాలో జి.కిషన్‌రెడ్డి లేదా డి.కె.అరుణ, బిసి కోటలో మాత్రం ఈటల రాజేందర్ పేరు వినిపిస్తున్నప్పటికీ బండి సంజయ్ పేరును కూడా కొందరు ముఖ్యనేతలు సూచిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. అయితే రాష్ట్ర అధ్యక్ష పదవిలో కొనసాగేందుకు జి.కిషన్ రెడ్డి విముఖత వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే విషయాన్ని ఆయన అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లగా బిజెపి జాతీయ నేతలు కూడా సానుకూలంగా స్పందించినట్టు బిజెపి వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్ర అధ్యక్ష పదవిని ప్రస్తుతం గెలిచిన ఎంపిలలో ఒకరికి ఇవ్వాలనే యోచనలో బిజెపి అధిష్ఠానం ఉన్నట్టు తెలుస్తోంది. ఒక వేళ కిషన్ రెడ్డికి జాతీయ స్థాయిలో పార్టీ పదవిలో అవకాశం కల్పిస్తే, ఆయనను కేంద్ర మంత్రి వర్గంలో అవకాశాలు ఉండబోవనే చర్చ జరుగుతోంది. కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతినిధ్యం వహించే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన డి.కె. అరుణకు అవకాశం ఇస్తారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు మంత్రివర్గంలో అవకాశం కోసం కొందరు ఎంపిలు తీవ్రంగానే ప్రయత్నిస్తున్నట్టు సమాచరం. మంత్రివర్గ పదవుల అంశంపై బిజెపి సీనియర్ నేత అమిత్ షా కొందరు ఎంపిలతో మాట్లాడినట్టు సమాచారం. మరి కొన్ని గంటల్లో కేంద్ర మంత్రివర్గంలో ఉండేదవరు? అనేది తేలిపోనుంది.

## నీట్ పేపర్ లీకేజ్‌పై విచారణకు డిమాండ్

### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు



ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి: దేశ వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీనిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాల పై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహయ కార్యదర్శి సి.రాజు డిమాండు చేశారు. శనివారం మహబూబ్‌నగర్ ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మే 5న పరీక్షను నిర్వహించడం జరిగింది. దాదాపు దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షను రాశారు. ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. వారి అనుమానాలకు సజీవ సాక్ష్యం ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం, మరల వారి యొక్క పరీక్ష కేంద్రం ఒకటే కావడం వలన వారి అనుమానాలకు బలాన్నిస్తుందని ఆయన తెలిపారు. కావున తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజేన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని రాజు డిమాండు చేశారు. అదే విధంగా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వానికి చెప్పిన కూడా వారి మాటని పెడచెవిన పెట్టి, నిర్లక్ష్యం చేయడం ద్వారా వేలాది మంది ప్రతిభ గల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజేన్సీ విడుదల చేసిన ఫలితాలపై పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని ఆయన కోరారు.

## విద్యాహక్కుచట్టం అమలుచేయరేమి?



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : విద్యాహక్కు చట్టం ఆర్‌టిఐ12(1)(సి) ద్వారా అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో 25శాతం విద్యార్థులకు ఉచితవిద్యను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణజానపద కళాకారులసంఘం జిల్లా అధ్యక్షులు జోగు జ్యోతి శనివారం తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ, యూనిఫామ్‌లను స్కూల్‌యాజమాన్యం సూచించేచోటే కొనాలన్న కచ్చితమైన నిబంధనలేమి పెట్టరాదని, అమ్మకాలకు పాఠశాలల్లో కౌంటర్లు ఏర్పాటుచేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో బోర్డులపై ఇంటర్నేషనల్ ఐఐటి, ఒలంపియాడ్ కాన్సెప్ట్, ఈటెక్నో అనేతోకలు తగిలించినవి తొలగించాలని, ఫీజుల్లోంచి 50శాతం మొత్తాన్ని ఉపాధ్యాయులకు వేతనాలుగా చెల్లించాలన్నారు. ప్రతి ఏడాది వార్షిక నివేదికలు, ఆడిట్‌రిపోర్ట్సు ప్రభుత్వానికి సమర్పించలేని పాఠశాలలగుర్తింపు రద్దుచేయాలన్నారు.

## కెసిఆర్‌ను కలిసిన మాజీ వైస్ చైర్మన్



ప్రజాపక్షం/కల్వకుర్తి: మాజీ ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్‌పార్టీ అధినేత కెసిఆర్‌ను శనివారం ఎర్రవెల్లిఫామ్‌హౌస్‌లో కల్వకుర్తి నియోజకవర్గం ఉప్పలచారిటబుల్‌ట్రస్టుచైర్మన్, బిఆర్‌ఎస్‌పార్టీ రాష్ట్రనాయకులు, మిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్ ఉప్పలవెంకటేష్ కెసిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కెసిఆర్‌తో ఉప్పలవెంకటేష్ కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధించిన పలువిషయాలను అడిగి తెలుసుకున్నట్లుగా, పార్టీ కార్యకర్తలకు అండగా ఉండి బిఆర్‌ఎస్‌పార్టీ నాయకత్వాన్ని బలపరుస్తూ కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, ప్రతిపక్షాలకుట్రలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ సామాన్యప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కెసిఆర్ సూచించినట్లుగా తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం




ప్రజాపక్షం/వెల్దండ : మండలకేంద్రానికిచెందిన కాటమోనిసుక్కమ్మ అనారోగ్యానికి గురై శనివారం ఉదయంమృతిచెందింది. కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు, సింగిల్‌విండోడైరెక్టర్ మట్టవెంకటయ్యగౌడ్ సుక్కమ్మ కుటుంబాన్ని పరామర్శించి వ్యక్తిగతంగా రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు రషీద్, శ్రీను, అన్యపురామస్వామి,కాటమోనిశ్రీశైలం,తుంగశ్రీను, చంద్రశేఖర్, శివ,రాజేష్,భరత్‌గౌడ్ ఉన్నారు. అదేవిధంగా అజిలాపూర్ గ్రామంలో ఇటీవలే కాసామల్లమ్మ అనారోగ్యంతో మృతిచెందగా శనివారం ఆమెభర్త ముసలయ్యకు ఆగ్రామ బిఆర్‌ఎస్ నాయకులు సిద్దగౌనిరమేష్‌గౌడ్‌రూ.3వేలు అందజేశారు. బిఆర్‌ఎస్ నాయకులు ఆర్‌కె.గౌడ్, పరమేష్‌గౌడ్, రాములు, కొప్పు కృష్ణయ్య,కొర్వారుకుమార్, కొర్వారు శ్రీకాంత్, యాదయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

## రామోజీరావుకు ఘన నివాళి



**ప్రజాపక్షం/నాగారం:** ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీ రావు మరణం చాలా బాధాకరమని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.శనివారం అనారోగ్యంతో మృతి చెందిన పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత రామోజీరావు చిత్ర పటానికి పూల మాల వేసి చైర్మన్ చంద్రారెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఆయన మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌కు అభినందనలు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** మల్కాజ్‌గిరి పార్లమెంటు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు సాయి నాగార్జున తెలుగు దేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ అఖండ విజయం సాధించిదం, మంగళగిరి నియోజకవర్గంలో లోకేష్ 91,413 ఓట్లతో భారీ మెజారిటీతో గెలిచిన సందర్భంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ తెలంగాణలో పార్టీని బలోపేతం చేస్తామని,రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి బరిలో ఉంటుందని తెలిపారని నాగార్జున అన్నారు.

## 10 నుండి ప్రజావాణి ప్రారంభం

కలెక్టర్ గౌతం


**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఇటీవల లోకసభా ఎన్నికల సందర్భంగా నిలిచి పోయిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీ నుండి ప్రతి సోమవారం యథావిధిగా నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ గౌతం తెలిపారు. జిల్లాలో ప్రజలు స్థానికంగా పరిష్కారం కానటువంటి సమస్యలు నేరుగా కలెక్టరేట్ కార్యాలయంలో ఉన్నతాధికారుల సమక్షంలో జరిగే ప్రజావాణిలోసమర్పించవచ్చని,వాటిని సత్వరమేపరిష్కరిస్తామనిఆయన తెలిపారు.

## దమ్మాయిగూడ మున్సిపల్‌లో ప్రతి సోమవారం ప్రజావాణి

**ప్రజాపక్షం/దమ్మాయిగూడ:** సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమిషనర్ రాజమల్లయ్య తెలిపారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని కమిషనర్ తెలిపారు.మున్సిపల్‌లో నెలకొన్న సమస్యలను ప్రజలు ఉదయం 10 గంటల నుండి ఆర్జీ రూపంలో ఫిర్యాదు చేయవచ్చునని,ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ తెలియజేశారు.

## వరదలా పారుతున్న మురుగునీరు పట్టించుకోని అధికారులు

జగద్గిరిగుట్ట సిపిఐ శాఖ సెక్రెటరీ ఎం సహదేవరెడ్డి




**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట:** జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని జగద్గిరి నగర్‌లో రోడ్డుపై వరదలపారుతున్న మురుగునీరును అరికట్టడంలో మున్సిపల్ సిబ్బంది విఫలమయ్యారని జగద్గిరిగుట్ట సిపిఐ శాఖ సెక్రెటరీ ఏం సహదేవరెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక ప్రజలతో కలిసి జగద్గిరి నగర్ జగద్గిరిగుట్ట రోడ్ నెంబర్ వన్, బస్ స్టాప్ రోడ్డు నిత్యం డ్రైనేజీ పొంగుతూ రోడ్డు మీద ప్రవహిస్తున్న అధికారులు చూసి చూడనట్లు ఎవరిస్తున్నారు. ఎన్నిసార్లు విన్నవించుకుంటున్న కంప్లైంట్స్ ఎన్ని పెట్టిన అప్పటికప్పుడు మాన్యువల్స్‌లో కొంచెం క్లీన్ చేస్తారు. మళ్లీ తెల్లారి ఇదే ఇదే పరిస్థితి అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, మేము రోజు అధికారులకు ప్రజా ప్రతినిధులకు చెప్పడానికి కూడా సిగ్గుపడాల్సి వస్తుంది. అధికారులు ఎన్నిసార్లు చెప్పినా కంప్లీట్స్ ఇచ్చిన ఆ చూస్తాం చేస్తాం అంటారు. తర్వాత అదే కంటిన్యూ అవుతుంది నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం అలా రోడ్డుపై వరదల పారుతుంటే కొంచెమైనా సిగ్గు అని పించట్లేదా అధికారులకు ఇప్పటికైనా కళ్ళు తెరిచి చూడండి ఆ సమస్యను వెంటనే స్పందించి మరల ఈ డ్రైనేజీ ప్రాబ్లం రాకుండా చూడాలని కోరారు. స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్ల చిన్నారిపై కుక్కల దాడి



**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ మున్సిపల్ పరిధిలో కుక్కల బెడద రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్నాయి. దాడి జరిగిన సంఘటనలు కొక్కోలుగా వెలుగు లోకి వస్తున్నాయి. కుక్కల దాడితో ఎప్పుడు ప్రమాదాలు సంభవిస్తాయో తెలియక తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం పసిపిల్లలకు ప్రాణసంకటంగా మారుతుంది. పిల్లలు స్కూల్‌కు వెళ్లాలన్న,బయటకు వెళ్లాలన్న నానాటికి పెరుగుతున్న కుక్కల దాడుల వల్ల ప్రజలు భయం గుప్పెట్లో జీవిస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ మున్సిపాలిటీ లోనీ 10వ వార్డులో కుక్కల బారిన పడి ఓ చిన్నారి ప్రాణాపాయ స్థితిలో సూరారంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. వివరాలలోకి వెళితే గండిమైసమ్మ లోని మున్సిపల్ ఆఫీ వెనకాల నివాసం ఉంటున్న మింటు సింగ్, నీలిమా దేవి దంపతులు ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం ఉదయం భర్త పనిమీద బయటకు వెళ్ళాక 2 సంవత్సరాలుగా వారి కూతురు ఆరుషి ఇంట్లో ఆడుకుంటుండగా తల్లి స్నానానికి వెళ్ళింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై రెండు కుక్కలు దాడి చేయడంతో బాలిక భయపడి కేకలు వేయడంతో ఆందోళన చెందిన తల్లి రక్తపు మడుగుల్లో పడి ఉన్న బాలికను హుటాహుటిన చికిత్స నిమిత్తం హాస్పిటల్లో చేర్పించారు.

## శ్రీచైతన్య హైస్కూల్‌పై ఫిర్యాదు



**ప్రజాపక్షం/ఫేట్ బషీరాబాద్:** శనివారం రోజు కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద అనుమతులు లేకుండా కొత్తగా ఏర్పాటు చేసిన సుచిత్రలో ఒక స్కూల్ ఆనుకొని నడిపిస్తున్న శ్రీచైతన్య పాఠశాలపై కుత్బుల్లాపూర్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సంఘం ప్రతినిధులు ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద తక్షణమే స్పందించి జిల్లా విద్యాధికారితో ఫోన్లో మాట్లాడి వెంటనే అనుమతులు నిలిపి వేయాలని నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీ చైతన్య పాఠశాల వల్ల 40 బడ్జెట్ పాఠశాలల వారికి ఇబ్బంది కలిగే రకంగా ఉన్నది కాబట్టి దీని అనుమతులు నిలిపివేయాలని, ఎటువంటి అనుమతులు ఇవ్వద్దని కోరారు. ఇందులో భాగంగా కుత్బుల్లాపూర్ మండల్ రికగ్నిషన్స్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు మహేష్ కుమార్, కార్యదర్శి రవికుమార్, కోశాధికారి గోవర్ధన్ రెడ్డి, చైర్మన్ పి.శివయ్య, వైస్ చైర్మన్ మండవ శ్రీనివాస్ గౌడ్, మాజీ అధ్యక్షులు వరప్రసాద్, సెయింట్ ఆంథోనీ హై స్కూల్ కరెస్పాండెంట్ సుందర్ రాజ్ మొదలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** విద్యుత్ మరమ్మతులు,చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్‌కు ఆదివారం అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రవీందర్ తెలిపారు.చర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 11కెవి ఫీడర్‌ను 10.30 గంటల నుండి 12.30 వరకు నిలిపివేయడంతో ఐడిఏ ఫేస్3లో ప్రాంతంలో,11 కెవి దన్‌మెడ్ ఫీడర్‌ను మ:2.30నుండి సా:4.30 వరకు నిలిపివేయడంతో ఐడిఏఫేస్3లో విద్యుత్‌కుఅంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

**చర్లపల్లి ఫేస్2లో:** 11కెవి సన్‌రైస్ ఫీడర్,డైనటెక్ ఫీడర్‌ను 10.30 నుండి 12.30 గంటల వరకు నిలిపివేయడంతో ఫేస్2లో సెక్టార్2,3లో, దేవి హైటెక్, విమ్‌తా ల్యాబ్స్ 11కెవి ఫీడర్‌ను 2.30 గంటల నుండి 4.30 వరకు నిలిపివేయడంతో ఫేస్1 సెక్టార్ 1ప్రాంతం,ఫేస్2 సెక్టార్1ప్రాం తంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పృథ్వీరాజ్ తెలిపారు.

# పోకిరీల పట్ల కఠిన వైఖరి

రాచకొండ కమిషనర్ డా.తరుణ్‌జోషి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మహిళలు, విద్యార్థినులను వేధించే పోకిరీలపై కఠినంగా వ్యవహరిస్తామని రాచకొండ పోలీస్ కమిషనర్ డా.తరుణ్‌జోషి హెచ్చరించారు. ఇలాంటి వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని చట్ట ప్రకారం చర్యలు తీసుకోనేందుకు కీలకమైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా కొనసాగుతున్న రాచకొండ షీ టీమ్స్ నిరంతరం పని చేస్తున్నాయని ఆయన తెలిపారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, విద్యా సంస్థలు, కూరగాయల మార్కెట్లు లాంటి ప్రజల సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో షీ టీం బృందాలు మఫ్టీలో సంచరిస్తుంటారని, డెకాయ్ ఆపరేషన్లు సైతం చేస్తారని, బాలికలు, మహిళలను వేధించే పోకిరీలను పట్టుకొని తగిన సాక్ష్యాధారాలతో న్యాయస్థానంలో హాజరు పర్చటమే కాక వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు వారి పిల్లల రక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలని, పిల్లలు తమ ఫోన్లలో ఇంటర్నెట్ వినియోగించి ఏమి చూస్తున్నారన్న విషయాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో శనివారం రాచకొండ కమిషనర్ క్యాంపు కార్యాలయంలో పట్టుబడ్డ పోకిరీలకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించిన కౌన్సిలింగ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు వారి పిల్లల రక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలని, పిల్లలు తమ



ఫోన్లలో ఇంటర్నెట్ వినియోగించి ఏమి చూస్తున్నారన్న విషయాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు. కౌన్సిలింగ్‌లో పాల్గొన్న రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్ డిసిపి టి.ఉషా విశ్వనాథ్ మాట్లాడుతూ గత నెల ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు తమకు వేధింపులకు సంబంధించిన 101 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిలో ఫోన్ల ద్వారా వేధించిన ఫిర్యాదులు 15, సోషల్ మీడియా ద్వారా వేధించిన ఫిర్యాదులు 22, నేరుగా వేధించిన ఫిర్యాదులు 64 అని తెలిపారు. ఈ ఫిర్యాదులపై దర్యాప్తు చేసి 11 క్రిమినల్ కేసులు, 47 పెట్టీ కేసులు నమోదు చేయగా మిగిలిన 24 కేసులకు సంబంధించిన మొదటి తప్పిదంగా పోకిరీలకు కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరించామన్నారు. జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గృహిణి స్నానం చేస్తుండగా ఆమెకు తెలియకుండా బాత్రూమ్ కిటికీలో నుండి వీడియో తీసి దాన్ని చూపించి తన కోరిక తీర్చాలని బెదిరించి పలు మార్లు లైంగికదాడులకు పాల్పడిన సంఘటనపై వచ్చిన బాధితురాలి ఫిర్యాదుపై నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి కారాగారానికి పంపామని డిసిపి తెలిపారు. ఎల్‌బినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ హాస్టల్‌లో ఉంటూ ప్రవేశ పరీక్షలకు కోచింగ్ తరగతులకు హాజరయ్యే సందర్భంలో పరిచయమైన ఓ యువకుడు ప్రేమ పేరిట నమ్మించి పలు సార్లు లైంగిక దాడులకు పాల్పడిన ఉదంతంపై బాధితురాలిచ్చిన ఫిర్యాదుపై క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి జైలుకు పంపామన్నారు. చౌటుప్పల్ బస్టాండ్‌లో పలువురు వేధిస్తున్నారన్న ఫిర్యాదులపై వెంటనే స్పందించిన షీ టీమ్స్ బృందాలు అక్కడికి వెళ్లి నలుగురు పోకిరీలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసామన్నారు.

**అవగాహనా సదస్సులు:** గత నెల ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు రాచకొండ కమిషనరేట్ షీ టీమ్స్ బృందాలు వేర్వేరుగా 30 అవగాహనా సదస్సులు నిర్వహించి 4425 మందికి మహిళా చట్టాలు, వారి హక్కులు, నేరాల గురించి వివరించామన్నారు.

**డెకాయ్ ఆపరేషన్లు :** రాచకొండ షీ టీమ్స్ బృందాలు తరచు ప్రజా రద్దీ ఉండే ప్రాంతాల్లో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామన్నారు. మెట్రో రైళ్లల్లో మహిళా కంపార్ట్మెంట్లలోకి మఫ్టీలో మహిళా పోలీసులు వెళ్లి డెకాయ్ ఆపరేషన్ ద్వారా ఏడుగురిని, విద్యా సంస్థలు, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో డెకాయ్ ఆపరేష్ ద్వారా 66 మందిని పట్టుకొని కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు.

## ప్రైవేటు పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ప్రైవేటు పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి శ్రీ హోమ్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లిటిల్ విల్లే ప్రీమియం ప్లే స్కూల్‌ని స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వళన గావించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ కాలనీ ప్రజలకు అనుగుణంగా పాఠశాలలను నడపాలని అన్నారు. నాణ్యమైన విద్యను అందించినప్పుడే పాఠశాల అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఎలాంటి లాభాపేక్షను ఆశించకుండా పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి ఉన్నత శిఖరాలకు ఎదిగేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

**వైభవంగా అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు..**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 7, 26 డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ శనిగల దన్‌రాజ్ యాదవ్ దంపతులు, ఆలయ చైర్మన్



కొలను చంద్రశేఖర్ రెడ్డిలు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేక్ మాట్లాడుతూ శరణంటూ భక్తితో కొలిచే ప్రతి భక్తుని కోరికలను నెరవేర్చే భగవంతుడు అయ్యప్ప స్వామి అన్నారు. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నేత కొలను నర్సింహారెడ్డి, కార్పొరేటర్‌లు ప్రణయ, రాఘవేంద్ర రావు, నాయకులు రంగరాయ ప్రసాద్, శ్రీనివాస్, హరిబాబు, దీపక్, ఇంద్రకుమార్, సాయిలు యాదవ్ పాల్గొన్నారు.

## మల్కాజిగిరి డివిజన్‌లో సమస్యలు పరిష్కరిస్తా: శ్రవణ్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి డివిజన్ పరిధిలో సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తానని డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. డివిజన్ ప్రాంతవాసులు ఎదుర్కొనే సమస్యలను తన దృష్టికి తీసుసకొని వచ్చేందుకు గాను శనివారం డివిజన్ కార్యాలయంలో ప్రజా సమస్యలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుండి వచ్చిన కాలనీ, వెల్ఫేర్ సంఘ ప్రతినిధులు కార్పొరేటర్‌ను కల్సి తామెదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి వినతి పత్రాలను ఇచ్చారు. విద్యుత్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండటం లేదని కార్పొరేటర్ దృష్టికి తీసుకొని వచ్చారు. అదే విధంగా రేషన్ కార్డులు, గృహజ్యోతి ,పెన్షన్ల కోసం ప్రజా పాలనలో ఇచ్చిన ధరఖాస్తులను పరిశీలించి వెంటనే వచ్చేలా చేయాలని కోరారు. గుర్రపు డెక్క, దోమల నివారణ, నాలా డీసైలటింగ్, స్కూల్ జోన్‌లలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయటంలాంటి పలు విషయాలు పరిష్కరించాలని కోరారు.

## దూలపల్లిలో తుమార్ చెరువు ఆక్రమణ



**ప్రజాపక్షం/ఫేట్ బషీరాబాద్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,కొంపల్లి మున్సిపాలిటీలోని దూలపల్లి గ్రామంలో తుమార్ చెరువు ఆక్రమణ, తూము కాలువల ఆక్రమణ గురించి దూలపల్లి గ్రామస్తులు సంప్రదించగా నేడు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి తో కలిసి పరిశీలించి వెంటనే అక్రమ కట్టడాలను కూల్చివేయించిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత పదేళ్లుగా బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక చెరువులు, కుంటలను నామరూపాలు లేకుండా చేసి ఎన్నో కాలనీలను నీట మునిగేలా చేశారని, కాంగ్రెస్ ప్రజాపాలనలో నేడు ప్రతి చెరువును, కుంటను కాపాడి ప్రజలకు వరద ముంపు లేకుండా చూస్తూ భూగర్భ వనరులను కాపాడే బాధ్యత తీసుకుంటుందని స్పష్టం చేశారు. చెరువులు కుంటలను కబ్జాలు చేసేవారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, దూలపల్లి కౌన్సిలర్ శివ కుమార్ గౌడ్, పిఏసిఎస్ ఛైర్మన్ నరేందర్ రాజు, పిఏసిఎస్ డైరెక్టర్ దప్పు నరేందర్, దూలపల్లి గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లతో కేసులు పరిష్కారం

ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చునని మేడ్చల్ జిల్లా సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కర్‌రావు అన్నారు. కుషాయిగూడ మేడ్చల్ జిల్లా కోర్టు అవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఇందులో రాజీ చేసుకోదగిన క్రిమినల్, మోటర్ ప్రమాద కేసులు,గృహ హింస, చెక్ బౌన్స్, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించబడ్డాయని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 23 బెంచులలో 32 సివిల్ కేసులు,80499 అన్ని రకాల క్రిమినల్ కేసులు,30075 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించబడ్డాయి. లోక్ అదాత్ ద్వారా 62 లక్షల 82 వేల 768 రూపాయలు పరిహారం కింద వచ్చాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్‌లో ఒకటవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్ రఘునాథ్ రెడ్డి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కిరణ్‌కుమార్,మహిళా విభాగం డిసిపి ఉషారాణి, జిల్లా కలెక్టరేట్ న్యాయ అధికారి చంద్రావతి,బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అమరేందర్‌రెడ్డి,న్యాయవాదులు,బ్యాంకు, బిఎస్ఎన్ఎల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం

**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిలో బాగంగా శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం అయిన కొడంగల్‌లో రోడ్ల సుందరీకరణ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న క్రమంలో రేవంత్‌రెడ్డి సోదరుడు నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి చేతుల మీదుగా అధికారులు, ఆపార్టీ నేతలు జనజాతరగా పనులను ప్రారంబించారు. నారాయణపేట జిల్లాలోని కోస్గి మండలం నాచారం నుంచి సర్జాఖాన్‌పేట వరకు డబుల్ రోడ్డు, వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ మండలంలో 26 కోట్లతో హస్నాబాద్ నుంచి నీటూర్ వరకు, 15 కోట్లతో అంగడిరాయిచూర్ గేట్ నుంచి రుద్రారం గ్రామ శివారు వరకు, 40 కోట్లతో రావులపల్లి నుంచి మద్దూర్ వరకు 4 లైన్ల రోడ్డు విస్తరణ, బోంరాస్‌పేట మండలంలో 28 కోట్లతో లింగన్‌పల్లి గేట్ త నుంచి దుద్యాల్ వరకు, 50 కోట్లతో కుదురుమల్ల నుంచి దుద్యాల్, పోలేపల్లి దాదాపూర్ వరకు, 11 కోట్లతో పర్సపూర్ నుంచి పాతకొడంగల్ తాండ వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన సమావేశాలలో వారు మాట్లాడుతు మన నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గెలిచిన నాటి నుంచి ఎన్నికల కోడ్ ఉండటంతో అభివృద్ధి పనులు జరగడం లేదని అదేవిధంగా సంక్షేమ పథకాలు కూడా అమలుకు నోచుకోలేకపోయాయని అన్నారు. ఎన్నికల కోడ్ పోవడంతో ఇక కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. ప్రతి శాఖలోని



అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లేని పక్షంలో అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కొడంగల్ మండల ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, దౌల్తాబాద్ మండల ఎంపీపీ పటేల్ విజయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, దుద్యాల మండల అధ్యక్షుడు శేఖర్, దౌల్తాబాద్ బోడి వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, కొడంగల్ పట్టణ అధ్యక్షుడు నయ్యూం, ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## రాజీ మార్గమే రాజ మార్గం

వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూరి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలో మొత్తం 2652కేసులు రాజి పడ్డారు వికారాబాద్ పరిగి కొర్టులో 461 కేసులు తాండూర్‌లో కోర్డులో 1216 కేసులు వికారాబాద్ జిల్లాలో మొత్తం 2652 రాజీపడ్డ రని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ రాజిపడ్డదగ్గ కేసలు రాజీచేసుకోకపోవడం వలన కోర్ట్‌లో కేసులు పెరుకపోవడం వలన కేసుల సంఖ్య పెరుగుతూ ఉంటుంది. ఒక్కొక్క కేసు ల సంఖ్య పెరుగుతూంతు ఉంటుందని ,ప్రతి కేసు సంవత్సరాలు నడుస్తుంది. కనుక అట్లకాకుండా రాజీపడదగ్గ కేసులను రాజీ చేసుకునే విధంగా ఈ జాతీయ లోకదాలత్ ను ఏర్పాటుచేయడం జరగింది అని అన్నారు. ఇందులో ముఖ్యంగా మోటర్ వెహికిల్ ప్రమాదాలు కేసులు,డ్రంకన్ డ్రైవ్, భుతగదల కేసులు ,భార్యాభర్తల కేసులు ,బ్యాంక్ అప్పులు,మిత్తి పేరుకపోయిన వారికి మిత్తిని తొలగించి అసలు మాత్రమే కట్టించుకునే వేసులుబాటు, చెక్ భౌన్స్ ,తదితర కేసులు రాజీ పడే అవకశం ఈ లోక్‌దాలత ద్వారా అవకాశం ఉంటుందని అన్నారు. సమస్యను సాగదీసి పంథాలకి పోయి కోర్టుల చుట్టు తిరిగి బంధాలను బం ధుత్వాలను దురం చేసుకోని సమయంను వృథా చేసుకోవద్దు ,బంధాలను, బంధుత్వాలను పెంచుకోవాలి అన్నారు. రాజీ పడినట్లు అయితే ఒకరు ఒడి ఒకరు గెలిసినట్లు కాదు దీనివల్ల ఇరు పక్షాలు గెలిసినట్లే అని తెలిపారు. జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, జిల్లా ఎస్పి కోటిరెడ్డి, డిబి శీతల్, శృతి దూత,బార్అధ్యక్షులుఅశోక్‌కుమార్,వేంకటేష్,తదితరులుపాల్గోన్నారు.

## ఆర్పీల సమస్యలు పరిష్కారం చేయాలి

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్‌లో పనిచేస్తున్న ఆర్పీల సమావేశం గండిమైసమ్మ లో నిర్వహించారు. దుండిగల్ సిఐటియు మండల కన్వీనర్ లింగస్వామి మాట్లాడుతూ, ఆర్పీలకు ప్రభుత్వం ఎలాంటి గుర్తింపు ఇవ్వకుండా అతి తక్కువ వేతనాలతో వెట్టిచాకిరి చేయించుకుంటుందని అన్నారు. ప్రభుత్వం అన్ని రకాల కార్యక్రమాలలో ఆర్పీల కు అన్ని రకాల పనులను అప్పజెప్తూ సరియైన వేతనాలు ఇవ్వకుండా ఇచ్చే వేతనాలు కూడా సమయానికి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఆర్పి లను ప్రభుత్వం గుర్తించి వారికి కనీస వేతనం అమలు చేయాలని ఈఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. శాంత రాణి, ఆదిలక్ష్మి, అరుణ, ఉమా, రేణుక, నీరజ, లతా, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ఆగివున్న టిప్పన్‌ను ఢీ కొట్టిన బైక్ : భార్యభర్తలు మృతి



**ప్రజాపక్షం / కొడంగల్ :** అంతరాష్ట్ర రహదారిపై ఆగివున్న టిప్పన్‌ను ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం ఢీ కోట్టడంతో బార్యభర్తలు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి కొడంగల్ పట్టణ శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు రాత్రి 11 గంటల సమయంలో కొడంగల్ నుంచి రావులపల్లి వైపు వెళ్తున్న టిప్పర్ చిట్లపల్లి స్టేట్ సమీపంలోకి రాగానే టిప్పర్ రిపెర్‌కావడంతో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా నడిరోడ్డుపైనే ఆపడంతో అదే సమయంలో బషిరాబాద్ మండలంలోని ధామర్‌చేడ్ గ్రామానికి చెందిన కమ్మరి శివాజీ తన భార్య అనితలు బైక్‌పై దౌల్తాబాద్ మండలంలో తమ బంధువుల దగ్గరికి వెళ్తుండగా చిట్లపల్లి గేట్‌పై రోడ్డుపై ఆగివున్న టిప్పర్ కనిపించకపోవడంతో ప్రమాదవశాత్తు వెనుక నుంచి ఢీ కొట్టగా ఇరువురు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృత దేహాలను పోలీసులు కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. టిప్పర్ నిర్లక్ష్యం కారణంగానే రెండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని అన్నారు. శివాజీ బందువలు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

క్రీడ

# నేడు భారత్ X పాక్ టి20



**న్యూయార్క్ :** టి20 వరల్డ్‌కప్‌లో ఆసక్తికర పోరుకు సమయం ఆసన్నమైంది. న్యూయార్క్‌లోని నసావు కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఆదివారం భారత్ పాకిస్థాన్‌ను ఢీకొట్టనుంది. కాగా, ఈ టోర్నీలో టీమ్‌ఇండియా, ఐర్లాండ్‌పై 8 వికెట్ల తేడాతో గెలిచి ఘనంగా బోణీ కొట్టింది. మరోవైపు పాకిస్థాన్ అనూహ్యంగా యూఎస్‌ఏ చేతిలో ఓడిపోయింది. దీంతో పాక్ ఆత్మస్థైర్యం దెబ్బతింది. మరోవైపు తొలి మ్యాచ్‌లోనే నెగ్గిన భారత్ రెట్టింపు ఉత్సాహంతో బరిలోకి దిగనుంది. అయితే 2008 నుంచి పాక్ భారత్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగడం లేదు. ఐసిసి ఈవెంట్స్‌లో మాత్రమే పోటీ పడుతున్నాయి. కాగా, 2007లో ప్రారంభమైన టి20 వరల్డ్‌కప్‌లో భారత్ పాకిస్థాన్ ఇప్పటిదాకా అనేకసార్లు తలపడ్డాయి. మరి ఈ దాయాదుల పోరులో ఎవరిది పైచేయి, ఇరుజట్ల మధ్య గల చరిత్రను తెలుసుకుందాం.

**భారత్‌దే పైచేయి:** ఇప్పటివరకు 8 టి20 ప్రపంచకప్‌లలో పాక్ భారత్ 7 సార్లు తలపడ్డాయి. వీటిల్లో టీమ్‌ఇండియా ఏకంగా 5 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. పాకిస్థాన్ కేవలం ఒక్క మ్యాచ్‌లో గెలిచింది. ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. ప్రారంభ టి20 వరల్డ్‌కప్ (2007)లో మ్యాచ్ డ్రా అవ్వగా, బౌల్ అవుట్‌లో 3-0తో ఇండియా గెలిచింది.

**2007 టి20 ప్రపంచకప్:** తొలి టి20 ప్రపంచకప్‌లో భారత్, పాకిస్థాన్‌తో రెండుసార్లు తలపడింది. మొదటి మ్యాచ్ టై అయింది. బౌల్ అవుట్ ద్వారా భారత్ మ్యాచ్‌ను గెలుచుకుంది. తర్వాత ఫైనల్స్‌లో పోటీపడ్డాయి. ఈ మ్యాచ్‌లో భారత్ 5 పరుగుల తేడాతో విజయం సాధించి తొలిసారి టి20 ఛాంపియన్‌గా నిలిచింది.

**2012 టి20 ప్రపంచకప్:** 2012లో శ్రీలంకలో జరిగిన టి20 ప్రపంచకప్‌లో భారత్ సూపర్ 8 స్టేజ్‌లో పాకిస్థాన్‌తో తలపడింది. భారత్ 8 వికెట్ల తేడాతో సునాయాసంగా విజయం సాధించింది.

**2014 టి20 ప్రపంచకప్:** 2014 టి20 ప్రపంచకప్‌లో సూపర్ 8లో భారత్, పాక్ ఢీకొన్నాయి. మరోసారి పాకిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో భారత్ ఈజీ విక్టరీ అందుకుంది. అయితే భారత్ ఫైనల్లో శ్రీలంక చేతిలో ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయింది.

**2016 టి20 ప్రపంచకప్:** 2016 T20 ప్రపంచ కప్‌కి ఇండియా ఆతిథ్యం ఇచ్చింది. గ్రూప్ స్టేజ్‌లో ఈడెన్ గార్డెన్స్‌లో పాక్, భారత్ పోటీపడ్డాయి. ఈ మ్యాచ్‌లో మరోసారి ఇండియా ఆధిపత్యం ప్రదర్శించింది, 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

**2021 టి20 ప్రపంచకప్:** టి20 వరల్ కప్‌లో 2021లో మొదటిసారి పాకిస్థాన్ గెలిచింది. బాబర్ అజామ్ కెప్టెన్సీలోని పాక్ ఇండియాపై 10 వికెట్ల తేడాతో గెలిచింది.

**2022 టి20 ప్రపంచకప్:** 2022 టి20 ప్రపంచ కప్‌లో భారత్, పాక్ మధ్య ఉత్కంఠ పోరు జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 159 పరుగులు చేసింది. ఛేజింగ్‌కి దిగిన భారత్ ఆరంభంలోనే వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే కోహ్లి పాండ్యా పార్ట్‌నర్‌షిప్ భారత్‌ను తిరిగి ఆటలోకి తీసుకువచ్చింది. 18 బంతుల్లో 48 పరుగులు చేయాల్సి ఉండగా, కోహ్లి అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. చివరి బాల్‌కి సిక్స్ కొట్టి ఇండియాకి ఘన విజయం అందించాడు.

**2024 టి20 వరల్డ్‌కప్**

2024 టి20 ప్రపంచ కప్‌లో జూన్ 9న ఆదివారం రాత్రి 8:00 గంటలకు న్యూయార్క్‌లోని నాసావు కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో పాకిస్థాన్‌తో భారత్ తలపడుతుంది. భారతదేశంలో డిస్నీ + హాట్‌స్టార్ యాప్, వెబ్‌సైట్‌లో లైవ్ చూడవచ్చు. టీవీలో అయితే స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్స్‌లో లైవ్ అందుబాటులో ఉంటుంది.

# న్యూయార్క్ పిచ్‌పై బిసిసిఐ అనధికారిక ఫిర్యాదు!



**న్యూయార్క్ :** టి20 ప్రపంచకప్‌లో మరొక్క రోజులో భారత్ – పాకిస్థాన్ సమరం జరగనుంది. ఇటువంటి సమయంలో న్యూయార్క్ పిచ్ తీరుపై ఐసిసికి ఫిర్యాదు అందినట్లు వార్తలు వస్తున్నాయి. అనూహ్యంగా బౌన్స్ అవుతూ బ్యాటర్లు గాయాలపాలయ్యే అవకాశం ఉందని... బిసిసిఐ నుంచే అనధికారికంగా కంప్లైంట్ వెళ్లినట్లు సమాచారం. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ స్వల్పంగా గాయపడిన సంగతి తెలిసిందే. హాఫ్ సెంచరీ ముగిసిన తర్వాత పెవిలియన్‌కు చేరాడు. నెట్స్‌లోనూ తీవ్ర ఇబ్బందిపడినట్లు కథనాలు వెలువడ్డాయి. రోహిత్ మాత్రమే కాకుండా.. విరాట్ కోహ్లీకీ ఇలాంటి పరిస్థితే ఎదురైందని అందులో పేర్కొన్నాయి.

**నెట్ ప్రాక్టీస్‌లో రోహిత్‌కు గాయం!**

ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో గాయం కారణంగా మైదానాన్ని వీడిన రోహిత్.. ప్రాక్టీస్ చేస్తున్న సమయంలోనూ గాయమైనట్లు వార్తలు రావడం అభిమానులను కలవరానికి గురి చేసింది. అతడి బొటనవేలికి గాయం అయినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. అది ఏమంత ప్రమాదకరం కాదని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే ఫిజియో వైద్యచికిత్స అందించారు. కాసేపటికే రోహిత్ మళ్లీ ప్రాక్టీస్ మొదలుపెట్టేశాడు. పాకిస్థాన్‌తో మ్యాచ్ కావడంతో ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదనే భావనలో భారత ఆటగాళ్లు ముమ్మరంగా సాధన చేస్తున్నారు.

**రెండుసార్లు మాత్రమే..**

టి20 క్రికెట్ అంటేనే బ్యాటర్ల దూకుడు ఉంటుంది. కానీ, యుఎస్‌ఎలోని న్యూయార్క్ పిచ్ వేదికగా మూడు మ్యాచ్‌లు జరిగాయి. కేవలం రెండుసార్లు మాత్రమే 100+ స్కోర్ మార్క్‌ను తాకడం గమనార్హం. బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శించడం బాగున్నప్పటికీ.. బ్యాటర్లూ దూకుడుగా ఆడేందుకు అవకాశం ఉండాలి. అమెరికాలో క్రికెట్ విస్తరణ కోసం ప్రయత్నిస్తున్న సమయంలో తక్కువ స్కోర్లు నమోదైతే మ్యాచ్‌లను ప్రేక్షకులు ఆసక్తిగా చూసేందుకు ఇష్టపడరనేది క్రికెట్ విశ్లేషకుల అభిప్రాయం.

## ‘కల్కి 2898 ఎడి’ అశ్వత్థామగా యుద్ధానికి సిద్ధమైన అమితాబ్




మోస్ట్ ఎవైటెడ్ అప్ కమింగ్ ఫిక్షన్ ఎపిక్ ‘కల్కి 2898 ఎడి’ భారీ అంచనాలతో కూడిన ట్రైలర్ విడుదలకు కేవలం మూడు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో, మేకర్స్ మూవీపై వున్న ఎక్సయింట్‌ని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెలుతున్నారు. అమితాబ్ యుద్ధభూమి మధ్యలో నిలబడి, అస్త్రాన్ని పట్టుకుని, నుదిటిపై ఒక దివ్య రత్నాన్ని ధరించి, యుద్ధానికి సిద్ధంగా వున్నట్లుగా కనిపించారు. అతని వెనుక ఒక లైఫ్ సైజు వెహికిల్ తో పాటు కొంతమంది వ్యక్తులు నేలపై పడివుండటం గమనించవచ్చు. అతని నిరీక్షణ ముగుస్తోంది... మూడు రోజుల్లో ‘కల్కి 2898 ఎడి’ ట్రైలర్, జూన్ 10న విడుదల అని సోషల్ మీడియాలో షేర్ చేశారు మేకర్స్. అమితాబ్ బచ్చన్ అశ్వత్థామ పాత్ర మధ్యప్రదేశ్లోని నెమావార్, నర్మదా ఘాట్ వద్ద ఒక మ్యాసీవ్ ప్రొజెక్షన్ ద్వారా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నెమవార్, నర్మదా ఘాట్ల ఎంచుకోవడం గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకుంది, ఎందుకంటే అశ్వత్థామ ఇప్పటికీ నర్మదా మైదానంలో నడుస్తాడని నమ్ముతారు.‘కల్కి 2898 ఎడి’ లో ఇండియన్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్స్ అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపికా పదుకొణె, దిశా పటానీ సహా ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. విజనరీ డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. మల్టీలింగ్వల్, మైథాలజీ ఇన్స్పైర్డ్ సైన్స్ ఫిక్షన్ విజువల్ వండర్ ఫ్యూచర్ లో సెట్ చేయబడింది.

లీల

## ‘వైష్ణవ్ తేజ్’ పాత్రపై క్లారిటీ ఇదే

మెగాస్టార్ చిరంజీవి హీరోగా యంగ్ దర్శకుడు వశిష్ట ‘విశ్వంభర’ అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా త్రిష నటిస్తోంది. ఐతే, ఈ సినిమాలో పంజా వైష్ణవ్ తేజ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడు అంటూ రూమర్స్ వైరల్ అవుతున్నాయి. కానీ, విశ్వంభరలో వైష్ణవ్ తేజ్ ఎలాంటి పాత్రలో నటించడంలేదని, అదేవిధంగా మెగాస్టార్ పాత్ర చుట్టూ ఈ కథ సాగుతుందని, మరో ఏ పాత్ర చుట్టూ ‘విశ్వంభర’ కథ సాగదు అని చిత్రబృందం నుంచి క్లారిటీ వచ్చింది. కాగా యువి క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ విశ్వంభర సినిమాకు కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రం జనవరి 10, 2025 న విడుదల కాబోతుంది. అన్నట్టు ‘జగదేకవీరుడు అతిలోకసుందరి’ సినిమాలోని వినోదం, ‘హిట్లర్’ లోని సెంటిమెంట్ ఈ సోషియో ఫాంటసీ సినిమాలో కనిపిస్తాయని తెలుస్తోంది. అన్నట్టు సృష్టి, స్థితి, లయ ఈ మూడింటి నేపథ్యంలో ఈ కథ సాగుతుందట.





## ‘8 వసంతాలు’లో శుద్ధి అయోధ్యగా అనంతిక సనీల్కుమార్

మోస్ట్ సక్సెస్ ఫుల్ పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ బిగ్ స్టార్లతో హైబడ్జెట్ ఎంటర్టైనర్లను నిర్మించడమే కాకుండా కంటెంట్ రిచ్ మూవీలను రూపొందిస్తోంది. గోవా, ఖాట్మండు మోఫిల్మ్ ఫెస్టివల్స్ లో రెండుసార్లు ఇంటర్నేషనల్ అవార్డులు గెలుచుకుని విమర్శకుల ప్రశంసలు పొంది ’మను’తో దర్శకుడిగా డెబ్యు చేసి దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టితో కాన్సెప్ట్ బేస్డ్ మూవీ ‘8 వసంతాలు’ను నిర్మిస్తున్నారు. మాడ్ ఫేమ్ అనంతిక సనీల్కుమార్ హీరోయన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఆమె పాత్రను శుద్ధి అయోధ్యగా పరిచయం చేశారు మేకర్స్. చెమ్మగిల్లిన కళ్లతో కదులుతున్న కవితలా, నవ్వుతూ కనిపించారు. కళ్లకు మాస్కరా, చెవిపోగులు, నోస్ రింగ్ ఆమెను మరింత ఆకర్షణీయంగా కనిపించేలా చేశాయి. ఆమె సెన్సిబుల్ డాటర్, మంచి స్నేహితురాలు, అన్ కండీషనల్ లవర్, ఇంటెన్స్ మార్షల్ ఆరట్స్ స్టూడెంట్, ఇన్స్పైరింగ్ రైటర్, గ్రేస్ ఫుల్ హ్యూమన్ బీయింగ్. శుద్ధి అయోధ్య 19 ఏళ్ల నుండి 27 ఏళ్ల యువతి వరకు 8 సంవత్సరాల వ్యవధిలో విభిన్నమైన వ్యక్తులు, భావోద్వేగాలు, ప్రదేశాలను ఎక్స్ ప్లోర్ చేయడంలో8 వసంతాల ట్రాన్స్ ఫర్మేషన్ జర్నీని ప్రజెంట్ చేస్తోంది. ఆమె వ్యక్తిత్వం ఆమె పేరు శుద్ధిని ప్రతిబింబిస్తుంది, ఆమె జీవితంలోని ప్రతి అంశంలో ’స్వచ్ఛత’ గా వుంటుంది. ఆమె మాటలు, ఆలోచనలు, పనులు, దయ, డిగ్నిటీ ని ప్రజెంట్ చేస్తాయి.

## మణిపూర్‌లో మళ్ళీ హింస, గృహదహనాలు

### శాంతి భద్రతల్లో విఫలమైన ఎస్‌పి బదిలీ

**ఇంఫాల్ :** మణిపూర్‌లో మళ్ళీ గృహదహనాలు జరిగాయి. శాంతి భద్రతల పరిరక్షణలో విఫలమైన జిరిబమ్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎ.ఘనశ్యామ్ శర్మను తక్షణం అక్కడి నుండి మరోచోటకు బదిలీ చేశారు. జిరిబమ్ జిల్లాలో అల్లరిమూకలు 70 గృహాలను దహనం చేశాయి. దీంతో పాటు మరో రెండు పోలీస్ ఔట్‌పోస్టులను కూడా వారు దహనం చేశారు. ఉగ్రవాదులే ఈ ఘటనలకు పాల్పడ్డారని భావిస్తున్నారు. ఈ అల్లర్లను అదుపు చేసేందుకు హుటాహుటిన 70 రాష్ట్ర పోలీస్ కమాండోలను గగనతలమార్గంలో జిరిబమ్ జిల్లాకు తరలించినట్లు అధికార వర్గాలు తెలిజేశాయి. జిరిబమ్‌లో ఈ ఘటనలు జరిగిన ప్రాంతాల నుండి మైతీ వర్గానికి చెందిన 239 మంది ఇళ్ళు ఖాళీ చేసి వెళ్ళిపోయారు. వీరంతా కొత్తగా ఏర్పాటు చేసిన సహాయ శిబిరానికి వెళ్ళి తలదాచుకున్నారు. జిల్లాలోని మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వారికి తాత్కాలిక సదుపాయం ఏర్పాటు చేశారు. సీనియర్ అధికారులు చెప్పిన సమాచారం ప్రకారం, లామ్‌తాయ్ ఖునౌ, దిబోంగ్ ఖునౌ, నన్‌ఖల్, బెగ్రా గ్రామాలలో 70 ఇళ్ళను ఉగ్రవాదులు దహనం చేశారు. ఈ గ్రామాలలో నివసించే ప్రజలు తక్షణం ఇళ్ళు ఖాళీ చే సహాయ శిబిరాలకు వెళ్ళిపోయారు. జిరిముఖ్, ఛోటో బెక్రా, గోవాఖాల్ ఫారెస్ట్ బీట్ లను ఉగ్రవాదులు దహనం చేసిన గంటల వ్యవధిలోనే జిల్లా ఎస్‌పిని వైఫల్యం కారణంగా చూపించి బదిలీ చేశారు. ఎస్‌పి శర్మను మణిపూర్ పోలీస్ ట్రైనింగ్ కాలేజీ అదనపు డైరెక్టర్ పదవికి బదిలీ చేశారు. ఈ కాలేజీలో ఇంతవరకూ పనిచేసిన ఎడి ప్రతాప్ సింగ్ జిరిబమ్ జిల్లా ఎస్‌పి బాధ్యతలు తీసుకుంటారు. రాష్ట్రంలో మళ్ళీ హింస చెలరేగడంపై ఇన్నర్ మణిపూర్ లోక్‌సభ స్థానానికి కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపి అంగోమ్చా బిమోల్ అకోయిజమ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జిరిబమ్ జిల్లాలో ప్రజల ప్రాణ మాన ధనాలను రక్షించాలని కోరారు. గురువారం రాత్రి జిరిబమ్ జిల్లాలో హింస చెలరేగింది. ఉగ్రవాదులు 59 ఏళ్ళు వయసుగల ఒక వ్యక్తిని హతమార్చారు. ఈనెల 6వ తేదీన పొలం పనులకు వెళ్ళిన రైతు సోయిబమ్ శరత్‌మార్‌గా మృతుణ్ణి గుర్తించారు.గత ఏడాది మే నెలలో మణిపూర్‌లో హింసాకాండ ప్రారంభం అయింది. అప్పటినుండీ 200 మంది హతులయ్యారు. వేలాదిమంది ఇళ్ళు కోల్పోయారు.

## జమ్మూ కశ్మీరు అసెంబ్లీ ఎన్నికలకు అధికారిక ప్రక్రియ షురూ

**శ్రీనగర్ :** జమ్మూ కశ్మీరు అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించడంకోసం భారత ఎన్నికల సంఘం అధికారికంగా ఎన్నికల ప్రక్రియను ప్రారంభించింది. జమ్మూ కశ్మీరు కేంద్ర పాలిత ప్రాంత అసెంబ్లీకి ఎన్నికల నిర్వహిచడంకోసం 1968 నాటి ఉత్తర్వులోని (రిజర్వేషన్–అలాట్‌మెంట్) 10 బి పేరాలో ఎన్నికల గుర్తుల ప్రస్తావనకు అనుగుణంగా సాధారణ చిహ్నాల కేటాయింపును కోరుతూ దరఖాస్తులను పార్టీల నుండి స్వీకరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. తక్షణ ప్రాతిపదికపై ఆ అంశం అమలులోకి వస్తుందని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి జయదేవ్ లాహిరి శనివారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం భారత ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ ఒక ప్రకటనలో, ఈ కేంద్ర పాలిత ప్రాంతంలో జమ్మూ కశ్మీరు ప్రజలు త్వరలోనే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటారన్నారు. ఇంతకుముందు జమ్మూ కశ్మీరులో 2014లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. బిజెపి, పిడిపి సారథ్యంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. ముఫ్తీమహ్మాద్ సయీద్ ఆనాడు ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చారు. 2016లో ముఫ్తీ మహ్మాద్ సయీద్ మరణించిన తర్వాత ఆయన కుమార్తె మెహబూబా ముఫ్తీ ఈ సంకీర్ణ కూటమికి సారథ్యం వహించారు. 2019 జూన్ 18వ తేదీన బిజెపి ఈ సంకీర్ణ కూటమి నుండి వైదొలగింది. దాంతో ముఖ్యమంత్రి పదవికి మెహబూబా ముఫ్తీ రాజీనామా చేశారు. రాష్ట్రపతి పాలన అనంతరం గవర్నర్ పరిపాలన ప్రారంభమైంది. 2019 ఆగస్టు 5వ తేదీన జమ్మూ కశ్మీరుకు ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని తొలగిస్తూ 370వ అధికరణను, 35 ఎను కేంద్రం పార్లమెంటు ద్వారా రద్దు చేసింది. దాంతో జమ్మూ కశ్మీరు కేంద్ర పాలిత ప్రాంతం స్థాయికి దిగజారింది. ఇక అప్పటినుండీ జమ్మూ కశ్మీరులో లెఫ్టినెంట్ గవర్నరే ఈనాటి వరకూ పరిపాలన కొనసాగిస్తున్నారు.

# మోదీకి నేతృత్వం వహించే నైతికహక్కు లేదు

పదేళ్ళలా సాగదు.. పార్లమెంటులో చర్చలు జరగాల్సిందే
నూతన ఎంపిల సమావేశంలో సిపిపి నేత సోనియాగాంధీ



**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయ, నైతిక పరాజయం పొందారని, ఆయన నేతృత్వం వహించే నైతిక హక్కును కోల్పోయారని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ అన్నారు. న్యూఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో శనివారం కాంగ్రెస్ నూతన ఎంపిల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సోనియాగాంధీ మాట్లాడుతూ తన వైఫల్యానికి బాధ్యత తీసుకోకుండా ప్రధానిగా మూడవసారి ప్రమాణస్వీకారం చేసేందుకు సిద్ధపడుతున్నారని విమర్శించారు. ఆయన తన పరిపాలన పద్ధతిని, వైఖరిని మార్చుకుంటారని తాము ఆశించడం లేదని, ప్రజల ఆకాంక్షను కూడా పరిగణలోకి తీసుకుంటాడని భావించడం లేదన్నారు. పార్టీ, మిత్రపక్షాలను పక్కనబెట్టి ప్రధాన మంత్రి పూర్తిగా తన పేరుతోనే ప్రజా తీర్పును కోరారని, రాజకీయంగా, నైతికంగా ఓటమి పాలయ్యారని అన్నారు. వాస్తవంలో ఆయన కోరిన విధంగా ప్రజా తీర్పు రాలేదని, కాబట్టి నేతృత్వం వహించే హక్కును కోల్పోయారని అన్నారు. కాబట్టి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సభ్యులుగా ఎంపిలందరూ ఆయన , ఆయన నేతృత్వంలోని నూతన ఎన్‌డిఏ ప్రభుత్వ జవాబుదారీతనం గురించి జాగ్రత్తగా, నిశితంగా గమనించాలని, చురుకుగా వ్యవహరించాలని కోరారు. గడిచిన దశాబ్దంలో మాదిరిగా పార్లమెంటును ఇకపై ఏకపక్షంగా కొనసాగించలేరని, ఇకపై ఎంత మాత్రం అధికార పార్టీ పార్లమెంటును అడ్డుకోలేదని, సభ్యుల పట్ల అగౌరవంగా వ్యవహరించలేదని, ఏ చట్టాన్ని చర్చ, పద్ధతి లేకుండా ఆమోదించలేరని స్పష్టం చేశారు. 2014 తరువాత జరిగినట్లుగా పార్లమెంటరీ కమిటీలను పట్టించుకోని పరిస్థితి ఇక ఉండకూడదన్నారు. ఇకపై పార్లమెంటులో గొంతు నులమలేరని చెప్పారు. రాజ్యాంగంలోని లౌకిక, ప్రజాస్వామ్య విలువలు పతనం అయ్యేందుకు, విభజనవాదం పెరిగేందుకు జరిగే ప్రయత్నాలను కాంగ్రెస్ ఎంపిలు అప్రమత్తంగా అడ్డుకోవాలన్నారు. వాటిని తిప్పికొట్టాలని కోరారు. ఇండియా కూటమి పక్షాలతో కాంగ్రెస్ బలం మరింత పెరిగిందని సోనియాగాంధీ అన్నారు. భారత్ జోడో యాత్రలు చారిత్రాత్మక ఉద్యమాలని, మునుపెన్నడూ లేని విధంగా వ్యక్తిగత, రాజకీయ దాడులను పట్టుదల, నిబద్ధతలతో ఎదుర్కొన్న రాహుల్‌గాంధీ ప్రత్యేక అభినందనలకు అర్హుడు అని సోనియాగాంధీ ప్రశంసించారు. రాజ్యాంగ పరిరక్షణ, గ్యారంటీల కేంద్రంగా చురుకుగా వృత్తాంతాన్ని రూపొందిచాడని అన్నారు. అంచనాల కంటే తక్కువ స్థానాలు వచ్చిన రాష్ట్రాలలో పరిస్థితి మెరుగుపరుచుకునేందుకు ఏమి చేయాలనే అంశంపై ఎంపిలు చూడాలని అన్నారు.

## నెహ్రూకూ మోదీ సరిజోడు కాదు

ఇది ఆయన నైతిక, రాజకీయ, వ్యక్తిగత వైఫల్యం
జైరామ్ రమేశ్ విమర్శ



**న్యూఢిల్లీ :** పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు నరేంద్రమోదీకి నైతిక, రాజకీయ, వ్యక్తిగత వైఫల్యమని కాంగ్రెస్‌పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. ఇక మీదట ప్రధానమంత్రి నరేంద్రమోదీ అత్యంత విషాదకరమైన తన ఎన్నికల పనితీరు వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసం ప్రయత్నాలు ప్రారంభిస్తారని విమర్శించారు. జూన్ 4న వెలువడిన ఎన్నికల ఫలితాల్లో 543 లోక్‌సభ స్థానాలకుగాను బిజెపికి 240 స్థానాలు గెలుచుకుని దేశంలో ఏకైక పెద్దపార్టీగా అవతరించగా, ఎన్‌డిఎ కూటమి మొత్తంగా 293 స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీ 99 స్థానాల్లో విజయం సాధించగా మరో సానుభూతి పరుడు, ఇండిపెండెంట్‌గా గెలిచిన విశాల్ పాటిల్ వచ్చి కాంగ్రెస్‌కు మద్దతు తెలియజేయడతో ఈ సంఖ్య 100కు చేరింది. ఇకమీదట నరేంద్రమోదీ నైతిక, రాజకీయ, వ్యక్తిగత వైఫల్యాలకు, ఆయన ఓటమికి గల కారణాలలోని ప్రముఖ అంశాలను ప్రధానంగా వెలుగులోకి తెచ్చి ప్రజలకు వివరించే ప్రక్రియ ప్రారంభం అవుతుందని అన్నారు. నెహ్రూ తర్వాత దేశంలో వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా గెలిచి బాధ్యతలు చేపట్టిన వ్యక్తిని తానేనని ఆయనే ప్రచారం ప్రారంభించారనీ, ఐతే ఆయనకు నెహ్రూకు ఎక్కడా పొంతన, సాపత్యం లేదని అన్నారు. నెహ్రూ వరుసగా మూడూసార్లు భారీగా పూర్తి మెజారిటీలో అధికారంలో కొనసాగారనీ, కానీ మోదీ మాత్రం తన నైతిక, రాజకీయ, వ్యక్తిగత వైఫల్యాలవల్ల తన పార్టీకి పూర్తి మెజారిటీ తెచ్చుకోలేక ఇతర పార్టీలపై ఆధారపడి మూడోసారి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. జవహర్‌లాల్ నెహ్రూకు 1952లో మొదటిసారి జరిగిన ఎన్నికల్లో 364 స్థానాలు లభించగా, 1957 ఎన్నికల్లో 371 స్థానాలు, 1962 లోక్‌సభ ఎన్నికల్లో 361 స్థానాల మెజారిటీ లభించిందని చెప్పారు. ఆయనకు లోక్‌సభలో కాంగ్రెస్‌పార్టీ తరపున మూడింట రెండు వంతుల మెజారిటీ వచ్చిందని, కానీ నరేంద్రమోదీ మాత్రం ఆ విధంగా, ఆ స్థాయిలో ప్రమాణస్వీకారం చేయలేదన్నారు. అతల్ బిహారీ వాజ్‌పాయ్ 1996, 1998, 1999 సంవత్సరాల్లో మూడుసార్లు ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారనీ, ఇందిరాగాంధీ నాలుగుసార్లు 1966, 1967, 1971, 1980 సంవత్సరాలలో ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని, ఏ విధంగా చూసినాగానీ 2024లో నరేంద్రమోదీ సాధించిన విషాదకరమైన ఎన్నికల విజయం వారితో సాటి రాదని జైరామ్ రమేశ్ విమర్శించారు.

## నితీశ్‌కు ప్రధాని పదవి? ‘ఇండియా’ ఆఫర్..!



**న్యూఢిల్లీ :** కేంద్రంలోని బిజెపిని ఓడించడమే లక్ష్యంగా ఏర్పడిన ‘ఇండియా’ కూటమి బీహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌కు ప్రధాన మంత్రిగా ఆఫర్ ఇచ్చినట్లు జెడియు వర్గాలు వెల్లడించాయి. అయితే, ఆయన మాత్రం ఆ ఆఫర్‌ను తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఆ పార్టీ నేత కెసి త్యాగి ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. ‘ఇండియా కూటమి నీతీశ్ కుమార్‌కు ప్రధాన మంత్రిగా ఆఫర్ ఇచ్చింది. ఆయన మాత్రం ఆ అవకాశాన్ని తిరస్కరించారు. దీని గురించి నేరుగా నీతీశ్‌ను కలిసేందుకు కొందరు నేతలు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం మేము ఎన్‌డిఏ కూటమితో ఉన్నాం. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసే ప్రసక్తే లేదు’ అని త్యాగి పేర్కొన్నారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు భిన్నంగా సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. ఎన్‌డిఏ కూటమి 293 సీట్లు సాధించగా.. ఇండియా కూటమి ఆ అంచనాలకు మించి 234 స్థానాలను సొంతం చేసుకుంది. ఈ క్రమంలోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకునేందుకు ఇండియా కూటమి తన సంఖ్యా బలాన్ని పెంచుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించిందని వార్తలు వినిపించాయి. అందుకోసం ఎన్డీయే మిత్రపక్షాలైన తెలుగు దేశం పార్టీ, జెడియులను తమ కూటమిలో చేర్చుకునేందుకు యత్నించిందని ఊహాగానాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నీతీశ్‌కు వచ్చిన ఆఫర్ గురించి తాజాగా పార్టీ నేత చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దీనిపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. త్యాగి చేసిన వ్యాఖ్యలను ఖండించింది. ‘నీతీశ్‌ను ప్రధానిగా చేసేందుకు ఇండియా కూటమి సంప్రదించడంపై కాంగ్రెస్‌కు ఎలాంటి సమాచారం లేదు. ఈ విషయం గురించి కేవలం ఆయనకు మాత్రమే తెలుసు’ అని హస్తం పార్టీ నేత కెసి వేణుగోపాల్ కౌంటర్ ఇచ్చారు.



## రష్యా గ్రామంపై ఉక్రేన్ దాడి 22 మంది మృతి

**మాస్కో :** రష్యా సరిహద్దు గ్రామంపై ఉక్రేన్ జరిపిన దాడుల్లో 22 మంది ప్రజలు మరణించారు. రష్యా ఖెర్సాన్ రీజయన్ సడొవోయే గ్రామంలోని ఒక స్టోర్స్‌పై ఉక్రేన్ జరిపిన గగనతలదాడుల్లో 22 మంది మరణించినట్లు ఆ ప్రాంత గవర్నర్ వ్లదీమీర్ సాల్డో చెప్పారు. 2022 ఫిబ్రవరి నుండీ రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం కొనసాగుతున్నది. గ్రామంపై ఉక్రేన్ రెండుసార్లు దాడులు చేసిందనీ, ఒకసారి ఫ్రెంచ్ గైడెడ్ ఏరియల్ బాంబులతోనూ, రెండోసారి అమెరికా హిమార్స్ ప్రొజెక్టైల్స్‌తోనూ ఈ దాడులు చేసిందని రష్యా ప్రకటించింది. దాడి జరిగిన సమయంలో పెద్ద సంఖ్యలో ఈ స్టోర్స్‌లో ఖాతాదారులు ఉన్నారు. కాగా రష్యా కూడా శుక్రవారం నాడు తూర్పు ఈ శాన్య ఖార్ఖీవ్‌లో దాడులు చేసింది. ఉక్రేన్ సైన్యాలు ఎదురుదాడి చేశాయి. కాగా ఉక్రేన్ సైన్యం కూడా ఒక ప్రకటన చేస్తూ, రష్యా ప్రయోగించిన 13 డ్రోన్‌లలో తొమ్మిది డ్రోన్‌లను తమ సైన్యం కూల్చిలేసిందని పేర్కొంది. క్రేన్‌కు ఇటీవల యూరప్ అమెరికా దేశాలనుడి ఆయుధ సహాయం లభిస్తుండగా ఆధునిక ఆయుధాల సరఫరాకు కూడా ఫ్రాన్స్, జర్మనీ, అమెరకాల నుండి భారీస్థాయిలో వాగ్దానాలు లభించాయి. ఫ్రాన్స్‌దేశం ఉక్రేన్ సైనికులకు సహాయం చేసేందుకు శిక్షణ ఇచ్చేందుకు ముందుకు రావడంతో ఆ దేశ అధ్యక్షుడు జెలెన్స్కీ ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంకోవైపు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా నార్మండీలో డి–డే సందర్భంగా జెలెన్స్కీని కలుసుకుని బహిరంగంగా క్షమాపణలు తెలియజేశారు. సకాలంలో ఉక్రేన్‌కు ఆయుధాలు సరఫరా చేయకుండా ఆ ఒప్పందాన్ని నిలిపి ఉంచడంపై ఆయన బాహాటంగా ఈ క్షమాపణలు తెలియజేశారు. కాగా జెలెన్స్కీ కూడా తనకు సైనిక సహాయం చేస్తున్న ఫ్రాన్స్ సహా అన్ని దేశాలకు కృతజ్ఞతలు తెలియేశారు.